సత్యం, సమర్థత, విశ్వసనీయత
WWW.SAKSHYAM.COM
# సాక్ష్యం
తెలుగు దినపత్రిక
సంపుటి: 17 | సంచిక: 146
పేజీలు: 08 | వెల: రూ.2:00
హైదరాబాద్ | ఆదివారం 24 మే 2026
Published from Hyderabad, Vijayawada.

## పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

### ఇరాన్‌పై దాడులకు అమెరికా సన్నద్ధమైనట్లుగా వార్తలు

### తమ గగనతలాన్ని మూసేస్తూ ఇరాన్ ఆదేశాలు

టెహ్రాన్,మే23(సాక్ష్యం): పశ్చిమాసియాలో పరిస్థితులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఓవైపు చర్చలు కొనసాగుతుండగానే.. ఇరాన్‌పై మరోసారి దాడికి దిగేందుకు అమెరికా సన్నద్ధమవుతుందంటూ వార్తలు వెలువడ్డాయి. ఈ క్రమంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్ తన గగనతలాన్ని మూసివేసింది. దేశంలోని పశ్చిమ ప్రాంతం వైపున్న గగనతలాన్ని మూసివేస్తున్నట్లు ఇరాన్ పౌర విమానయాన సంస్థ విమానయాన సిబ్బందికి నోటమ్ జారీ చేసింది. ఈనెల 25 వరకు అన్ని విమానాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు తెలిపింది. ఈ నోటమ్ జారీ చేసే సమయంలో ఖతార్ ప్రభుత్వానికి చెందిన ఓ వీఐపీ విమానం ఇరాన్ గగనతలాన్ని దాటింది. ఆ విమానం శాంతి ఒప్పందానికి సంబంధించిన చర్చల కోసం టెహ్రాన్‌కు వచ్చిన ఖతార్ ప్రతినిధి బృందానికి చెందినదిగా తెలుస్తోంది. ఇక, అమెరికా- ఇరాన్ మధ్య చర్చలు తుది దశకు చేరుకున్నాయని, ఒప్పందానికి సంబంధించిన చాలా అంశాల్లో

మిగతా 2 లో..



## వరుసగా మూడోసారి పెట్రో ధరల పెంపు

**పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై 91 పైసల వాయింపు**

న్యూఢిల్లీ,మే24(సాక్ష్యం): పెట్రోల్ డీజిల్ ధరలు వరుసగా మూడోసారి పెరిగాయి. శనివారం పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్ పై కేంద్ర ప్రభుత్వం 91 పైసలు పెంచింది. 10 రోజుల్లో ధరలు

మిగతా 2 లో..




## దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

**చిన్నారుల అంతర్ధానంపై సుప్రీంకోర్టు ఆందోళన**
**కిడ్నాప్ కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేయండి**
**అన్ని రాష్ట్రాలకు సుప్రీం ధర్మాసనం కీలక ఆదేశం**

న్యూఢిల్లీ,మే24(సాక్ష్యం): దేశవ్యాప్తంగా నానాటికీ పెరిగిపోతున్న చిన్నారుల అదృశ్యం కేసులపై దేశ

మిగతా 2 లో..



## పర్సంటేజీ అయితనే సినిమా ఆడుద్ది

- పెద్ది సినిమా నుంచే మొదలు పెడదాం
- రెంటల్ సిస్టమ్ కాలం చెల్లిన విధానం
- తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్

హైదరాబాద్,మే24(సాక్ష్యం): తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ కీలక నిర్ణయం తీసుకుంది. పెది

మిగతా 2 లో..



## భద్రత, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో సహకారం

**అమెరికాకు భారత్ కీలక భాగస్వామి**
**మోడీతో అమెరికా విదేశాంగ మంత్రి రూబియో చర్చలు**

న్యూఢిల్లీ,మే24(సాక్ష్యం): భద్రత, వాణిజ్యం, సాంకేతిక రంగాలలో అమెరికా-భారత్ సహకారాన్ని మరింతగా పెంపొందించే మార్గాలపై ప్రధాని మోదీతో చర్చించినట్లు అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పేర్కొన్నారు. తమ దేశానికి భారత్ ఓ కీలక భాగస్వామి అన్నారు. అమెరికా- భారత్ మధ్య వాణిజ్య సంబంధాలు మరింత బలపడుతున్నాయని.. భారతీయ కంపెనీలు తమ దేశంలో 20 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టాయని తెలిపారు. నాలుగు రోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు చేరుకున్న మార్కో రూబియో ప్రధాని మోదీతో సమావేశమయ్యారు. వైట్‌హౌస్‌ను సందర్శించాలని

మిగతా 3 లో..

## 25 నుంచి 'రైతు గోస- భాజపా భరోసా'

హైదరాబాద్,మే24(సాక్ష్యం): ఈ నెల 25 నుంచి 'రైతు గోస- భాజపా భరోసా' పేరిట పోరుబాట నిర్వహించేందుకు భాజపా సిద్ధమవుతోంది. తొలిరోజు

మిగతా 3 లో..

**ఇందిరమ్మ ఇళ్లు రెండో విడత జూన్ 1న ప్రారంభం కానుందని రాష్ట్ర గృహనిర్మాణ శాఖ పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. రెండో విడతలో నియోజకవర్గానికి 2 వేల ఇళ్లు ప్రారంభిస్తామని తెలిపారు. నియోజకవర్గానికి 1,500 మంది స్థలాలు ఉన్నవారికి రూ.5 లక్షలు కేటాయిస్తామన్నారు. అసంపూర్తిగా ఉన్న 500 ఇళ్లకు నిధులు కేటాయిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 14,800 పూరి గుడిసెలు ఉన్నట్టు గుర్తించామన్నారు. రెండో విడతలో వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. దీనికి సంబంధించిన పలు అంశాలను మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు.**

# రెండోవిడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు

## గోదావరి పుష్కరాలకు వేయికోట్లు

### ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున మంజూరు

### పాత ఇందిరమ్మ ఇల్ల పూర్తికి నిధులు కేటాయింపు

### జూన్ 1న ఆదివాసీల ఇందిరమ్మ కాలనీ ప్రారంభం

- జూనియర్ కాలేజీల్లో మహద్యాహ్న భోజనం
- గంగాధర కాలేజీలో పోస్టుల భర్తీకి ఆమోదం
- కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరు
- తెలంగాణ మంత్రివర్గం ఆమోదం
- క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు
- కేబినేట్ నిర్ణయాలను వివరించిన పొంగులేటి




హైదరాబాద్,మే24(సాక్ష్యం): వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల నేపథ్యంలో.. సంబంధిత పనులకు రూ.వెయ్యి కోట్ల కేటాయిస్తూ తెలంగాణ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తొలి విడతగా రూ.300 కోట్ల మంజూరుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన క్యాబినెట్ భేటీలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. జూనియర్ కళాశాలల్లోనూ మధ్యాహ్న భోజనం పథకం అమలుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో అల్పాహారం, పాలు అందించాలని నిర్ణయించింది. అస్సాం రైఫిల్స్, బీఎస్ఎఫ్, సీఐఎస్ఎఫ్ సెంటర్ల ఏర్పాటుకు కరీంనగర్ జిల్లాను ఎంపిక చేసింది. కేసముద్రం ఫైర్‌స్టేషన్‌కు 18 పోస్టుల మంజూరుకు అంగీకారం తెలిపింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన తెలంగాణ కేబినెట్ శనివారం భేటీ అయ్యింది. రాష్ట్రానికి సంబంధించి పలు అంశాలపై మంత్రిమండలి చర్చించింది. ఈ సందర్భంగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు చేసేందుకు క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. పాఠశాలలతో పాటు జూనియర్ కళాశాలల్లోనూ విద్యార్థులకు ఉదయం అల్పాహారం, పాలు అందించాలని మంత్రిమండలి నిర్ణయించింది. 2027 గోదావరి పుష్కరాల పనులకు రూ. 1,000 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ క్యాబినెట్ ఆమోదం తెలిపింది. తొలివిడతగా రూ. 300 కోట్లు మంజూరుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మరోవైపు నిరుద్యోగ యువతకూ మంత్రిమండలి గుడ్ న్యూస్ చెప్పింది. కరీంనగర్ జిల్లా గంగాధరలోని డిగ్రీ కళాశాలలో నియామకాలకు పచ్చజెండా

మిగతా 2 లో..

## యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

**దేశవ్యాప్తంగా రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి ఉద్యోగాలు**
**ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగావకాశాలు**
**19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**



హైదరాబాద్,మే24(సాక్ష్యం): దేశవ్యాప్తంగా 47 ప్రాంతాల్లో జరిగిన రోజ్‌గార్ మేళాలో 51 వేల మందికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు ఇచ్చామని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. యువత స్వయం సమృద్ధి సాధించి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. శనివారం నాడు బోయిగూడలోని రైల్ కళారంగ్‌లో జరిగిన 19వ రోజ్‌గార్ మేళాలో కేంద్ర మంత్రి పాల్గొని ప్రసంగించారు. ఈరోజు 220 మంది కొత్తగా ఉద్యోగాల్లో

మిగతా 3 లో..



# రూ.43.80 కోట్లతో వేద పాఠశాల

## యాదగిరిగుట్టలో సీఎం పర్యటన

### వందకోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### రూ.43.80 కోట్లతో వేదపాఠశాలకు భూమిపూజ

యాదగిరిగుట్ట,మే23(సాక్ష్యం): యాదగిరిగుట్టలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా రూ.100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవంత్ శ్రీలక్ష్మీనర్సింహ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం రూ.43.80 కోట్లతో నిర్మించనున్న వేద పాఠశాలకు రేవంత్

మిగతా 2 లో..

# దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

### తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్

**వడదెబ్బకు 16 మంది మృతి చెందినట్లు గుర్తింపు**
**మృతుల కుటుంబాలకు 4లక్షల చొప్పన పరిహారం**
**పరిస్థితిపై అధికారులతో మంత్రి పొంగులేటీ సమీక్ష**

హైదరాబాద్,మే23(సాక్ష్యం): రాష్ట్రవ్యాప్తంగా హీట్ వేవ్‌పై హై అలర్ట్ ప్రకటించినట్లు తెలంగాణ రెవెన్యూ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. తీవ్ర ఉష్ణోగ్రతలపై మంత్రి పొంగులేటి సచివాలయంలో శనివారం అత్యవసర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు కీలక అంశాలపై మంత్రి దిశానిర్దేశం చేశారు. వడగాల్పులతో

మిగతా 3 లో..

- బయటకు రావాలంటే భయపడతున్న జనం
- తెలుగు రాష్ట్రాల్లో మండుటెండలు
- కొత్తగూడెంలో అత్యధికంగా 47 డిగ్రీలు
- ఉమ్మడి పాలమూరులో గాలివాన బీభత్సం
- పిడుగుపాటుకు ఒక వ్యక్తి, పశువులు మృతి



న్యూఢిల్లీ,మే23(సాక్ష్యం): దేశంలో భానుడు తన ఉగ్రరూపం చూపిస్తున్నాడు. చాలా ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండలు భగభగ మండుతున్నాయి. జనం ఇళ్ల నుంచి అడుగు బయటపెట్టాలంటే భయంతో వణికిపోతు న్నారు. అత్యవసర పనులు ఉంటే తప్ప ఇళ్లకే పరిమితం అవుతున్నారు. రానున్న వారం రోజులపాటు కూడా తీవ్రమైన వడగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. రెండు తెలుగు

మిగతా 3 లో..

# సంపాదకీయం

## రిజర్వేషన్లతో కొందరికే లబ్ది!

స్వాతంత్ర్యం లభించి 80ఏళ్లకు చేరువలో ఉన్నాం. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ప్రజలు త్యాగాలు చేస్తుంటే కొందరు ఫలితాలు అనుభవిస్తున్నారు. ముఖ్యంగా భారతదేశంలో రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులు అనుభవిస్తున్న లగ్జరీ జీవితం అంతా ఇంతా కాదు. ఒక్కసారి ఎమ్మెల్యే, ఎంపి అయితే చాలు..జీవితాంతం సుఖంగా బతికేయవచ్చున పరిస్థితి ఏర్పడింది. పేరుకే ప్రజాస్వామ్యం కానీ.. అదృష్టమంతా ప్రజాప్రతినిధులదే. అధికారాన్ని గుప్పిట్లో పెట్టుకుని ప్రజలను ఓట్లేసే పురుగుల్లా చూస్తున్నారు. కొన్ని తాయిలాలు ప్రకటించి, మొత్తం అధికారం, ఆర్థిక స్వేచ్ఛ వారు అనుభవిస్తున్నారు. అందుకే ప్రజల్లో నివురుగప్పిన నిప్పులా ఉన్న ఆగ్రహం అప్పుడప్పుడు కట్టలు తెంచుకుంటోంది. ఒక్కోసారి చిన్న సమస్యగా ఉన్న వ్యవహారం పెద్ద ఎత్తున ఉవ్వెత్తున ఎగిసి పడుతోంది. ఇటీవల కాక్రోచ్ జనతా పార్టీ ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవాలి. ప్రజల్లో ఏమూలో దాగివున్న ఆగ్రహం ఇలా బయటకు వస్తోంది. వివిధ రూపాల్లో ఉన్న వ్యతిరేకత ఒక్కటైతే రాజకీయ పార్టీల నేతలు తట్టుకోవడం కష్టం. అనేక దేశాల్లో ఇలాగే ప్రజాగ్రహం కట్టలు తెంచుకున్న సంగతి చూశాం. నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, వెనిజులా తదితర దేశాల్లో ప్రజల ఆగ్రం ఎలా పరిణమించిందో చూశాం. అందువల్ల పాలకులు ప్రజాసంక్షేమం కోరి నిర్ణయాలు తీసుకోవాలి. వాటిని ఆచరణలో పెట్టాలి. నిరంతరం సమస్యలతో పోరాడుతున్న ప్రజలను పట్టించుకోవాలి. తమ సుఖం కాదు..ప్రజల సంక్షేమం ముఖ్యమని గమనించాలి. ధాన్యం కొనుగోలల్లు కావచ్చు, ఫీజుల మోత కావచ్చు...నిరుద్యోగం కావచ్చు...ఇలా అనేక సమస్యలపై ప్రజల్లో ఆందోళనలు గూడుకట్టుకుని ఉన్నాయి. అంఉదకే తరతరాలుగా అధికారంలో తామే ఉండాలన్న కుటిల రాజకీయాలు మానాలి. ఇకపోతే తాజాగా సుప్రీం ధర్మాసనం రిజర్వేషన్ల తీరుపై అసహనం వ్యక్తం చేసింది. దీనిపై చర్చ జరగాలి. చట్టసభల్లో ఇలాంటి వాటిపై చర్చించాలి. కొందరే రిజర్వేషన్ల ఫలాలు అనుభవించడంపై సుప్రీం సంచలన వ్యాఖ్యలు చేసింది. కొందరే వీటిని పదేపదే అనుభవించడం ద్వారా మిగతావారికి అడ్డుపడుతున్నారని అభిప్రాయపడింది. గతంలో సిజెఐగా పనిచేసిన బిఆర్ గవాయ్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. క్రిమిలేయర్ ఉండాలని ఆయన ఆనాడు అభిప్రాయ పడ్డారు. కొందరు రిజర్వేషన్లు అనుభవించాక, తమ కుటుంబంలోని వారంతా అదే రిజర్వేషన్ల మెట్లెక్కాలని చూస్తున్నారు. తాజాగా ఇప్పుడు సుప్రీం ధర్మాసనం కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేసింది. వెనుకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా అభివృద్ధి చెందిన కుటుంబాల పిల్లలకు రిజర్వేషన్ ప్రయోజనాలను కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. ఉన్నత స్థితికి చేరుకున్న కుటుంబాలు పదేపదే రిజర్వేషన్ ప్రయోజనాలు పొందడంపై ఆందోళన వ్యక్తం చేసింది. ఎందుకంటే ఇలా ర ఇజర్వేషన్లు పొందిన వారు రాజకీయంగా వారే స్థిరపడిపోతున్నారు. ఉన్నత శ్రేణి ఉద్యోగలు సాధించిన ఐఎఎస్, ఐపిఎస్‌లు కూడా తమ పిల్లకు రిజర్వేషన్లు పొందుతున్నారు. దీనినే సుప్రీం ధర్మాసనం ప్రశ్నించింది. దేశంలో రిజర్వేషన్ల ఫలాలు అందుకొని సామాజికంగా, ఆర్థికంగా ఉన్నత స్థాయికి చేరిన కుటుంబాలు.. తరతరాలుగా అదే కోటాను కోరుకోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. 'తల్లిదండ్రులు ఇద్దరూ ఐఏఎస్ అధికారులై, ప్రభుత్వ సర్వీసుల్లో ఉంటూ పూర్తి స్థాయిలో స్థిరపడినప్పుడు, ఇక వారి పిల్లలకు రిజర్వేషన్ల కోటా ఎందుకని అత్యున్నత న్యాయస్థానం సంచలన ప్రశ్నలు సంధించింది. ఇది చర్చించాలి. లేకుంటే ప్రజల్లో ఇలాంటి వ్యత్యాసాలపైనా వ్యతిరేకత వస్తుంది. ఎక్కడో ఒకచోట దీనికి చెక్ పెట్టాలి. రిజర్వేషన్లు ఎల్లకాలం కాదన్న నిజం బయటకు రావాలి. అవసరమైతే చట్టం చేయాలి. వెనుకబడిన వర్గాల్లోని 'క్రీమీలేయర్' పరిమితులు, రిజర్వేషన్ల మినహాయింపులపై దాఖలైన పిటిషన్లను విచారించిన సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ బి.వి. నాగరత్న మాట్లాడుతూ.. విద్య, ఆర్థిక సాధికారత ద్వారా సమాజంలో ఒక స్థాయి లభిస్తుందని పేర్కొన్నారు. 'రిజర్వేషన్ల ద్వారా ఒకసారి ఉన్నత స్థాయికి చేరుకున్నాక కూడా, మళ్లీ వారి పిల్లల కోసం రిజర్వేషన్ కోటాను ఆశించడం సరికాదన్నారు. ఇలాగైతే మనం రిజర్వేషన్ల వ్యవస్థ నుంచి ఎప్పటికీ బయటపడలేం. ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించాల్సి ఉందని వ్యాఖ్యానించారు. ఒక వ్యక్తి సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడి ఉండవచ్చుని.. కానీ, రిజర్వేషన్ల ప్రయోజనం పొంది తల్లిదండ్రులు ఉన్నత స్థానాలకు వెళ్లినప్పుడు వారి పిల్లల పరిస్థితి మారుతుందని, ఇక్కడ ఒక సమతుల్యత అవసరమని కోర్టు స్పష్టం చేసింది. ఒకే కుటుంబంలో ఉన్నత వర్గాలే అన్ని అవకాశాలను చేజిక్కించుకుంటే, అదే వర్గంలోని అత్యంత వెనుకబడిన పేదలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. రిజర్వేషన్ల ఫలాలు కేవలం కొందరికే పరిమితం కాకుండా, సమాజంలో కిందిస్థాయిలో ఉన్న చివరి వ్యక్తికి కూడా అందాల్సిన అవసరం ఉందని కోర్టు అభిప్రాయపడింది. రాజకీయంగా ఎస్సీ,ఎస్టీ రిజర్వేషన్లు పొందుతున్న వారు తమ కుటుంబాలకు కూడా రిజర్వేషన్ కోటాలో లబ్ది పొందుతున్నారు. ఒకే కుటుంబం నుంచి రిజర్వేషన్ల కోటాలో ఎన్నికై ఎమ్మెల్యేలు, ఎంపిలు అయి మంత్రి పదవులు అనుభవిస్తున్నారు. ఇలాంటి వారివల్ల పక్కన ఉన్నవారు ఎన్నటికీ రిజర్వేషన్లు పొందలేక పోతున్నారు. దీనిపై దేశవ్యాప్తం చర్చ జరగాలి. కాక్రోచ్ జనతాపార్టీ కూడా చర్చించాలి. వెనకబడిన తరగతుల్లోని ఆర్థికంగా, విద్యాపరంగా ఉన్నత స్థితిలో ఉన్న కుటుంబాలకు చెందిన పిల్లలకు రిజర్వేషన్లు ఎందుకని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలాంటి వారు కూడా రిజర్వేషన్లు కొనసాగించాలని కోరడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. కర్ణాటకకు చెందిన ఓ వ్యక్తి తల్లిదండ్రులిద్దరూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు అయినందున క్రీమీలేయర్ కిందకు వస్తారని.. రిజర్వేషన్ వర్తించదంటూ ఆ రాష్ట్ర హైకోర్టు తీర్పు ఇచ్చింది. దాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌పై శుక్రవారం జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌ల ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా రిజర్వేషన్లపై కీలక వ్యాఖ్యలు చేసింది. ఇప్పుడు రాజకీయాల్లోనూ రిజర్వేషన్లపై చర్చించాలి. అప్పుడే మిగతా వారికి రిజర్వేషన్ ఫలాలు దక్కుతాయి.

## రెండోవిడతలో రెండున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లు

మొదటిపేజీ తరువాయి..

ఊపింది. 20 రెగ్యులర్ టీచింగ్ పోస్టులు, 6 నాన్ టీచింగ్ పోస్టులు, అవుట్ సోర్సింగ్ పద్ధతిన మరో 3 పోస్టుల మంజూరుకు ఆమోదం తెలిపింది. మహబూబాబాద్ జిల్లా కె.సముద్రం అగ్నిమాపక కేంద్రానికి సంబంధించి 18 పోస్టులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

రాష్ట్రంలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 2 లక్షల 50 వేల మంది పేద కుటుంబాల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ప్రతి నియోజకవర్గానికి 2 వేల చొప్పున ఇళ్లను




మంజూరు చేయాలని నిర్ణయించింది. కేబినేట్ వివరాలను మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వాకిటి శ్రీహరి, అడ్లూరి లక్ష్మణ కుమార్‌లు మీడియాకు వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం ప్రారంభించి గోడలు, శ్లాబు దశలో నిలిచిపోయిన వాటిని కూడా పూర్తి చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. పునాదులు పూర్తయి గోడలు, శ్లాబు పడని ఇళ్లకు రూ.3 లక్షలు, గోడలు పూర్తయి శ్లాబు నిలిచిపోయిన ఇళ్లకు రూ.2 లక్షలు చొప్పున అందిస్తాం. అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పూర్తి చేసేందుకు నియోజకవర్గానికి 500 ఇళ్లకు చొప్పున నిధులు కేటాయిస్తూ క్యాబినెట్ తీర్మానించింది. తొలి విడతలో నిర్మాణం ప్రారంభించిన ఇందిరమ్మ ఇళ్లలో జూన్ రెండు నాటికి దాదాపు లక్ష ఇళ్ల గృహ ప్రవేశాలు జరుగుతాయి. కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలం కొఠారి గ్రామంలో కొలాం ఆదివాసీలకు ప్రభుత్వం కట్టించిన 28 ఇందిరమ్మ ఇళ్లను జూన్ 1వ తేదీన ప్రారంభించాలని నిర్ణయించాం. జూన్ 1వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,రాష్ట్ర మంత్రులంతా అక్కడికి వెళ్లి ఈ కార్యక్రమంలో పాల్గొంటాం అని మంత్రి పొంగులేటి తెలిపారు. హైదరాబాద్ మహానగరం క్యూర్ పరిధిలోని 24 నియోజకవర్గాల్లో అల్పాదాయ వర్గాల వారి కోసం లక్ష ఇళ్లు నిర్మించి ఇవ్వాలని రాష్ట్ర క్యాబినెట్ నిర్ణయించిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ దఫాలుగా చేసిన సర్వేల ప్రకారం 15 వేల కుటుంబాలు గుడిసెల్లో నివాసం ఉంటున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. వెంటనే ఆ కుటుంబాల న్నింటికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందించాలని రాష్ట్ర క్యాబినెట్ తీర్మానించింది. గుడిసెలు లేని ఆదర్శ రాష్ట్రంగా తెలంగాణను నిలపాలని క్యాబినెట్ నిర్ణయించింది. వచ్చే ఏడాది జూన్ 26 నుంచి జులై 7వ తేదీ వరకు జరగనున్న గోదావరి పుష్కరాలకు సంబంధించి వివిధ పనులు చేపట్టేందుకు రూ.1000 కోట్ల నిధులకు రాష్ట్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో తొలి విడతగా రూ.300 కోట్లు మంజూరుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. విద్యుత్ పంపిణీ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఖీఆఃూలో చేరేందుకు తెలంగాణ డిస్కంలు తయారు చేసిన ప్రతిపాదనలకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని అన్ని జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం పథకం అమలు చేసేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ప్రభుత్వం పాఠశాలలతో పాటు అన్ని జూనియర్ కళాశాలల్లో విద్యార్థులకూ ఉదయం అల్పాహారంతో పాటు పాలు అందించాలని నిర్ణయించింది. రాష్ట్రంలోని డిసిఎంఎస్‌లను మార్క్ ఫెడ్లో విలీనం చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. తెలంగాణ రూరల్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ హాకాలో విలినం చేయాలని క్యాబినెట్ నిర్ణయించింది. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం భూ సేకరణ, పునరావాసం, మౌలిక వసతుల సదుపాయాల కల్పనకు రూ.587 కోట్లు కేటాయిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. తెలంగాణను 2030 నాటికి ప్రపంచంలోని టాప్ 5 లైఫ్ సైన్సెస్ హబ్‌లలో ఒకటిగా నిలబెట్టాలన్నది రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. అందుకే నెక్ట్స్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీ 2026–30ని రాష్ట్ర మంత్రివర్గం ఆమోదించింది. దావోస్‌లో ఈ పాలసీని లాంఛనంగా ఆవిష్కరించాం అని తెపిపారు. ఈ పాలసీ ద్వారా వచ్చే ఐదేళ్లలో 5 లక్షల ఉద్యోగాలతో పాటు 25 బిలియన్ డాలర్ల పెట్టుబడులు ఆకర్షించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నాం. లైఫ్ సైన్సెస్, ఫార్మా, బయోటెక్, మెడికల్ ఇన్నోవేషన్ రంగాల్లో భారీ పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తాం. యువతకు పరిశోధన, తయారీ, డిజిటల్ హెల్త్, గ్లోబల్ ఇన్నోవేషన్ రంగాల్లో మంచి అవకాశాలు కల్పిస్తాం. ఇప్పటివరకు ఎక్కువగా తయారీ మీద దృష్టి ఉంటే, ఇక నుంచి విలువైన ఇన్నోవేషన్ మీద ఎక్కువ ఫోకస్ పెడతాం. రీసెర్చ్ అండ్ డెవెలప్మెంట్ యూనిట్లను కూడా పరిశ్రమలుగా గుర్తించే విధంగా ఈ పాలసీలో మార్పు తీసుకొస్తున్నాం. గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్లు తెలంగాణకు రావడానికి ఈ పాలసీ ఉపయోగపడుతుందని మంత్రులు వివరించారు.

## పశ్చిమాసియాలో సడలని ఉద్రిక్త పరిస్థితులు

మొదటిపేజీ తరువాయి..

ఇరుదేశాల మధ్య సయోధ్య కుదిరినట్లు తెలుస్తోంది. దీంతో ఏ క్షణమైనా ఒప్పంద ప్రకటన వెలువడే అవకాశముంది. అదే సమయంలో ఈ దౌత్య ప్రయత్నాలు చివరి నిమిషంలో విఫలమైతే.. టెహ్రాన్‌పై మళ్లీ దాడులు చేసే విషయాన్ని అధ్యక్షుడు ట్రంప్ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు వార్తలు వచ్చాయి. ఈ క్రమంలో ఇరాన్ కూడా తన గగనతలాన్ని మూసివేయడంతో.. పశ్చిమాసియాలో ఏ క్షణాన ఏం జరుగుతుందోననే భయాందోళనలు నెలకొన్నాయి. అమెరికా మరోసారి దాడులకు సిద్ధం అవుతోందన్న వార్తల నేపథ్యంలో ఇరాన్ ఇలా అప్రమత్తమైంది. ఈ పరిణామంతో గల్ఫ్‌లో పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. యూఎస్ మరోసారి యుద్ధాన్ని ప్రారంభించిన పక్షంలో దీటుగా ఎదుర్కొనేందుకు ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్, ఇతర సాయుధ దళాలు సిద్ధమవుతున్నట్టు ఇరాన్ వార్తా సంస్థ తస్నిమ్ ఒక కథనాన్ని ప్రచురించింది. అమెరికా ఆస్తులకు నష్టం కలిగేలా, ప్రయోజనాలు దెబ్బతినేలా దాడులకు ప్రణాళికలను ఇరాన్ మిలిటరీ సిద్ధం చేసినట్టు సమాచారం. ఈ వారాంతాన్ని న్యూజెర్సీలో గడపాల్సిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చివరి నిమిషంలో తన ప్లాన్స్‌ను అకస్మాత్తుగా రద్దు చేసుకుని రాజధాని వాషింగ్టన్‌కు తిరిగొచ్చారు. దీంతో, పశ్చిమాసియాలో మళ్లీ ఘర్షణలు మొదలవుతాయన్న వార్తలు మీడియాలో వెలువడ్డాయి. ఈ వారాంతంలో మెమోరియల్ డే వేడుకల్లో పాల్గొనాల్సిన అమెరికా నిఘా సంస్థల సీనియర్ అధికారులు కూడా తమ ప్రణాళికలను రద్దు చేసుకుని వాషింగ్టన్‌కు తిరిగొచ్చేశారు. రాబోయే 24 గంటల్లో దౌత్యపరమైన పురోగతి లేని పక్షంలో దాడులు మొదలుపెట్టేందుకు ట్రంప్ కూడా సుముఖంగానే ఉన్నట్టు స్థానిక మీడియాలో కథనాలు వెలువడ్డాయి. పరిస్థితులు అంతకంతకూ ఉద్రిక్తంగా మారుతున్నా తెరవెనుక దౌత్యమార్గాల్లో ప్రయత్నాలు ముమ్మర స్థాయిలో జరుగుతున్నట్టు కూడా తెలుస్తోంది. చర్చల్లో కొంత పురోగతి కనిపించిందని విశ్వసనీయ వర్గాలు చెప్పినట్టు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది.

## రూ.43.80 కోట్లతో వేద పాఠశాల



మొదటిపేజీ తరువాయి..

శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతితో కలిసి వేదపాఠశాలకు భూమిపూజ చేశారు. అనంతరం రూ.9.87 కోట్లతో కొండపై స్వామివారి నిత్య కల్యాణ మండపం నిర్మాణానికి, రూ.1.41 కోట్లతో వైకుంఠ ద్వారం నుంచి కొండపైకి



వెళ్లే మెట్ల మార్గం పై కప్పు నిర్మాణానికి, రూ.1.35 కోట్లతో నిర్మించనున్న రథశాల వైపు మాడవీధులకు మెట్ల నిర్మాణానికి, రూ.43.12 కోట్లతో డార్మిటరీ హాల్స్, దీక్షాపరుల సదన్ నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఉదయం ప్రత్యేక హెలికాప్టర్లో యాదగిరిగుట్ట పెద్దగుట్టపైకి చేరుకున్న సీఎం రేవంత్ రెడ్డికి.. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కలెక్టర్ అనురాగ్ జయంతి ఘన స్వాగతం పలికారు. సీఎంతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్త సుఖేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, ఎంపీ వేంనరేందర్ రెడ్డి.. యాదాద్రికి చేరుకున్నారు. పవిత్ర పుణ్యక్షేత్రం యాదగిరిగుట్టపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంప్రదాయ వేదపాఠశాల భవనానికి శంకుస్థాపన చేశారు. కంచి కామకోటి పీఠాధిపది శ్రీశంకర విజయేంద్ర సర్వస్వతి స్వామి సమక్షంలో ఈ క్రతువు జరిగింది. రూ.43.79 కోట్లతో క్షేత్రంలోని పెద్దగుట్ట ఆలయ నగరి లేఅవుట్ వద్ద 15 ఎకరాల విస్తీర్ణంలో వేదపాఠశాల భవనం నిర్మించనున్నారు. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తి చేసి తరగతులు ప్రారంభించనున్నారు. అనంతరం శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని సీఎం దర్శించుకున్నారు.

## వరుసగా మూడోసారి పెట్రో ధరల పెంపు

మొదటిపేజీ తరువాయి..

పెంచటం ఇది మూడోసారి. పెట్రోల్, డీజిల్ ధరల పెంపు విషయంలో ఆయిల్ కంపెనీలు ఓ ప్యాట్రన్ ఫాలో అవుతున్నట్లు సోషల్ మీడియాలో జోరుగా చర్చ నడుస్తుంది. ఇప్పటి వరకు నాలుగు రోజులకు




ఒకసారి పెంచటం జరిగింది. 15వ తేదీ తర్వాత 19.. ఆ తర్వాత 23వ తేదీ.. అంటే ధరల పెంపు మధ్య 4 రోజుల గ్యాప్ ఉండేలా చూసుకుంటున్నారు. ఇదే సమయంలో మరో ఆసక్తికరమైన అంశంపై సోషల్ మీడియాలో చర్చ నడుస్తుంది. గతంలో పెట్రోల్, డీజిల్ ధరల పెంపును రాత్రి టైంలో అనౌన్స్ చేసేవాళ్లు.. రేపటి ఉదయం పత్రికల్లో ఆ వార్త వచ్చేసింది. ఇప్పుడు ఈ విధానం మారింది. అర్ధరాత్రి తర్వాత.. తెల్లవారుజామున ధరల పెంపు ప్రకటన చేస్తున్నారు. ఉదయం ఆరు గంటల సమయంలోనే ఈ వార్త జనానికి తెలుస్తుంది. పెంచిన ధరలు ఈ ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయని ప్రకటిస్తున్నారు. పెట్రోల్, డీజిల్ రేట్లు పెంపు అనేది టీవీల్లో, సోషల్ మీడియాలో చూసి మాత్రమే జనం తెలుసుకుంటున్నారు.

## పర్సంటేజీ అయితనే సినిమా ఆడుద్ది

మొదటిపేజీ తరువాయి..

సినిమా విడుదల చేయాలంటే తమకు పర్సెంటేజ్ ఇవ్వాల్సిందేనని స్పష్టం చేసింది. ఇకపై ఏ సినిమా అయినా పర్సంటేజ్ కావాలని తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ తేల్చి చెప్పింది. శనివారం తెలంగాణ ఎగ్జిబిటర్స్ అసోసియేషన్ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ.. 'తెలుగు ఫిల్మ్ ఛాంబర్ కమిటీతో రెండు, మూడు సార్లు చర్చలు జరిగాయి. హరిహర వీరమల్లు రిలీజ్ సమయంలో.. రెండు నెలల్లో మా సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. 'కానీ, సంవత్సరం గడిచిపోయింది. పెద్ది సినిమాకు మాకు పర్సంటేజ్ కావాల్సిందే. మమ్మల్ని నిర్మాతలు రెచ్చగొడుతున్నారు. మొదట మూడు వారాలు అన్నారు.. ఇప్పుడు ఆరు వారాలు అంటున్నారు. పర్సెంటేజ్ సిస్టమ్ అయితేనే సినిమాలు ఆడిస్తాము. 120 మంది థియేటర్స్ ఓనర్లు దీనస్థితిలో ఉన్నారు. పర్సంటేజ్ సిస్టంను కావాలనే నిర్మాతలు లేట్ చేస్తున్నారు. మాకు పర్సెంటేజ్ విధానం కావాల్సిందే. అది ఎంత ఇస్తారో చెప్పండి. 10,15 ఏళ్ల కింద థియేటర్స్‌కి మంచి రెవెన్యూ ఉండేది. ఇప్పుడు ఎగ్జిబిటర్స్‌కి రెవెన్యూ రావడం లేదు. కానీ, నిర్మాతలకు 14 రకాలుగా ఆదాయం వస్తోంది'.. పర్సంటేజ్ విధానం కొత్త విషయం కాదు. అన్ని రాష్ట్రాల్లో ఇప్పటికే ఉంది. కాబట్టి కూర్చుని పర్సంటేజ్‌ను తేల్చండి. అన్ని సినిమాల రిలీజ్ సాఫీగా జరుగుతుంది. మీటింగ్‌లో కూడా పర్సంటేజ్‌కు సైన్ చేస్తేనే పెద్ది రిలీజ్‌కు ఒప్పుకుంటామని చెప్పాము. సబ్ కమిటీలో మెంబర్స్‌గా ఉండి.. మాకు కావలసిన పర్సంటేజ్‌ను సాధించుకుంటాం. మెగాస్టార్ చిరంజీవి పిలిస్తే వెళతాం. పెద్దమనిషికి మా బాధలు చెప్పుకుంటాం. పర్సంటేజ్ సిస్టమే ఉండాలి. రెంటల్ మాట వద్దు' అని అన్నారు.

## దేశంలో పెరుగుతున్న చిన్నారుల అదృశ్యం కేసులు

మొదటిపేజీ తరువాయి..

అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం దేశంలో దాదాపు 47,000 మంది చిన్నారుల ఆచూకీ లభించకుండా పోయిందని, ప్రతి ఏటా ఈ బ్యాక్‌లాగ్ పెరుగుతుండటంపై తీవ్ర అసంతృప్తిని వెలిబుచ్చింది. ఈ వ్యవస్థాగత లోపాలను సరిదిద్దడానికి, అంతర్రాష్ట్ర మానవ అక్రమ రవాణా ముఠాల నెట్‌వర్క్‌ను ఛేదించడానికి సుప్రీంకోర్టు సంచలన ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. చిన్నారుల అదృశ్యం కేసులను కేవలం 'మిస్సింగ్' కేసులుగా కాకుండా, అంతర్రాష్ట్ర ముఠాల కిడ్నాప్ కోణంలోనే దర్యాప్తు చేయాలని స్పష్టం చేసింది. పోలీసుల వద్ద ఉన్న క్రిమినల్ ట్రాకింగ్ డేటాబేస్, చైల్డ్ వెల్ఫేర్ అథారిటీల వద్ద ఉన్న 'విశాల్ వాసిల్య' డేటాబేస్ మధ్య సమన్వయం లేకపోవడాన్ని కోర్టు తప్పుపట్టింది. ఈ క్రమంలో సుప్రీంకోర్టు ఐదు కీలక ఆదేశాలను జారీ చేసింది. దేశంలోని వివిధ సంస్థలు నిర్వహిస్తున్న చిన్నారుల డేటాబేస్‌లన్నింటినీ అనుసంధానం చేయాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖను కోర్టు ఆదేశించింది. దీనివల్ల పోలీస్ అధికారులు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు , జిల్లా బాలల రక్షణ విభాగాలు చైల్డ్ కేర్ హోమ్‌ల మధ్య సమాచారం రియల్ టైమ్‌లో షేర్ అవుతుంది. చాలా జిల్లాల్లో మానవ అక్రమ రవాణా నిరోధక విభాగాలు కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశంలోని అన్ని ంఉఃుజలను తగిన అధికారాలు, మౌలిక సదుపాయాలతో 4 వారాల్లోగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఏదైనా చైల్డ్ మిస్సింగ్ కేసు నమోదైన వెంటనే.. అధికారులు ప్రాథమికంగా దానిని కిడ్నాప్ లేదా అపహరణగా భావించి దర్యాప్తు ప్రారంభించాలి. దీనివల్ల ప్రొసీజర్ ఆలస్యం కాకుండా దర్యాప్తులో సీరియస్‌నెస్ వస్తుందని కోర్టు పేర్కొంది. ఒకవేళ ఆ కేసులో హ్యూమన్ ట్రాఫికింగ్ అనుమానాలు ఉంటే.. నిబంధనల ప్రకారం 4 నెలలు వేచి చూడకుండా వెంటనే కేసును బదిలీ చేయాలని స్పష్టం చేసింది. రక్షించిన లేదా రికవరీ చేసిన చిన్నారులను సాధారణంగా 24 గంటల్లోగా వారి కుటుంబాలకు అప్పగించాలి. ఒకవేళ ఆ నిర్దిష్ట చైల్డ్ ట్రాఫికింగ్ లేదా దోపిడీ వెనుక కుటుంబ సభ్యుల ప్రమేయం ఉన్నట్లు అనుమానం వస్తే తప్ప, మిగిలిన సమయాల్లో తక్షణమే తల్లిదండ్రుల వద్దకు చేర్చాలి. కుటుంబ సభ్యులపై అనుమానం ఉంటే ఆ బాధ్యతను చైల్డ్ వెల్ఫేర్ కమిటీలు చూసుకోవాలి. రక్షించిన ప్రతి బిడ్డకు ఒకే గుర్తింపు ఉండేలా చూసుకోవడం, భవిష్యత్తులో వారి ఆచూకీని సులభంగా పర్యవేక్షించడం కోసం అవసరమైన అధికారిక రిజిస్ట్రేషన్, వెరిఫికేషన్ ప్రక్రియలను వేగవంతం చేయాలని డిస్టిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్లను కోర్టు ఆదేశించింది. తద్వారా ఐడెంటిటీ డూప్లికేషన్‌ను నిరోధించవచ్చని పేర్కొంది.2011 సెప్టెంబరులో చెన్నైలోని విరుగంబాక్కం పరిధిలో 'కవిత' అనే చిన్నారి అదృశ్యమైంది. స్థానిక పోలీసులు, సెంట్రల్ క్రైమ్ బ్రాంచ్ దర్యాప్తు చేసినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులు ఈ కేసును ఆచూకీ లభించనిది గా పేర్కొంటూ క్లోజర్ రిపోర్ట్ ఇచ్చారు. దీనిపై తండ్రి జి. గణెలిష్ దాఖలు చేసిన పిటిషన్‌ను 2025 మార్చిలో మద్రాస్ హైకోర్టు తిరస్కరించింది.

సాక్ష్యం



## భద్రత, వాణిజ్య, సాంకేతిక రంగాల్లో సహకారం

మొదటిపేజీ తరువాయి..

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తరఫున ఆయన మోదీని ఆహ్వానించారు. సేవాతీర్థ్ లో దాదాపు గంటకు పైగా ప్రధానితో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. భారత్‌కు ముడి చమురు సరఫరా చేయడానికి తమ దేశం సిద్ధంగా ఉందన్నారు. అదే సమయంలో ప్రపంచ ఇంధన మార్కెట్‌ను తన ఆధీనంలోకి తీసుకోవడానికి ఇరాన్ చేస్తున్న ప్రయత్నాలను తాము ఎప్పటికీ అంగీకరించబోమన్నారు. ప్రధాని మోదీకి, ట్రంప్‌నకు మధ్య మంచి స్నేహపూర్వక సంబంధాలు ఉన్నాయని రూబియో అన్నారు. వారిద్దరూ కేవలం తాత్కాలిక ప్రయోజనాల గురించే కాకుండా దీర్ఘకాలిక ప్రయోజనాలపైనా దృష్టిపెడతారని పేర్కొన్నారు. ఈ క్రమంలో దేశంలో మండుతున్న ఎండల గురించి మాట్లాడుతూ.. వేడిగా ఉన్నందున తన ప్రసంగాన్ని క్లుప్తంగా ముగించాలనుకుంటున్నానంటూ చమత్కరించారు. అమెరికా విదేశాంగ మంత్రి రూబియోతో భేటీపై ప్రధాని మోదీ స్పందించారు. భారత్–అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యం పురోగతితోపాటు ప్రాంతీయ, అంతర్జాతీయ శాంతి భద్రతలు తదితర అంశాలపై చర్చలు జరిపామన్నారు. భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రపంచ శ్రేయస్సు కోసం అమెరికాతో కలిసి పని చేస్తామన్నారు. ఇరాన్‌తో నెలకొన్న ఉద్రిక్తతలను పరిష్కరించుకోవడానికి శాంతియుత చర్చలు జరపాలని ఈ సందర్భంగా ప్రధాని సూచించారు.

## 25 నుంచి 'రైతు గోస- భాజపా భరోసా'

మొదటిపేజీ తరువాయి..

తాండూరులో.. రెండో రోజు గజ్వేల్, భువనగిరి, వరంగల్‌లో.. మూడో రోజు భూపాలపల్లి, కాటారం, మంథని, పెద్దపల్లిలో పోరుబాట నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు నిరసన తెలపనున్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించనున్నారు. వారి సమస్యలు అడిగి తెలుసుకోనున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కొనుగోలు కేంద్రాల వద్ద ఉండనున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో పోరుబాట కొనసాగనుంది. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి అభయ్ పాటిల్ ఇందులో పాల్గొననున్నారు.

# దేశవ్యాప్తంగా భానుడి భగభగలు

మొదటిపేజీ తరువాయి..

రాష్ట్రాలు సహా వాయవ్య, మధ్య, తూర్పు భారత్‌లోని పలు మైదాన ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని అంచనావేసింది. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఢిల్లీ, రాజస్థాన్‌లలోని పలు ప్రాంతాల్లో వడగాలులు వీస్తాయని ఐఎండీ వెల్లడించింది. విదర్భ, ఆంధ్రాలోని తీరప్రాంతం, యానాం, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, ఒడిశా, తెలంగాణ, జమ్మూకశ్మీర్, హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలోనూ వడగాలులు వీచే అవకాశముందని తెలిపింది. శుక్రవారం ఉదయం దాదాపు 11 గంటల సమయానికి నమోదైన ఉష్ణోగ్రతల ప్రకారం.. ప్రపంచంలోనే 50 అత్యంత వేడి నగరాలన్నీ భారత్‌లోనే ఉన్నాయి. ఎయిర్‌క్వాలిటీ ఇండెక్స్ ఈ గణాంకాలను వెల్లడించింది. జాబితాలోని సగం నగరాలు ఉత్తరప్రదేశ్‌లోనివే కావడం గమనార్హం. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, బీహార్, తెలంగాణ, హర్యానా, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాల్లోని పలు ప్రాంతాలూ ఇందులో ఉన్నాయి.



తెలుగు రాష్ట్రాల్లో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. తెలంగాణలో 15 జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటాయి. కొత్తగూడెం జిల్లాలో అత్యధికంగా 46.3 డిగ్రీలు నమోదైంది. మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో.. కృష్ణా జిల్లా కానుమోలులో అత్యధికంగా 45.8 డిగ్రీలు నమోదైంది. 13 జిల్లాలోని 95 మండలాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీలు దాటాయి. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో శనివారం 45 నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని విపత్తు నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో గాలి,వాన బీభత్సం సృష్టించింది. పలు ప్రాంతాల్లో చెట్లు నేల కొరగగా ,అచ్చంపేటలో పిడుగుపాటుకు రెండు పశువులు మృతి చెందాయి. నాగర్‌కర్నూలు జిల్లా తాడూరు మండలం గోవిందాయిపల్లిలో పిడుగుపాటుకు గొర్రెల కాపరి మల్లయ్య మృతి చెందారు. అచ్చంపేటలో కురిసిన భారీ వర్షానికి ధాన్యం తడిచిపోయింది. బిజినేపల్లి, తాడూరు, తెలకపల్లి మండలాల్లో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. పాలమూరులో కలెక్టరేట్ వద్ద బస్ స్టాప్ షెడ్ గాలివానకు రోడ్డు మీద పడింది. హబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో దాదాపు అరగంట పాటు ఈదురు గాలులతో వర్షం పడింది. బైపాస్‌లో పలుచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. కార్లు ద్విచక్ర వాహనాలకు నష్టం వాటిల్లింది. వనపర్తి జిల్లాలో భారీగా ఈదురు గాలులు, గాలివాన, వడగళ్ల వర్షంతో వరికి నష్టం జరిగిందని రైతులు వాపోయారు. అచ్చంపేట మండలంలోని బుడ్డ తండాలో విషాద ఘటన చోటుచేసుకుంది. గిరిజన రైతు మోత్యకు చెందిన రెండు పశువులు పిడుగు పడి మృతి చెందాయి. శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షం సమయంలో వ్యవసాయ పొలంలో చెట్టుకు కట్టేసి ఉన్న పశువులపై ఒక్కసారిగా పిడుగు పడటంతో అవి అక్కడికక్కడే మృతి చెందాయి. వ్యవసాయం కోసం ఇటీవలే రూ.1.10 లక్షల వ్యయంతో రెండు పశువులను కొనుగోలు చేసినట్లు రైతు తెలిపాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని, నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని కోరాడు

## తెలంగాణ ఎండల తీవ్రతపై ప్రభుత్వం అలర్ట్

మొదటిపేజీ తరువాయి..

7 జిల్లాల్లో 16 మంది మృతిచెందారని తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తున్నట్లు ప్రకటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో నష్టపరిహారం ఇస్తున్నామని స్పష్టం చేశారు. వచ్చే మూడు రోజులు మరింత తీవ్రంగా హీట్ వేవ్ ఉండనుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని మార్గనిర్దేశర చేశారు. ప్రజల ప్రాణ రక్షణెళి తమ ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని తెలిపారు. వడగాల్పులతో ఒక్క ప్రాణం కూడా కోల్పోకూడదని చెప్పుకొచ్చారు. ఎండ తీవ్రతపై ప్రజలకు గంట గంటకు హెచ్చరికలు జారీ చేశామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ప్రజలు బయటకు రావొద్దని సూచించారు. వృద్ధులు, గర్భిణులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ, భవన నిర్మాణ కార్మికులు ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టాలని నిర్దేశిరచారు. హీట్‌వేవ్‌పై గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఎండదెబ్బకు గురైన వ్యక్తులకు ఆయా ఆస్పత్రులు అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇదిలావుంటే తెలంగాణలో భానుడి భగభగలు తీవ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతుండగా, 18కు పైగా జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 46 డిగ్రీల సెల్సియస్‌ను దాటాయి. పరిస్థితి తీవ్రంగా మారడంతో అధికారులు 18 జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేశారు. హైదరాబాద్ లోనూ ఉష్ణోగ్రతలు భారీగా పెరిగి 43 డిగ్రీలకుపైగా నమోదయ్యాయి. రాష్ట్రంలోని ఉత్తర, తూర్పు జిల్లాలు తీవ్ర వడగాలుల ప్రభావానికి గురవుతున్నాయి. వడదెబ్బ ప్రభావం ఆందోళనకరంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా వడదెబ్బ కారణంగా 34 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో ప్రజలు అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లవద్దని అధికారులు హెచ్చరిస్తున్నారు.

అధిక ఉష్ణోగ్రతల కారణంగా అలసటగా ఉంటుంది, గాలిలో తేమ ఎక్కువగా ఉండటం, వేడిగా ఉన్నప్పుడు ఎక్కువగా అలసిపోయినట్లు అనిపిస్తుంది. కండరాల నొప్పి ఉంటుంది. హీట్ ఇంజురీలో శరీర భాగాలు దెబ్బతినే అవకాశం ఉంది. కిడ్నీ, గుండె సమస్యలు వచ్చే అవకాశం ఉంది. హీట్ స్ట్రోక్ తీవ్రమైన సమస్య.. దీనిలో శరీర భాగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. దీని కారణంగా మెదడు పనితీరు దెబ్బతింటుంది. స్ట్రోక్ సంభవించవచ్చు. దీన్ని నిర్లక్ష్యం చేస్తే.. కోమాలోకి వెళ్లే ప్రమాదం ఉంది. ఈ వడదెబ్బ నుంచి తప్పించుకోవాలంటే.. శరీరాన్ని ఎప్పుడూ హైడ్రేట్‌గా ఉంచుకోవాలి. ద్రవపదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. మధ్యాహ్నం పూట బయటకు వెళ్లకపోవడం మంచిది. షుగర్, బీపీ పేషెంట్లు మెడికేషన్ సక్రమంగా తీసుకోవాలి. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 వరకు బయట తిరగకపోవడమే మంచిది. అత్యవసర పరిస్థితిలో వెళ్లాల్సి వస్తే.. తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముదురు రంగు దుస్తులు కాకుండా తేలికపాటి లేత రంగు దుస్తులను ధరించాలి. ఆల్కాహాల్ శరీరంలోని నీటి శాతాన్ని తగ్గిస్తాయి. ఎండాకాలంలో మద్యానికి దూరంగా ఉండటం మంచిది. ఓఆర్ఎస్, కొబ్బరి నీళ్లు, ఉప్పు కలిపిన నిమ్మరసం లాంటివి శరీరం కోల్పోయిన లవణాలను తిరిగి భర్తీ చేస్తాయి. దోసకాయలు, పుచ్చకాయలు, దానిమ్మ, బత్తాయి లాంటి పండ్లు తీసుకోవాలి. వేసవిలో తేలికపాటి వ్యాయామాలు ఉదయం 8 గంటల్లోపే ముగించాలి. వడదెబ్బ లక్షణాలు కనిపించగానే చికిత్స అందించాలి. లేదంటే శరీరం పూర్తిగా నిర్జలీకరణం చెంది.. బీపీ, పల్స్ పడిపోయి కొన్నిసార్లు ప్రాణాలు పోవచ్చు.

## ఉద్యోగాల పేరుతో లక్షల్లో వసూళ్లు

### టెక్నోరీచ్ సంస్థ సీఈఓ లక్ష్మీకాంత్‌పై కేసు

హైదరాబాద్,మే24(సాక్ష్యం): టెక్నోరీచ్ సంస్థ సీఈఓ లక్ష్మీకాంత్ గౌడ్‌పై పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు అయ్యింది. ఉద్యోగాల పేరుతో అభ్యర్థుల నుంచి లక్షల రూపాయలు వసూలు చేసినట్టు లక్ష్మీకాంత్‌పై ఆరోపణలు వచ్చాయి. ట్రైనింగ్ పేరుతో ఒక్కొక్కరి వద్ద రూ.50 వేల నుంచి రూ.1.5 లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. మార్చిలో 80 నుంచి 90 మంది ఉద్యోగులను సంస్థ నియమించుకుంది. ఉద్యోగులకు జీతాలు ఇవ్వకుండా లక్ష్మీకాంత్ వేధింపులకు పాల్పడినట్లు సమాచారం. ఆఫీస్ అ÷–దదె చెల్లించకపోవడంతో గత నెల 25న కార్యాలయానికి తాళం పడింది. జీతాల కోసం ప్రశ్నించిన ఉద్యోగిని సీఈఓ దూషించడంతో పాటు బెదిరింపులకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. క్లబ్బులు, పబ్బులకు రావాలంటూ మహిళా ఉద్యోగినిపై ఒత్తిడి చేసినట్టు ఫిర్యాదు వచ్చింది. పెండింగ్ జీతాలు ఇవ్వాలంటే ఒక్కొక్కరు రూ.5 వేలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. బాధితురాలి ఫిర్యాదు మేరకు లక్ష్మీకాంత్ గౌడ్‌పై బెదిరింపులు, వేధింపులు, మోసం తదితర సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది.

**రిజిస్ట్రేషన్ కాగితాలు పోయినవి**

నేను అనగా పోకల ప్రభాకర్ తండ్రి విశ్వనాథం, రెడ్డి కాలనీ, మిర్యాలగూడ పట్టణ నివాసిని నా ఇంటి వద్ద నుండి బైక్ పై అవంతిపురం గ్రామానికి వెళ్తుండగా బ్యాగ్ లో కవర్ లో ఉన్న రిజిస్టర్ డాక్యుమెంట్ 3796/2008 గలది ప్లాట్ కాగితాలు పోయినవి. దొరికిన వారు 9618966456 కు తెలియజేయగలరు.

**CHANGE OF NAME**

I, **MADIREDDY SATYANARAYANA REDDY (New Name)** S/o. MADIREDDY MALLA REDDY, H.No. 40-5-50, Near G.P. Office Road, Mamnoor, Warangal Dist- 506166, T.G. I Have Changed my from MADIREDDY SATHYANARAYANA REDDY (Old Name) to **MADIREDDY SATYANARAYANA REDDY (New Name)** for all future purposes.

## యువత ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదగాలి

మొదటిపేజీ తరువాయి..

చేరుతున్నారన్నారు. 2022లో దీపావళి రోజున మొదలైన రోజ్‌గార్ మేళా ద్వారా ఇప్పటివరకు 12.5 లక్షల మందికి ఉద్యోగాలు కల్పించామని వెల్లడించారు. ఇది కేవలం ఉద్యోగాల కార్యక్రమం కాదని, యువత భవిష్యత్తు కోసం మోదీ ప్రభుత్వం తీసుకొచ్చిన పెద్ద మిషన్ అని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాలతో పాటు ప్రైవేట్ కంపెనీల్లో కూడా కోట్ల సంఖ్యలో ఉద్యోగాలు వస్తున్నాయని అన్నారు. స్టార్టప్స్, యూనికార్న్ వల్ల యువత ఉద్యోగాలు అడిగే స్థాయి నుంచి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వచ్చిందని కేంద్రమంత్రి అన్నారు. రోడ్లు, ఎయిర్‌పోర్టులు, రైల్వేలు, మెట్రోలు, ఇండస్ట్రియల్ కారిడార్లు వంటి ప్రాజెక్టులతో భారీగా ఉపాధి పెరుగుతోందన్నారు. దేశంలో ప్రతి సంవత్సరం రూ.12 లక్షల కోట్ల ఇన్‌ఫ్రా పనులు జరుగుతున్నాయని వివరించారు. ప్రతి లక్ష కోట్ల పెట్టుబడికి 14 నుంచి 15 లక్షల ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. యువతను మోదీ 'వికసిత భారతానికి సూపర్ హీరోలు'గా చూస్తున్నారని అన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా కోట్ల మంది యువతకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. గ్రామీణ యువతకు కూడా ఒఎ, ఎని వంటి ఆధునిక టెక్నాలజీని మాతృభాషలో నేర్పిస్తున్నామని తెలిపారు.

భారత యువత ప్రపంచస్థాయిలో రాణిస్తోందని కిషన్ రెడ్డి అన్నారు. సెమీకండక్టర్లు, స్పేస్, డ్రోన్ టెక్నాలజీలో భారత్ ముందుకు వెళ్తోందన్నారు. చంద్రుడి దక్షిణ ధ్రువానికి ముందుగా చేరిన దేశం భారత్ అని చెప్పుకొచ్చారు. 'ఆపరేషన్ సిందూర్' సమయంలో స్వదేశీ డ్రోన్లు శత్రు క్షిపణులను అడ్డుకున్నాయని అన్నారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్య సాధనలో యువత పాత్ర కీలకమన్నారు. యూనివర్సిటీలు, కాలేజీలు, పీఎం–శ్రీ స్కూల్స్ సంఖ్య పెంచామని తెలిపారు. భారత్ ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగిందని అన్నారు. 2014కు ముందు వందల స్టార్టప్స్ మాత్రమే ఉండగా, ఇప్పుడు 1.2 లక్షలకు పైగా ఉన్నాయన్నారు. మైనింగ్, బొగ్గు రంగాల్లో కూడా మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని యువతకు సూచించారు. మైనింగ్, ఇంజనీరింగ్ వంటి కోర్సులపై యువత దృష్టి సారించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి సూచనలు చేశారు.

## తొలి ఎఐ ఆధారిత ఫిర్యాదు రికార్డర్

హైదరాబాద్,మే24(సాక్ష్యం): దేశంలోనే తొలి ఎఐ ఆధారిత ఫిర్యాదు రికార్డర్ 'ఎఐ కాప్‌రైటర్' యాప్‌ను హైదరాబాద్ సిపి సజ్జనార్ శనివారం ఆవిష్కరించారు. దీని ద్వారా 10కి పైగా భాషల్లో ఫిర్యాదులు నమోదు చేసే అవకాశం ఉందన్నారు. చెప్పిన విషయాలను వెంటనే టెక్ట్స్‌గా మార్చి అనువదించవచ్చని చెప్పారు. ఫిర్యాదు వివరాలు ఆటోమేటిక్‌గా పిడిఎఫ్ రూపంలో సేవ్ అయ్యే సదుపాయం ఉందన్నారు. వలస కార్మికులు, పర్యాటకులు, మహిళలు, వృద్ధులకు పెద్ద ఊరట లభిస్తుందని తెలిపారు. భాష న్యాయానికి అడ్డంకి కాకూడదన్న లక్ష్యంతో ఎఐను వినియోగిస్తున్నట్టు వివరించారు. తొలుత హైదరాబాద్ పరిధిలోని 80కి పైగా పోలీస్‌స్టేషన్లలో ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

## బెంగాల్ ప్రభుత్వం కీలక నిర్ణయం

కోల్‌కతా,మే24(సాక్ష్యం): కోల్‌కతాలోని ప్రఖ్యాత సాల్ట్ లేక్ స్టేడియం వీవీఐపీ గేటు వెలుపలనున్న వివాదాస్పద ఫుట్‌బాల్ శిల్పాన్ని శనివారం ఉదయం కూల్చివేశారు. పశ్చిమబెంగాల్ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫుట్‌బాల్ శిల్పం కూల్చివేత జరిగినట్టు అధికారులు తెలిపారు. సాల్ట్ లేక్‌లోని వివేకానంద యువ భారతి క్రీరాంగణ్ గా పేరున్న ఈ స్టేడియం పునరుద్ధరణ కార్యక్రమం 2017లో జరిగింది. ఆ సమయంలో ఫుట్‌బాల్ శిల్పాన్ని ఏర్పాటు చేశారు. నాటి ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పర్యవేక్షణలో ఈ శిల్పం ఏర్పాటైంది. నడుము వరకూ ఉన్న కాళ్లు, దానిపై ఫుట్‌బాల్, బిశ్వబంగ్లా లోగోతో ఈ శిల్పం నిర్మించారు. అయితే ఈ నిర్మాణం కళాత్మకంగా లేదని, అసహ్యకరమైన ఆకృతిలో అర్థరహితంగా ఉందనే విమర్శలు రావడంతో దానిని తెలగించాలనే నిర్ణయం తీసుకున్నట్టు రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి నితీష్ ప్రమాణిక్ ఇటీవల ప్రకటించారు. ఆయన మే 17న స్టేడియంలో జరిగిన 'మోహన్ బగాన్ ఈస్ట్ బెంగాల్ డెర్బీ'కి హాజరయ్యారు. మ్యాచ్ అనంతరం ఫుట్‌బాల్ శిల్పం రూపకల్పనపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. ఆ శిల్పం పెట్టినప్పటి నుంచి గత పాలకుల పరిస్థితి తిరగబడిందని చాలామంది అభిప్రాయపడినట్టు చెప్పారు.కాగా, ప్రజాపనుల శాఖ సీనియర్ అధికారులతో సంప్రదింపుల తర్వాతే ఫుట్‌బాల్ శిల్పాన్ని తొలగించాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం తీసుకున్నట్టు క్రీడాశాఖ సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. పశ్చిమబెంగాల్‌లోని ఫుట్‌బాల్ ఫ్యాన్స్‌కు సాల్ట్ లేక్ స్టేడియంతో విడదీయరాదని అనుబంధం ఉందన్నారు.

## హరీష్ రావువి పగటి కలలు

హైదరాబాద్,మే24(సాక్ష్యం): ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామని బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు బాధ్యతా రాహిత్యంగా మాట్లాడుతున్నారని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. ఇది బ్లాక్ మెయిల్ రాజకీయమని మండిపడ్డారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలా? వద్దా? ఆయన చెప్పాలన్నారు. 'ఇలా చేస్తే పెట్టుబడులు రావు. పక్క రాష్ట్రాలకు వెళ్తాయి. ఫ్యూచర్ సిటీలో కాలుష్యకారక పరిశ్రమలు ఉండవు.



దాన్ని రద్దు చేస్తామనడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని బీఆర్ఎస్ అడ్డుకుంటోందని మంత్రి ఆరోపించారు. ఆ పార్టీ బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలకు యత్నిస్తోందన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటిరోజు నుంచే బీఆర్ఎస్ నేతలు విమర్శలే ప్రధాన అంశంగా ముందు కెళున్నారని తెలిపారు. జంట నగరాలకు సంబంధించిన మెట్రోను విస్తరించాలనుకుంటే అడ్డుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తామని మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు. నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు.

**PRUDENT ARC LIMITED**

రిజిస్టర్డ్ & కార్పోరేట్ ఆఫీస్: 611, డి మాల్, ప్లాట్ నం. ఎ-1, నేతాజీ సుభాష్ ప్లేస్, పీతంపుర, న్యూ ఢిల్లీ-110034
Tel: +91-11-45320000 | Email Id: info@prudentarc.com | CIN: U74900DL2011PLC225445

**అనుబంధం IV (రూల్ 8(1) చూడండి) - స్వాధీన నోటీసు (స్థిరాస్తి కోసం)**

అయితే, దిగువ సంతకందారు, ప్రుడెంట్ ఏఆర్‌సి లిమిటెడ్ (ప్రెడెంట్ ట్రస్ట్ -123-25) యొక్క అధీకృత అధికారిగా, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (ఇకపై "చట్టం"గా పేర్కొనబడును) నిబంధనల ప్రకారం మరియు చట్టంలోని సెక్షన్ 13(12)తో పాటు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 3 కింద కల్పించిన అధికారాలను వినియోగిస్తూ, చట్టంలోని సెక్షన్ 13(2) ప్రకారం ఋణగ్రహీత(లు)/సహ-ఋణగ్రహీత(లు)/హామీదారుడు(లు) బకాయి మొత్తాన్ని నిర్దిష్ట గడువులో చెల్లించాల్సిందిగా డిమాండ్ నోటీసు జారీ చేయడమైనది. యుగ్రో క్యాపిటల్ లిమిటెడ్ (అసైనర్ బ్యాంక్) మరియు ప్రుడెంట్ ఏఆర్‌సి లిమిటెడ్ ( ప్రుడెంట్ ట్రస్ట్ -123-25) (అసైనీ) మధ్య 30/06/2025 తేదీన అమలైన అసైన్‌మెంట్ ఒప్పందం ప్రకారం, వ్యక్తిగత హామీదారునికి సంబంధించిన బాకీలు, వాటికి అనుబంధంగా ఉన్న భద్రతా హక్కులు మరియు వాటిపై సృష్టించబడిన హామీలను, చట్టంలోని సెక్షన్ 5 నిబంధనల ప్రకారం, "సెక్యూర్డ్ క్రెడిటర్" అయిన ప్రుడెంట్ ఏఆర్‌సి లిమిటెడ్ (ప్రుడెంట్ ట్రస్ట్ -123-25) కు బదలాయించబడినవి.

అలాగే, ఆర్థిక ఆస్తులు మరియు వాటికి సంబంధించిన భద్రతా హక్కులు, చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం అసైనర్ ద్వారా ట్రస్టీ హోదాలో వ్యవహరిస్తున్న ప్రుడెంట్ ఏఆర్‌సి లిమిటెడ్ (ప్రెడెంట్ ట్రస్ట్ -123-25)కు బదలాయించబడినవి. ఈ బదలాయింపు ఫలితంగా, ప్రుడెంట్ ఏఆర్‌సి లిమిటెడ్ సెక్యూర్డ్ క్రెడిటర్ స్థానంలోకి ప్రవేశించి, బకాయి మొత్తాలను వసూలు చేయుటకు మరియు భద్రతా హక్కులను అమలు చేయుటకు హక్కుదారుగా నిలిచింది.

అలాగే, ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) నిర్దేశించిన గడువులో బకాయిలను చెల్లించడంలో విఫలమైనందున, ఋణగ్రహీత(లు)/హామీదారుడు(లు) మరియు సాధారణ ప్రజలకు తెలియజేయబడునది ఏమనగా, క్రింద సంతకం చేసిన అధికారి, ప్రుడెంట్ ఏఆర్‌సి లిమిటెడ్ ( ప్రుడెంట్ ట్రస్ట్ -123-25) యొక్క అధీకృత అధికారిగా, చట్టంలోని సెక్షన్ 13(4)తో పాటు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 8 ప్రకారం కల్పించిన అధికారాలను వినియోగించి, క్రింద వివరించిన భద్రతా ఆస్తి(లు)పై స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) మరియు సాధారణ ప్రజలు, పై భద్రతా ఆస్తి(లు)తో ఎటువంటి లావాదేవీలు చేయరాదని హెచ్చరించబడుచున్నారు. ఆ ఆస్తి(లు)కు సంబంధించిన ఏ విధమైన లావాదేవీలైనా, ప్రుడెంట్ ఏఆర్‌సి లిమిటెడ్ (ప్రెడెంట్ ట్రస్ట్ -123-25) యొక్క వర్తించే వడ్డీ, ఖర్చులు, చార్జీలు మరియు ఇతర వ్యయాలతో కూడిన హక్కులకు లోబడి ఉంటాయి.

భద్రతా ఆస్తులను విమోచించుకొనేందుకు అందుబాటులో ఉన్న గడువు విషయమై, ఋణగ్రహీత(లు)/హామీదారు(లు) చట్టంలోని సెక్షన్ 13 ఉప-విభాగం (8) నిబంధనల వైపు దృష్టి సారించాల్సిందిగా కోరడమైనది.

| క్ర. సం. | ఋణగ్రహీత(లు)/సహ-ఋణగ్రహీతలు/ తనఖాదారులు/ గ్యారంటర్లు & ల్యాన్ | డిమాండ్ నోటీసు తేదీ & బకాయి అమౌంట్ | సెక్యూర్డ్ అస్సెట్ వివరణ (స్థిరాస్తులు) | స్వాధీనం తేదీ |
|---|---|---|---|---|
| 1. | ఐజల్ వాటర్ ప్లాంట్ (ఋణగ్రహీత), మేడవేణి గంగాధర్ (సహ-ఋణగ్రహీత నం. 1) & మేడవేణి కంకటర (సహ-ఋణగ్రహీత నం. 2)/ HCFKARSEC00001027500 | (19/02/2026) రూ. 12,99,057/- 23/01/2026 తేదీ నాటికి | పెద్దపల్లి జిల్లా, ధర్మారం మండలం, ఖిలావనపర్తి రెవెన్యూ గ్రామం పరిధిలోని, ఖిలావనపర్తి గ్రామ పంచాయతీ పరిమితుల్లో, సుల్తానాబాద్ సబ్-రిజిస్ట్రార్ మరియు కరీంనగర్ రిజిస్ట్రేషన్ జిల్లా పరిధిలో గల సర్వే నంబర్: 967/ఎ/1 లో ఎలాంటి ఇల్లు లేదా నిర్మాణాలు లేని 1210.00 చదరపు గజాలు దీనికి సమానమైన 1011.56 చదరపు మీటర్లు గల ఖాళీ స్థలం/ఓపెన్ ప్లాట్. దీనికి సంబంధించిన ప్లాన్ ఇక్కడ జతపరచబడింది. సరిహద్దులు: తూర్పు: ల్యాండ్ ఆఫ్ ది వెండర్ మందపెల్లి శ్రీకాంత్, సిరికొండ మల్లయ్య & 15 అడుగుల వెడల్పు మార్గం పడమర: కొక్కుల బాలకృష్ణ, వెండర్ మందపెల్లి శ్రీకాంత్ & కనుకుట్ల నర్సయ్య భూమి ఉత్తరం: సిరికొండ శ్రీనివాస్ మరియు వెండర్ మందపెల్లి శ్రీకాంత్ భూమి దక్షిణం: 30 అడుగుల వెడల్పు రోడ్డు, కాశిపాక అశోక్ భూమి | 18/05/2026 |
| 2. | మహేశ్వర టిఫిన్ సెంటర్ (ఋణగ్రహీత), భడమేని శ్రీనివాస్ (సహ-ఋణగ్రహీత నం. 1) & భడమేని లక్ష్మి (సహ-ఋణగ్రహీత సం. 2)/ HCFKARSEC00001029670 | (19/02/2026) రూ. 7,25,694/- 22/01/2026 తేదీ నాటికి | రాజన్న సిరిసిల్ల జిల్లా, కొన్నారావుపేట మండలం, సుద్దాల రెవెన్యూ గ్రామంలో, సుద్దాల గ్రామ పంచాయతీ పరిధిలో, వేములవాడ ఉప-జిల్లా రిజిస్ట్రేషన్ పరిధి మరియు కరీంనగర్ జిల్లా రిజిస్ట్రేషన్ పరిధిలో ఇం.నం. 2-104 కలిగిన, రేకుల కప్పుతో కూడిన ఇల్లు మరియు దాని ఆవరణలోని ఖాళీ స్థలం మొత్తం 136 చదరపు గజాలు దానికి సమానమైన 114.24 చదరపు మీటర్ల విస్తీర్ణంలో, 253 చదరపు అడుగుల ప్లింత్ విస్తీర్ణంలోని యావత్తు. దిగువ పేర్కొన్న సరిహద్దుల లోపల ఉంది. దీనికి సంబంధించిన ప్రణాళిక జతచేయబడింది. సరిహద్దులు: తూర్పు - రోడ్డు; పడమర - అరవెల్లి వజ్రవ్వ గారి ఖాళీ స్థలం; ఉత్తరం - భదనవి మల్లేశం గారి ఇల్లు; దక్షిణం - M.D. హైమద్ గారి ఇల్లు. | 18/05/2026 |
| 3. | నర్మదా మెస్ (ఋణగ్రహీత), కృష్ణంరాజు పురాణం (సహ-ఋణగ్రహీత నం. 1), పురాణం లక్ష్మి (సహ-ఋణగ్రహీత నం. 2) & పురాణం పద్మ (సహ-ఋణగ్రహీత నం. 3) / HCFJGTSEC00001040516 | (19/02/2026) రూ. 10,53,126/- 23/01/2026 తేదీ నాటికి | జగిత్యాల జిల్లా, రిజిస్ట్రేషన్ ఉప జిల్లా: కోరుట్ల, రిజిస్ట్రేషన్ జిల్లా: కరీంనగర్, కోరుట్ల మండలం, మాదాపూర్ గ్రామంలో సర్వే నం. 581/B, విస్తీర్ణం 167 చదరపు గజాలు (139.62 చదరపు మీటర్లు) స్థిరాస్తికి సంబంధించిన యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: మాణిక్యం గారి ఖాళీ స్థలం; దక్షిణం: లంబాడి రమ గారి ఖాళీ స్థలం; తూర్పు: దామ లక్ష్మణ్ గారి ఖాళీ స్థలం; పడమర: 18 అడుగుల వెడల్పు గల రహదారి. | 18/05/2026 |
| 4. | ప్రతిభ సీడ్స్ పెస్టిసైడ్స్ అండ్ ఫెర్టిలైజర్ (ఋణగ్రహీత), పుప్పాల రమాదేవి (సహ-ఋణగ్రహీత నం.1) & పుప్పాల శంకర్ బాబు (సహ-ఋణగ్రహీత నం.2)/ HCFJGTSEC00001016661 | (19/02/2026) రూ. 6,41,980/- 22/01/2026 తేదీ నాటికి | జగిత్యాల జిల్లా, కథలాపూర్ మండలం, సిరికొండ గ్రామంలో ఇం.నం. 4-133 కలిగిన, 184.22 చదరపు గజాల విస్తీర్ణం మరియు 574 చదరపు అడుగుల ఆర్.సి.సి. పైకప్పు ప్లింత్ వైశాల్యం కలిగిన స్థిరాస్తి యొక్క యావత్తు. దీని సరిహద్దులు:- ఉత్తరం: రోడ్డు, మ్యాదరి లక్ష్మణ్ ఇల్లు మరియు మ్యాదరి కిషన్ ఇల్లు; దక్షిణం: పుప్పాల భూమయ్య ఖాళీ స్థలం; తూర్పు: పుప్పాల భూమయ్య ఖాళీ స్థలం; పడమర: పుప్పాల చిన్నోల్ల చిన్న గంగారం ఇల్లు. | 18/05/2026 |
| 5. | తాజ్ ఎగ్ ట్రేడర్స్ (ఋణగ్రహీత), ఇబ్రహీం (సహ-ఋణగ్రహీత నం.1) & షేక్ జరీనా (సహ-ఋణగ్రహీత నం.2)/ HCFJGTSEC00001021018 | (19/02/2026) రూ. 23,25,730/- 23/01/2026 తేదీ నాటికి | జగిత్యాల జిల్లా, మెట్‌పల్లి ఉప-రిజిస్ట్రార్ కార్యాలయ అధికార పరిధిలో, మెట్‌పల్లి మండలం, రామరావుపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో, ఆర్.సి.సి. పైకప్పుతో నిర్మించిన ఇంటి నం 3-100 కలిగి గ్రౌండ్ ఫ్లోర్ ప్లింత్ విస్తీర్ణం 550 చదరపు అడుగులు, మొత్తం 313 చదరపు గజాలు (లేదా 261.69 చదరపు మీటర్లు) విస్తీర్ణంలో యావత్తు. సరిహద్దులు: ఉత్తరం: గోవింద్ కుమార్ ఇల్లు; దక్షిణం: బట్టు వెంకటేష్ ఇల్లు; తూర్పు: ప్రభుత్వ స్థలం; పడమర: సిసి రోడ్డు. | 18/05/2026 |

తేది: 24.05.2026
ప్రదేశం: కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల

సం/- అధీకృత అధికారి
ప్రుడెంట్ ఏఆర్‌సి లిమిటెడ్ (ప్రుడెంట్ ట్రస్ట్ -123-25)

# ప్రజల ఆరోగ్యం ప్రభుత్వం బాధ్యత

- ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి
- ఆరోగ్యమే మనకు అసలు సిసిలు సంపద
- యోగా, ధ్యానం, ప్రాణాయామం జీవితంలో భాగం కావాలి
- ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని
- కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో చంద్రబాబు

చిత్తూరు,మే24: ఆహారమే ఔషధం, వంటశాలే ఔషధ శాల. ఈ మాట నేను ఎప్పుడూ చెబుతాను. మనం తినే ఆహారమే మనకు తిరుగులేని ఆరోగ్యాన్ని అందిస్తుంది' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్ఘాటించారు. శనివారం చిత్తూరు జిల్లా పూతలపట్టు నియోజకవర్గం, యాదమరి మండలం కండ్రిగలో నిర్వహించిన 'సంజీవని' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. తన వరకు తాను పూర్తి ఆహార నియమాలు పాటిస్తానని, మంచి అలవాట్లు, మంచి ఆహారం, వ్యాయామం, మంచి ఆలోచనల ద్వారా ప్రతి ఒక్కరూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. యోగా, ధ్యానం, ప్రాణాయామం వంటివి జీవనశైలిలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సంపద ఉన్నవాళ్లకంటే ఆరోగ్యంగా ఉన్నవాళ్లే అదృష్టవంతులని ఉద్ఘాటించారు. ఈ సందర్భంగా 'సంజీవని' కార్యక్రమం ప్రాముఖ్యతను సిఎం వివరించారు. 'రామ రావణ యుద్ధంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవనిని తీసుకొచ్చారు. అదే స్ఫూర్తితో, డిజిటల్ హెల్త్ రికార్డులతో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఈ కార్యక్రమానికి 'సంజీవని' అని పేరు పెట్టాం. సంపద కంటే ఆరోగ్యమే గొప్పది. అందుకే ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అన్నారు' అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రపంచస్థాయి వైద్య సేవలను ప్రజలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఆగస్టు 15 నాటికి రాష్ట్రమంతటా సంజీవని పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. రాబోయే రోజుల్లో






ప్రతి ఒక్కరికీ ఒక ఏఐ డాక్టర్ ఉంటారని తెలిపారు. సంజీవని పథకం విస్తరణలో భాగంగా డబ్బు, హోదా, కార్లు ఎన్ని ఉన్నా.. అన్నింటికీ మించింది ఆరోగ్యమేనని గుర్తు చేశారు. సంజీవని పథకం కింద ఇంటి నుంచే 74 రకాల వైద్య పరీక్షలు చేయించుకునే అవకాశముందన్నారు. వ్యాధులు రాకముందే గుర్తించి, నివారించేందుకు ప్రిడిక్టివ్, ప్రివెంటివ్, క్యూరేటివ్ విధానంలో ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. గత జూలైలో కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించి, మార్చి 15 నుంచి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని 19.75 లక్షల మంది ఆరోగ్యాన్ని కాపాడేలా చర్యలు తీసుకుంటున్నామని, ఆగస్టు 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును ప్రారంభిస్తామని ప్రకటించారు. ఈ పథకంలో భాగంగా 42 రకాల వైద్య పరీక్షలను ప్రజల ఇళ్ల వద్దే నిర్వహించి, రిపోర్టులు అందిస్తామన్నారు. డాక్టర్ అపాయింట్‌మెంట్, వర్చువల్ కనెక్ట్ ద్వారా వైద్య సలహాలు, వ్యక్తిగత ఆరోగ్య రికార్డుల డిజిటలైజేషన్ వంటి సేవలు అందిస్తున్నట్లు వివరించారు. త్వరలోనే ఏఐ డాక్టర్ ద్వారా కూడా వైద్య సేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి వ్యక్తికి ఒక ఏఐ డాక్టర్ ఉంటాడని స్పష్టం చేశారు. వైద్య ఖర్చుల భారం నుంచి కుటుంబాలను గట్టెక్కించడమే ప్రభుత్వ లక్ష్యమని, విద్య, వైద్య రంగాలకు ప్రజా ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ఏడాది వైద్యరంగానికి రూ.19,305 కోట్లు కేటాయించామని, 15వ ఆర్థిక సంఘం నుంచి దేశంలోనే అత్యధికంగా రూ.2,601 కోట్ల ఆరోగ్య గ్రాంట్లు సాధించామని గుర్తు చేశారు. యూనివర్సల్ హెల్త్ పాలసీ కింద ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల విలువైన వైద్యం, ఎన్టీఆర్ వైద్య సేవ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.25 లక్షల వరకు ఖర్చులు భరిస్తామని హామీ ఇచ్చారు. ప్రకృతి బాగుంటేనే మనం బాగుంటామని, పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సిఎం చంద్రబాబు అన్నారు. సమర్థ నీటి నిర్వహణతో భూగర్భ జలాలను పెంచగలిగామని, దీనికి అన్నమయ్య జిల్లానే నిదర్శనమని చెప్పారు. ప్రభుత్వ యంత్రాంగం చర్యలతో అక్కడ భూగర్భ జలాలు 8.5 మీటర్లు పెరిగి, పచ్చదనం పెరిగిందన్నారు. రాష్ట్రమంతా తీవ్ర ఉష్ణోగ్రతలు ఉంటే, అన్నమయ్య జిల్లాలో ఉష్ణోగ్రతలు తగ్గాయని, పిడుగురాళ్లలో 49 డిగ్రీలు నమోదైతే, అన్నమయ్యలో 40 డిగ్రీలే ఉందని నివేదికలను ఉటంకించారు. సాగునీటి ప్రాజెక్టులపై సంకల్పంతో పనిచేస్తున్నామని, ఏ ప్రాజెక్టు ఎప్పుడు పూర్తి చేస్తామో క్యాలెండర్ విడుదల చేశామని చంద్రబాబు తెలిపారు. నీవా పనులు పూర్తి చేసి పూతలపట్టు మీదుగా చిత్తూరు వరకు కృష్ణా నీటిని తెస్తామని, కల్యాణి డ్యాంకు కూడా నీళ్లిస్తామని హామీ ఇచ్చారు. గాలేరు-నగరి, మల్లెమడుగు, సోమశిల-స్వర్ణముఖి లింక్ కెనాల్ వంటి ప్రాజెక్టుల పూర్తికి గడువులను ప్రకటించారు. ప్రజల భవిష్యత్తుకు భరోసా ఇవ్వడమే తమ లక్ష్యమని, ఆ దిశగా నిరంతరం పనిచేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

## గొడ్డలి పార్టీతో జాగ్రత్త సుమా

### రప్పారప్పా అంటే తోక కట్ చేస్తాం: వైసిపికి సిఎం చంద్రబాబు హెచ్చరిక

చిత్తూరు,మే24:
'సమాజానికి గొడ్డలి పార్టీ హానికరం.. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్' అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. చిత్తూరు జిల్లా యాదమర్రిలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో సీఎం మాట్లాడారు. రప్పారప్పా రంకెలు.. జంతు రక్తంతో కటౌట్లకు



అభిషేకాలా..సీబీఎన్ దగ్గర తోక జాడిస్తే.. ప్రజాహితం కోసం తోక కట్ చేస్తానని హెచ్చరించారు. గొడ్డలి పార్టీ పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలి, ప్రజాస్వామ్యంలో ఆ పార్టీకి చోటులేదని సీఎం అన్నారు. అభివృద్ధి సంక్షేమంతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులకు రక్షణ ఇవ్వాలి. కులాలు, మతాల మధ్య చిచ్చుపెట్టి రోజుకొక నాటకమాడుతున్నారు. అసత్య ప్రచారాలతో రాజకీయ లబ్ది పొందాలని చూస్తున్నారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా? దళిత యువకుడు సుబ్రమణ్యాన్ని హత్య చేసి డోర్ డెలివరీ చేసిన వారికి సన్మానాలా? కుటుంబ బంధాలపై గొడ్డలి వేటు.. తల్లి, చెల్లికి ఆస్తులివ్వకుండా వేధించారు. తల్లి, చెల్లికి న్యాయం చేయలేని వారు.. ప్రజలను ఏం చూస్తారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రజలు స్వేచ్ఛగా బతుకుతున్నారు. నేను ప్రజల సేవకుణ్ణి.. పెత్తందారు కాదు. నిరంతరం పనిచేసి పేదల రుణం తీర్చుకుంటా. ప్రజల ఆస్తులు, ప్రాణాలకు రక్షణ కల్పించింది. ఎన్డీయే కూటమి అని సీఎం అన్నారు. జగన్ నంగనాచిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జగన్ నోరు తెరిస్తే అన్నీ అబద్ధాలేనని విమర్శించారు. మాజీ మంత్రి వివేకా హత్యకేసులో తనపై దుష్ప్రచారం చేశారని ఆగ్రహించారు. బాబాయ్ హత్యలో తనపై నారాసుర రక్త చరిత్ర అని ప్రచారం చేశారని దుయ్యబట్టారు. డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యంను చంపిన ఎమ్మెల్సీ అనంతబాబుకు.. జగన్ సన్మానం చేశారని సెటైర్లు గుప్పించారు. తల్లి, చెల్లిని చూడనివారు ప్రజలకు మంచి చేస్తారా..? అని ప్రశ్నించారు. ఏపీ అభివృద్ధిని చూసి గొడ్డలి పార్టీ ఓర్వలేకపోతోందని సీఎం చంద్రబాబు ధ్వజమెత్తారు. అమరావతిపై గొడ్డలి వేటు వేసిన వ్యక్తి జగన్‌రెడ్డి అని విమర్శించారు. అసత్య ప్రచారాలతో జగన్ అండ్ కో లబ్ధి పొందాలని చూస్తున్నారని ఫైర్ అయ్యారు. కోడి కత్తి, గులకరాయి నాటకాలు గుర్తున్నాయి కదా? అని ప్రశ్నించారు. కులమతాల మధ్య చిచ్చుపెట్టి రోజుకో నాటకమాడుతున్నారని విమర్శించారు. జగన్ అధికార దాహానికి తల్లి, చెల్లి అతీతం కాదని అన్నారు.హిందూ ధర్మం, దేవాలయాలపై దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. మత విద్వేషాలు రెచ్చగొట్టేందుకు పాస్టర్లతో డ్రామాలు చేయిస్తున్నారని ముఖ్యమంత్రి ధ్వజమెత్తారు. రప్పా.. రప్పా అని జగన్ కటౌట్లకు జంతువుల రక్తం చల్లుతున్నారని విమర్శించారు. తన దగ్గర తోకజాడిస్తే కట్ చేస్తా.. ఇక్కడుంది 1995 నాటి సిబిఎన్ అని ప్రస్తావించారు. జగన్.. ముందు నీ ఇంట్లో సమస్యలు చూసుకోవాలని హితవు పలికారు. అధికారంలో ఉన్నా.. ప్రతిపక్షంలో ఉన్నా.. గొడ్డలి పార్టీ బుద్ధి మారట్లేదని ఆగ్రహించారు. ప్రజాస్వామ్యంలో గొడ్డలి పార్టీకి చోటు లేదని చెప్పుకొచ్చారు. సమాజానికి గొడ్డలి పార్టీ హానికరమని.. గొడ్డలి పార్టీ నెవర్ అగైన్ అని పేర్కొన్నారు.

## ప్రభుత్వ విప్ పదవికి అరవశ్రీధర్ రాజీనామా

### పవన్ ఆదేశాలతోనే అంటూ ప్రచారం

అమరావతి,మే24: రైల్వే కోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ విప్ పదవికి శ్రీధర్ రాజీనామా చేశారు.

ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మీద ఇటీవలి కాలంలో పలు ఆరోపణలు వచ్చాయి. ముఖ్యంగా ఓ వివాహిత మహిళ అరవ శ్రీధర్ మీద చేసిన ఆరోపణలు రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపాయి. దీనిపై జనసేన విచారణ కమిటీని ఏర్పాటు చేయగా.. అరవ శ్రీధర్ తన వివరణ కూడా తెలియజేశారు. అయితే ఆ తర్వాత కూడా బాధితురాలు మరిన్ని వీడియోలు విడుదల చేయటం.. వివిధ అంశాలలో అరవ శ్రీధర్ మీద ఆరోపణలు రావటంతో ఆయన ప్రభుత్వ విప్ పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. ఈ మేరకు డిప్యూటీ సిఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు తన రాజీనామా లేఖను సమర్పించారు. మరోవైపు రైల్వేకోడూరు జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ , పోలవరం ఎమ్మెల్మే చిర్రి బాలరాజుతో పవన్ కళ్యాణ్ శనివారం సమావేశమైనట్లు తెలిసింది. ఈ సందర్భంగా తమపై వస్తున్న ఆరోపణలపై ఇద్దరు ఎమ్మెల్యేలు తమ వివరణ వినిపించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే శాసన సభలో విప్‌గా ఉన్న అరవ శ్రీధర్ తన విప్ పదవికి రాజీనామా పత్రాన్ని అందచేశారు. వ్యక్తిగత కారణాలతో విప్ పదవికి రాజీనామా చేస్తున్నట్లు అరవ శ్రీధర్ తెలిపారు. తనపై వచ్చిన ఆరోపణలు, నెలకొన్న వివాదాలపై పవన్ కళ్యాణ్‌కు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. కొన్ని రోజులుగా రైల్వేకోడూరుకు చెందిన ఓ మహిళ సామాజిక మాధ్యమాల్లో ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మీద చేస్తున్న ఆరోపణల వ్యవహారం సంచలనంగా మారింది. తనను పెళ్లి చేసుకుంటానని అరవ శ్రీధర్ తనను నమ్మించి మోసం చేశారంటూ సామాజిక మాధ్యమాల్లో పలు సంచలన వీడియోలు విడుదల చేశారు. ఈ వ్యవహారంపై ఇప్పటికే కేసు నమోదై విచారణ జరుగుతోంది. ఈ క్రమంలోనే ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌పై మరికొన్ని రాజకీయపరమైన ఆరోపణలు వచ్చాయి. ఈ క్రమంలోనే అసెంబ్లీలో విప్ పదవికి అరవ శ్రీధర్ రాజీనామా చేసినట్లు తెలిసింది. అయితే రాజీనామా లేఖలో వ్యక్తిగత కారణాలతో అని పేర్కొన్నారు.

## వైఎస్ రాజారెడ్డి అరచకాలు అన్నీఇన్నీకావు

అమరావతి,మే23: పులివెందులలో వైఎస్ రాజారెడ్డి చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావని బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ చెప్పుకొచ్చారు. వైఎస్ ఎలా చనిపోయారో అందరికీ తెలుసునని... ఈ విషయంలో జగన్ సెల్ఫ్ గోల్ వేసుకున్నారని సెటైర్లు గుప్పించారు. ఈ మేరకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై బీజేపీ అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి తండ్రి రాజారెడ్డిపై కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రౌడీషీట్ ఉందని విమర్శించారు. ఓ కులాన్ని అడ్డం పెట్టుకుని దొంగతనాలు చేయించి డబ్బు గడించిన చరిత్ర రాజారెడ్డిదని ఎద్దేవా చేశారు. శనివారం అమరావతి వేదికగా మీడియాతో ఎంపీ రమేశ్ మాట్లాడారు. ఓ మైన్ ఓనర్‌ను అంతమొందించి రాజారెడ్డి గనులు దక్కించుకుని ధనవంతుడయ్యారని విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి మరణాన్ని, మాజీ మంత్రి వివేకారెడ్డి మరణాన్ని జగన్ వేరేలాగా చిత్రీకరిస్తున్నారని ఎంపీ రమేశ్ అన్నారు. వివేకా హత్య కేసులో జగన్ హస్తం ఉందా..?, లేదా..? అనేది ఓపెన్ పోల్ పెట్టాలని సవాల్ చేశారు. ఈ కేసుతో జగన్‌కి సంబంధం లేదని వస్తే తాను రాజకీయాలు వదిలేస్తానని ఛాలెంజ్ చేశారు. ప్రజలకు జగన్ హత్యా రాజకీయాల గురించి తెలిసిపోయిందని.. అందుకే ఆయన ఇప్పుడు తాను మంచివాడిని అని చెబుతున్నారని అన్నారు. వివేకా కేసులో సీబీఐ విచారణ చేసి భాస్కర్ రెడ్డిని అరెస్ట్ చేసిందని ప్రస్తావించారు. ఎస్టీ కులాన్ని అడ్డుపెట్టుకుని రాజారెడ్డి దోపిడీలు చేశారని.. ఇలా పోలీసుల రికార్డుల్లో కూడా ఉందని గుర్తుచేశారు. పులివెందులలో పార్నపల్లి గ్రామంలో రాజారెడ్డి చేసిన ఆకృత్యాలకు ఇంకా సజీవ సాక్షులు ఉన్నారని చెప్పుకొచ్చారు. రాజారెడ్డి ఎందరినో రాజకీయ లబ్ధి కోసం హత్య రాజకీయాలు చేశారని ఆరోపించారు. రాజారెడ్డిని హత్య చేసింది ఆయన వల్ల ఇబ్బంది పడిన బాధితులేనని చెప్పుకొచ్చారు. రాజారెడ్డి మీద రౌడీషీట్ సహా పలు కేసులు గతంలో ఉన్నాయని ప్రస్తావించారు. ఆ సమయంలో చంద్రబాబు సీఎం కాదని.. టీడీపీ ప్రభుత్వమే లేదని ఎంపీ సీఎం రమేశ్ పేర్కొన్నారు.

## జాతీయ రహదారిపై ఆర్టీసి బస్సు, కారు ఢీ

### ఒక మహిళ మృతి..పలువురికి గాయాలు

అంబేద్కర్ కోనసీమ,మే24: ముమ్మిడివరం మండలం అనాతవరం వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. 216వ జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సు, కారు ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. మరో ముగ్గురికి తీవ్రగాయాలు అయ్యాయి. రాజోలు నుంచి విశాఖపట్నానికి ఆర్టీసీ బస్సు వెళ్తోంది. కాకినాడ నుంచి మామిడికుదురుకు కారు ప్రయాణిస్తోంది. రెండు వాహనాలు అనాతవరం దగ్గరికి రాగానే ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు, ఇతర వాహనదారులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. అలాగే ముమ్మిడివరం పోలీసులకు సమాచారం అందించారు. హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు.. బాధితులను అమలాపురం ఆస్పత్రికి తరలించారు. అయితే, చికిత్సపొందుతూ బాధితుల్లో ఓ మహిళ మృతిచెందింది. ప్రమాదంలో గాయపడిన వారి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. మరోవైపు ఈ ప్రమాదంతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ పూర్తిగా నిలిచిపోయింది. రంగంలోకి దిగిన పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## పవన్‌తో పోలవరం ఎమ్మెల్యే భేటీ

### నియోజకవర్గ అభివృద్ధి తదితరాలపై చర్చ
### అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలని సూచన

అమరావతి,మే23: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా.. పోలవరం ఎమ్మెల్యేగా ఆయన పని తీరుపై డిప్యూటీ సీఎం సమీక్ష నిర్వహించారు. పోలవరం నియోజకవర్గం పరిధికి సంబంధించి పార్టీ దృష్టికి వచ్చిన విషయాలు, ఆరోపణలపై ఎమ్మెల్యేను పవన్ వివరణ అడిగినట్లు తెలుస్తోంది. తన వ్యక్తిగత విషయాలను కుటుంబ సభ్యులతో కలిసి కూర్చొని చక్కదిద్దుకొనేందుకు కొంత గడువు ఇవ్వాలని ఎమ్మెల్యే కోరగా.. నాలుగు వారాల్లోగా చక్కదిద్దుకోవాలని పవన్ సూచించినట్లు సమాచారం. పోలవరం నియోజకవర్గంలో పంచాయతీల్లో అభివృద్ధి పనులకు ఇప్పటి వరకు రూ.147 కోట్లు కేటాయించారు. ఆ పనుల పురోగతిపైనా డిప్యూటీ సీఎం సమీక్ష చేశారు. పనుల సకాలంలో వేగంగా పూర్తి చేయకపోవడంపై పవన్ ప్రశ్నించారు. అధికారులను సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేస్తానని, వ్యక్తిగత వ్యవహారాలు చక్కదిద్దుకోవాలని సూచించినట్లు సమాచారం.

## పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

### ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమంలో మంత్రి ఫరూక్

నంద్యాల,మే24: పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని రాష్ట్ర న్యాయ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. నంద్యాల పట్టణంలోని గాంధీచౌక్‌లో పురపాలక శాఖ ఆధ్వర్యంలో శనివారం 'ఆపరేషన్ క్లీన్ స్వీప్' కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వయంగా చీపురు పట్టుకొని పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణాన్ని, రాష్ట్రాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే యువత చైతన్యంతో ముందుకు సాగాలన్నారు. నంద్యాల పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత, స్వచ్ఛమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కూరగాయల మార్కెట్ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వ్యాపారులు, ప్రజలతో మాట్లాడారు. కార్యక్రమంలో పురపాలక కమిషనర్ బండి శేషన్న, ఎంఈ గురప్ప యాదవ్, డీఈ నాగభూషణ్ రెడ్డి, అధికారులు మురళీధర్, లక్ష్మీనారాయణ శర్మ, శివ ప్రసాద్ రెడ్డి, శబరిష్, విక్రం, భాస్కర్ రెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## గాలివాన బీభత్సం

### తెగిపడ్డ చెట్లు, విద్యుత్ స్తంభాలు

విశాఖపట్టణం,మే24: తెలుగు రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల్లో గాలివాన బీభత్సం సృష్టించింది. అనకాపల్లి జిల్లా నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో దాదాపు అరగంట పాటు గాలి, వర్షం అల్లకల్లోలం సృష్టించాయి. రమణయ్యపేట, ముకుంద రాజుపేట, దోసలపాడు, చీడిక, జి.జగన్నాథపురం, గొడిచర్ల, డొంకాడ, చిన దొడ్డిగల్లు, కాగిత జాతీయ రహదారి తదితర గ్రామాల్లో పదుల సంఖ్యలో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. కొన్నిచోట్ల ఇళ్లు కూడా దెబ్బతిన్నాయి. సత్యవరం గ్రామంలో కొబ్బరి చెట్టు కూలి.. తమలపాకులు సేకరించే ఇద్దరు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. ముకుందరాజుపేటలో ఇంటి రేకులు పడి ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. గాలుల ప్రభావంతో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. మామిడి, అరటి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు విరిగిపడటంతో పలు చోట్ల సరఫరా నిలిచిపోయింది. కాకినాడ జిల్లా తుని ప్రాంతంలో భారీ ఈదురుగాలులకు తలుపులమ్మ లోవ ఆలయ మార్గంలో కారుపై చెట్లు విరిగిపడ్డాయి. అదృష్టవశాత్తు అంతా సురక్షితంగా బయటపడ్డారు.

## ప్రధాని మోడీతో రామ్మోహన్ కుటుంబం భేటీ

### జీవితాంతం గుర్తిండి పోయే మధుర క్షణం అంటూ పోస్ట్

న్యూఢిల్లీ,మే24:
కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు శనివారం కుటుంబంతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీని కలిశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి తల్లి ప్రధాన మంత్రికి మొక్కను బహుకరించారు. కుటుంబంతో కలిసి ప్రధాని మోదీని కలవటంపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఎక్స్‌లో ఓ భావోద్వేగ పోస్ట్ పెట్టారు. ఆ పోస్టులో.. 'ఈ రోజు మా కుటుంబానికి జీవితాంతం గుర్తుండిపోయే ఓ భావోద్వేగ క్షణం. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కుటుంబ సమేతంగా కలిసే అదృష్టం కలగడం ఎంతో ఆనందంగా, గర్వంగా భావిస్తున్నాను'.. ఆయన అసాధారణ వ్యక్తిత్వం, ఆప్యాయత మా కుటుంబంలోని మూడు తరాలను ఒకేలా ఆకట్టుకుంది. ప్రజల హృదయాల్లో ఆయన ఎందుకు అపారమైన ఆదరణ పొందారో ఆ క్షణంలో మరింత స్పష్టంగా తెలిసింది. ప్రత్యేకంగా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అనే మహత్తర ఆలోచనకు ప్రేరణగా నా తల్లి ప్రధానమంత్రికి మొక్కను బహుకరించడం మా కుటుంబానికి ఎంతో మధురమైన, గర్వకారణమైన క్షణంగా నిలిచిపోతుంది. ఆయన చూపిన ప్రేమ, ఆప్యాయత, ఆశీస్సులకు మేమెప్పటికీ కృతజ్ఞులమే. మాతో గడిపిన అమూల్యమైన సమయానికి వారికి హృదయపూర్వక ధన్యవాదాలు' అని అన్నారు.

## వ్యాపార ఎదుగుదలకు తోడ్పడాలి

### చార్టెడ్ అకౌంటెంట్లకు కెటిఆర్ హితవు

హైదరాబాద్,మే24(సాక్ష్యం): చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగానూ ఎదగాలని ఆకాంక్షించారు. కృత్రిమ మేధను తమ వృత్తిలో భాగం చేసుకోవాలన్నారు. గచ్చిబౌలిలో 'ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా' స్నాతకోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర అత్యంత కీలకమని.. ట్యాక్స్‌లు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో వారి అవసరం చాలా ఉందన్నారు. సీఏలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన సత్కరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల త్యాగాలను, కష్టాన్ని ఎప్పటికీ మరువకూడదని.. వారిని ఎల్లప్పుడూ గౌరవించాలని సూచించారు.

## జింఖానా కల్బ్ స్వాధీనానికి నోటీసులు

### రక్షణ శాఖ కు అప్పగించాలని ఆదేశం

న్యూఢిల్లీ,మే24(సాక్ష్యం): దేశంలోనే అతి పురాతన క్లబ్‌లలో ఒకటైన లూటియన్స్ ఢిల్లీలోని జింఖానా క్లబ్‌ను ప్రాంగణాన్ని జూన్ 5 లోగా సర్కార్ కు అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. రక్షణ మౌలిక సదుపాయాలు బలోపేతం చేసేందుకు, ప్రజా భద్రతాప్రయోజనాల కోసం ఇంపీరియల్ ఢిల్లీ జింఖానా క్లబ్ లిమిటెడ్ ఆధీనంలో ఉన్న 27.3 ఎకరాల స్థలాన్ని రక్షణ శాఖకు అప్పగించాలని ఆదేశించింది. ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ రోడ్‌లో ఉన్న ప్రాంగణాన్ని గతంలో సామాజిక ,క్రీడా క్లబ్‌ను నిర్వహించే నిర్దిష్ట ప్రయోజనం కోసం ఇంపీరియల్ ఢిల్లీ జింఖానా క్లబ్ లిమిటెడ్‌కు లీజుకు ఇచ్చినట్లు మే 22న జారీ చేసిన అధికారిక ఉత్తర్వులో పేర్కొంది. ప్రభుత్వ ఉత్తర్వు ప్రకారం.. జూన్ 5న ఆ ప్రాంగణాన్ని భూమి ,కార్యాలయ భవనాన్ని స్వాధీనం చేసుకోనుంది. ప్రభుత్వం తరపున ఆ శాఖ సాంకేతిక విభాగం స్వాధీనం చేసుకుంటుందని తెలిపింది. 1913లో ఢిల్లీ జింఖానా క్లబ్ ప్రారంభమైంది. లోక్ కళ్యాణ్ మార్గ్‌లోని ప్రధానమంత్రి నివాసానికి ఆనుకొని, లూటియన్స్ ఢిల్లీ నడిబొడ్డున ఉంది. అప్పట్లో దీనిని ఇంపీరియల్ ఢిల్లీ జింఖానా క్లబ్ అని పిలిచేవారు. 1947 ఆగస్టు 15న భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ఇంపీరియల్ అనే పదాన్ని తొలగించారు.

## అంతర్జాతీయ ప్రభావాలపైనే మారకం విలువ

### ఇందులో ప్రభుత్వం జోక్యం ఉండదన్న గోయల్

న్యూఢిల్లీ,మే24(సాక్ష్యం): ఎక్స్ఛేంజీ రేట్ల విషయంలో కేంద్ర ప్రభుత్వం జోక్యం ఉండదని వాణిజ్యశాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. రూపాయి విలువ అనేక అంతర్జాతీయ అంశాలు, మార్కెట్‌లపై ఆధారపడి ఉంటుందని వ్యాఖ్యానించారు. దిల్లీలో ఏర్పాటు చేసిన 19వ రోజ్‌గార్ మేళాలో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వం ఎప్పుడూ ఎగుమతులను ప్రోత్సహించడం, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. అయితే, రెండు, మూడు రోజులుగా చూస్తే.. రూపాయి బలపడుతుండటాన్ని గమనించవచ్చన్నారు. డాలరుతో పోలిస్తే రూపాయి విలువ ఇటీవల కనిష్ఠ స్థాయికి చేరుకున్న విషయం తెలిసిందే. అయితే, మార్కెట్ సూచీలు పుంజుకోవడం, సానుకూల అంతర్జాతీయ సంకేతాలతో రెండు రోజులుగా రూపాయి కొంత బలపడుతోంది. అమెరికా-ఇరాన్ శాంతి చర్చల పురోగతిపై ఆశలు పనిచేసినట్లు మార్కెట్ రంగ నిపుణులు విశ్లేషిస్తున్నారు.

## ఎపికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

### రాహుల్ ప్రధాని అయితేనే ఎపికి లబ్ది

### రాజ్యాంగాన్ని రద్దు చేసే కుట్రలో బిజెపి

**మీడియా సమావేశంలో కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

హైదరాబాద్,మే24(సాక్ష్యం): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ఏపీకి ప్రత్యేక హోదా వస్తుందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ కోసమైనా రాహుల్ గాంధీని ప్రధానిని చేయాలని ఏపీ ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఆలోచన చేయాలని.. ఓటు ఎవరికో వేసి దేవుడిని ఏదో అడిగితే ఎవరూ ఏం చేయలేరని అన్నారు. హైదరాబాద్ గాంధీ భవన్‌లో జగ్గారెడ్డి మీడియా సమావేశం



నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీకి ప్రత్యేక హోదా సహా పలు అంశాలపై స్పందించారు. 'భక్తి అంటే నాది.. నేను రియల్ ఎస్టేట్‌లో సంపాదించిన డబ్బులతో సీతారాముల కల్యాణం చేస్తాను. తెలంగాణలో ఒక్క బీజేపీ నేత అయినా నాలాగా చేస్తారా?. రాములవారి కల్యాణం చేసి నేనెప్పుడైనా ఓట్లు అడిగానా?. ఛత్రపతి శివాజీకి లేని మతం మీకెందుకు?. శివాజీ దగ్గర ముస్లింలు మంత్రులుగా పనిచేశారు. బీజేపీ నేతలు చదువుకోవాలి. ఆ పార్టీ వాళ్లు మాట్లాడితే హిందువులు అంటారు. రాజ్యాంగాన్ని తీసేసే కుట్ర బీజేపీ చేస్తోంది. రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ పాటుపడు తున్నారు. ఆయన ఎక్కడికి వెళ్లినా ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. దేశ ప్రజలకు కవచం లాంటిది రాజ్యాంగం. కవచకుండలాలు ఉన్నంతకాలం కర్ణుడిని ఎవరూ చంపలేకపోయారు. అవి దానం చేశాక కర్ణుడి ప్రాణాలు పోయాయి. ఎన్నికల కమిషన్ ద్వారా ఓటు చోరీ చేసి కమలం పార్టీ అధికారంలోకి వచ్చింది. ఓట్లను దొంగిలించి ఎంపీ సీట్లు గెలిచింది. దేవుడి పేరుతో, మతం పేరుతో, దొంగ ఓట్లతో ఆ పార్టీ గెలుస్తోంది. దేశ ప్రజలు ఇప్పటికే ప్రమాదంలో ఉన్నారు. రాజ్యాంగాన్ని తీసేస్తే మరింత ప్రమాదంలో పడతారు. దేశం 67 ఏళ్ల పాలనలో రూ.54 లక్షల కోట్ల అప్పు చేస్తే.. బీజేపీ అధికారంలోకి వచ్చాక రూ.1,047 లక్షల కోట్ల అప్పులు చేసింది. ÷ూహుల్ కుటుంబం అధికారం కోసం ఏనాడూ తాపత్రయపడలేదు. ఆయనది ఆస్తులు, ప్రాణత్యాగం చేసిన కుటుంబం. ప్రధాని పదవిని రాహుల్ త్యాగం చేశారు. అధికారం చేపట్టిన తర్వాత మోదీ చేసిన మంచి ఒక్కటి చెప్పండి' అని మండిపడ్డారు.

## యశోద హాస్పిటల్స్ అత్యాధునిక "సెంట్రల్ అంబులెన్స్ కమాండ్ సెంటర్" & "స్పెషల్ కనెక్టెడ్ అంబులెన్స్ సర్వీసెస్" ప్రారంభం

హైదరాబాద్, మే 23, 2026(సాక్ష్యం): యశోద హాస్పిటల్స్-హైటెక్ సిటీలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన "సెంట్రల్ అంబులెన్స్ కమాండ్ సెంటర్" మరియు "స్పెషల్ కనెక్టెడ్ అంబులెన్స్ సర్వీసెస్"ను ఈరోజు సైబరాబాద్





పోలీస్ కమిషనర్ డాక్టర్. ఎం. రమేష్ (ఐపీఎస్), యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్.ఎ. లింగయ్య, అలాగే యశోద హాస్పిటల్స్-హైటెక్ సిటీ మరియు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్. వెంకట్ రమణ్ కోలా గారితో కలిసి ప్రారంభించారు. యశోద హాస్పిటల్స్ ప్రవేశపెట్టిన ఈ వినూత్నఅత్యాధునిక వ్యవస్థ హైదరాబాద్ నగరంలోని ఔటర్ రింగ్ రోడ్ (ORR) ట్రామా కారిడార్లలో, అత్యవసర పరిస్థితుల సమయంలో కీలకమైన "గోల్డెన్ అవర్"లో సేవలను మరింత వేగవంతంగా, సమర్థవంతంగా అందించేందుకు రూపొందించబడింది. ఈ అత్యాధునిక ఎమర్జెన్సీ రెస్పాన్స్ వ్యవస్థలో ప్రపంచస్తాయి అంబులెన్స్ టెక్నాలజీ, కేంద్రీకృత కమాండ్ ఆపరేషన్స్, రియల్-టైమ్ టెలీ మానిటరింగ్, స్పెషలిస్ట్ గైడెడ్ ఇంటర్వెన్షన్స్, ట్రామా రెస్పాన్స్ వ్యవస్థలను ఒకే వేదికపై అత్యవసర వైద్య సేవలను వేగవంతంగా అందించడానికి సమన్వయం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్. ఎం. రమేష్(ఐపీఎస్) మాట్లాడుతూ, "యశోద హాస్పిటల్స్ ప్రారంభించిన ఈ సెంట్రల్ అంబులెన్స్ కమాండ్ సెంటర్ రోడ్డు ప్రమాదాలు మరియు అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన వైద్య స్పందన అందించి ప్రాణాలను కాపాడటంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. కనెక్టెడ్ అంబులెన్స్ టెక్నాలజీ, రియల్‌టైమ్ మానిటరింగ్ మరియు ORR ట్రామా కారిడార్ సమన్వయం ద్వారా గోల్డెన్ అవర్లో అత్యవసర వైద్య స్పందన మరింత సమర్థవంతంగా మారనున్నదని పేర్కొన్నారు. ఈ స్పెషల్ కనెక్టెడ్ అంబులెన్స్ సర్వీసెస్ ను ప్రారంభించిన సందర్భంగా కమిషనర్ డాక్టర్. ఎం. రమేష్ ఆన్‌లైన్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా యశోద హాస్పిటల్స్ 8 ORR




ట్రామా సెంటర్లలోని ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లతో స్వయంగా మాట్లాడి, ప్రాణాలను రక్షించడంలో వారు అందిస్తున్న అంకితభావ సేవలను అభినందించారు.

అదే నిబద్ధత, కరుణాభావం మరియు అత్యవసర స్పందన స్ఫూర్తితో తమ సేవలను కొనసాగించాలని ఆయన ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లను ప్రోత్సహించారు. అలాగే, అత్యవసర వైద్యం, ట్రామా సైన్సెస్, పేషెంట్ సేఫ్టీ మరియు అత్యాధునిక ఆరోగ్య సేవల రంగాల్లో యశోద హాస్పిటల్స్ దేశంలోనే అగ్రగామిగా తన స్థానాన్ని మరింత బలపరుచుకుం



టోందని అన్నారు. ప్రపంచ స్థాయి వైద్య సేవలను వేగం, ఖచ్చితత్వం, సాంకేతిక నైపుణ్యం మరియు మానవీయతతో అందించాలనే తమ లక్ష్యాన్ని యశోద హాస్పిటల్స్ మరోసారి చాటిచెప్పిందని" సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా యశోద గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ మెడికల్ సర్వీసెస్ డాక్టర్.ఎ. లింగయ్య మాట్లాడుతూ, "అత్యవసర పరిస్థితుల్లో ప్రతి సెకను ఎంతో విలువైనది. ఆ ప్రతి సెకనునూ సమర్థవంతంగా వినియోగించి రోగులకు వేగవంతమైన, ఖచ్చితమైన, ప్రాణరక్షక వైద్య సేవలు అందించడమే మా లక్ష్యం" అని తెలిపారు. 24/7 అత్యవసర హెల్ప్‌లైన్ 105910తో అనుసంధానమైన ఈ కమాండ్ సెంటర్‌ను అత్యంత వేగవంతమైన వైద్య స్పందన వ్యవస్థగా రూపొందించామని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో కేవలం కొన్ని సెకన్లలోనే స్పందించి, ఆసుపత్రి స్థాయి అత్యవసర వైద్య సేవలను రోగి వద్దకే మరియు అంబులెన్స్ ప్రయాణ సమయంలోనే అందించే విధంగా ఈ వ్యవస్థను అభివృద్ధి చేశామని తెలిపారు. అలాగే, ఈ కనెక్టెడ్ అంబులెన్సుల్లో అత్యాధునిక రియల్‌టైమ్ టెలీ-మానిటరింగ్, టెలీ-మెడిసిన్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వీటి ద్వారా యశోద హాస్పిటల్స్ వైద్య నిపుణులు రోగుల ఆరోగ్య పరిస్థితిని దూరం నుంచే పరిశీలిస్తూ, ప్రయాణ సమయంలో పారామెడికల్ సిబ్బందికి





తక్షణ సూచనలు అందించగలరని చెప్పారు. అంతేకాకుండా, క్యాథ్ ల్యాబ్స్, ఆపరేషన్ థియేటర్స్, స్ట్రోక్ టీమ్స్, ట్రామా టీమ్స్, ఐసీయూ బెడ్స్, అడ్వాన్స్డ్ ఇమేజింగ్ వంటి కీలక వైద్య సదుపాయాలను రోగి ఆసుపత్రికి చేరుకునే ముందుగానే సిద్ధం చేసే అవకాశం ఈ అత్యాధునిక వైద్య వ్యవస్థ ద్వారా కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలోని మరో ప్రధాన అంశమైన ఔటర్ రింగ్ రోడ్ (ORR) ట్రామా కారిడార్ల సమగ్ర పర్యవేక్షణ వ్యవస్థ గురించి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలు మరియు ఇతర అత్యవసర పరిస్థితుల్లో వేగవంతమైన సమన్వయం, తక్షణ ట్రామా స్పందన అందించడం ద్వారా రోగుల ప్రాణాలను రక్షించే అవకాశాలను మరింత మెరుగుపరచడమే ఈ వ్యవస్థ ప్రధాన లక్ష్యమని" డాక్టర్.ఎ. లింగయ్య తెలియజేసారు.†

## రెనోవా హాస్పిటల్స్ అధినేత శ్రీధర్ పెద్దిరెడ్డికి ప్రతిష్టాత్మక 'విజనరీ లీడర్‌షిప్ ఇన్ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్' అవార్డు ప్రదానం!

బంజారాహిల్స్, హైదరాబాద్, మే, 23: వైద్య రంగంలో విశేష ప్రతిభ కనబరుస్తూ, విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిన రెనోవా



హాస్పిటల్స్ ఫౌండర్ మరియు సీఈఓ శ్రీధర్ పెద్దిరెడ్డికి మరో అరుదైన గౌరవం దక్కింది. హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రాడిసన్ బ్లూ ప్లాజా హోటల్‌లో ఘనంగా నిర్వహించిన 'జీ తెలుగు న్యూస్ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2026' వేడుకలో ఆయనకు ప్రతిష్టాత్మక "విజనరీ లీడర్‌షిప్ ఇన్ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్" అవార్డును అందజేశారు. గౌరవనీయులైన తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా ముఖ్య అతిథిగా విచ్చేసి శ్రీధర్ పెద్దిరెడ్డికి ఈ పురస్కారాన్ని అందజేసి అభినందించారు. శ్రీధర్ పెద్దిరెడ్డి దూరదృష్టితో కూడిన నాయకత్వంలో 'రెనోవా హాస్పిటల్స్' వైద్య రంగంలో శరవేగంగా దూసుకుపోతోంది. ప్రస్తుతం ఈ నెట్‌వర్క్ 12 అధునాతన యూనిట్లు, 2,000 పడకల (Beds) సామర్థ్యంతో విస్తరించి, రోగులకు అత్యున్నత ప్రమాణాలతో కూడిన మల్టీస్పెషాలిటీ సేవలను అందిస్తోంది.

### అత్యాధునిక సాంకేతికత - క్యాన్సర్ చికిత్సలో నూతన అధ్యాయం

వైద్య రంగంలో సాంకేతిక విప్లవాన్ని అందిపుచ్చుకోవడంలో రెనోవా ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుంది. శ్రీధర్ పెద్దిరెడ్డి నేతృత్వంలో క్యాన్సర్ బాధితులకు అత్యంత ఖచ్చితమైన, రోగి-కేంద్రిత చికిత్సను అందించడానికి ప్రపంచ స్థాయి సాంకేతికతలను ప్రవేశపెట్టారు. వీటి ద్వారా ప్రిసిషన్ అంకాలజీ, అడ్వాన్స్‌డ్ డయాగ్నోస్టిక్స్, కార్డియాక్ సైన్సెస్, న్యూరో సైన్సెస్, ఆర్థోపెడిక్స్, నెఫ్రాలజీ, గైనకాలజీ మరియు పీడియాట్రిక్స్ (ఉమెన్ & చైల్డ్ కేర్) వంటి విభాగాలలో అంతర్జాతీయ స్థాయి సేవలను అందుబాటులోకి తెచ్చారు.

### సేవా పథంలో 'శ్రీ ధరణి ఫౌండేషన్' :

వైద్య సేవలతోనే ఆగకుండా, సామాజిక బాధ్యతలోనూ రెనోవా గ్రూప్ ముందుంది. శ్రీధర్ పెద్దిరెడ్డి స్థాపించిన 'శ్రీ ధరణి ఫౌండేషన్' ద్వారా గ్రామీణ విద్యాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, గ్రామీణ సంక్షేమ కార్యక్రమాలను నిరంతరం





నిర్వహిస్తూ సమాజ సేవలో తనదైన ముద్ర వేస్తున్నారు. ఈ సందర్భంగా రెనోవా హాస్పిటల్స్ ఫౌండర్ & సీఈఓ శ్రీధర్ పెద్దిరెడ్డి మాట్లాడుతూ... "ఈ పురస్కారం మా బాధ్యతను మరింత పెంచింది. గౌరవనీయులైన గవర్నర్ గారి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం గర్వంగా ఉంది. మేము కేవలం ఆసుపత్రులను నిర్మించడం లేదు; సమాజంలో ప్రతి ఒక్కరికీ ఆశాజనకమైన, నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండే ఒక సరికొత్త ఆరోగ్య వ్యవస్థను సృష్టిస్తున్నాము. సాంకేతికత, మానవీయ విలువలు, తక్కువ ఖర్చుతో కూడిన వైద్యమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు.

## బక్రీద్ సెలవు 28కి మార్పు

### ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం

హైదరాబాద్,మే24(సాక్ష్యం): తెలుగు రాష్ట్రాల్లో బక్రీద్(ఈద్ అల్-అధా) పండుగ తేదీ మారింది. దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఆలస్యం కావడంతో మే 28న బక్రీద్ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వాలు ఉత్తర్వులు జారీచేశాయి. దీంతో ఆ రోజున అన్ని ప్రభుత్వ కార్యాలయాలు సహా విద్యాసంస్థలు, బ్యాంకులకు సెలవు ఉండనుంది. అయితే.. చంద్రుని దర్శనం ఆధారంగా సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లలో మాత్రం ఈ నెల 27న(బుధవారం) ఈ పండుగను జరుపుకోనున్నారు.




తొలుత ప్రకటించిన దాని ప్రకారం.. మే 27న ఉండగా, దానిని మే 28 గురువారం నాటికి మారుస్తూ ఇరు తెలుగు రాష్ట్రాలు అధికారిక ఉత్తర్వులు జారీచేశాయి. వాస్తవానికి ముస్లింలు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే పవిత్రమైన పండుగ బక్రీద్.. ఇస్లామిక్ క్యాలెండర్‌లోని చివరి నెల అయిన దుల్-హిజ్జా 10వ రోజు వస్తుంది. ఆ ప్రకారం ముస్లిం పండుగలు చంద్రదర్శనంపై ఆధారపడి ఉంటాయి. అయితే.. ఈసారి దుల్ హిజ్జా నెలవంక దర్శనం ఒకరోజు ఆలస్యం కావడంతో పండుగ తేదీ మారినట్టు మతపెద్దలు ప్రకటించారు.

తెలంగాణ వక్ఫ్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, మైనారిటీ సంక్షేమ శాఖల నుంచి వచ్చిన విజ్ఞప్తులు, సిఫార్సులను పరిశీలించిన ప్రభుత్వం పండుగ సెలవును 28కి మార్చింది. మే 28న సాధారణ సెలవు దినంగా ప్రకటిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. మరోవైపు.. మే 28న సెలవు ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెండు రోజుల క్రితమే ఉత్తర్వులు జారీచేసింది.

## గుంటల మయమైన రోడ్డు మరమ్మతు చేయాలి

### ఆరు నెలల్లో పూర్తి చేయకపోతే ప్రత్యక్ష కార్యాచరణ: ఆరు కిలోమీటర్ల పాదయాత్రలో రంగన్న

మిర్యాలగూడ డివిజన్ మే 23 (సాక్ష్యం న్యూస్) నడవడానికి కూడా వీలు లేకుండా పూర్తిగా గుంటల మయమైన రోడ్డును తక్షణమే మరమ్మతు చేయాలని ఆరు నెలలో పూర్తి చేయకపోతే ప్రత్యక్ష కార్యాచరణ చేపడతామని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి హెచ్చరించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామ హైవే నుండి బోట్యా నాయక్ తండ వరకు గల రోడ్డు పూర్తిగా గుంటల మయం గా మారింది.ఆరు నెలల క్రితం రోడ్డుకు టెండర్ జరిగింది. మరమత్ పనులను వెంటనే చేపట్టాల్సిన సదర్ కాంట్రాక్టర్ చేపట్టకపోవడం వల్ల తండావాసులు ప్రయాణంలో నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై అనేకసార్లు అధికారులకు తెలిపిన అధికారులు సదర్ కాంట్రాక్టర్ను పనులు పురమాయించక జాప్యం చేయడం జరిగింది. గ్రామం నుండి ప్రతినిత్యం కూరగాయలు ఆకుకూరలు పాలు పాఠశాలకు వెళ్లే విద్యార్థులు ఆటోలో ప్రయాణం చేస్తుంటారు. గుంతల కారణంగా నిరంతరం ప్రమాదాలు జరుగుతున్నాయి. రోజువారీగా ఇబ్బందులను భరించలేక ప్రజలు సిపిఎం ఆధ్వర్యంలో



తండా నుండి మిర్యాలగూడ పట్టణానికి ఆరు కిలోమీటర్లు పాదయాత్ర చేసి ఆర్డీవోకు వి న తిపత్రాన్ని సమర్పించారు. పాదయాత్రను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రంగారెడ్డి ప్రారంభించి గ్రామస్తులతో పాటు ఆయన కూడా ఆరు కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. పాదయాత్ర బో టీయా తండా నుండి ప్రారంభమై గూడూరు గ్రామం ద్వారా హౌసింగ్ బోర్డ్ కాలనీ నుండి ఆర్డీవో కార్యాలయం చేరుకున్నది. ఆర్డీవోకు వినిత పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారెడ్డి మాట్లాడుతూ తండావాసులు నిత్యం వారి అవసరాల కొరకు పట్టణానికి వస్తుంటారని రోడ్డు పూర్తిగా గుంతల మయమైనందువల్ల రాకపోకలకు గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని వారు వాపోయారు. రోడ్డు నిర్మాణం కొరకు టెండర్లు ఖరారు అయినప్పటికీ సదరు కాంట్రాక్టర్ పనులు ప్రారంభించకపోవడం బాధాకర మ న్నారు. అత్యంత ప్రాధాన్యత కలిగిన రోడ్డును మరమ్మత్తు చేయకపోవడం విశారకరమని అన్నా రు. మరమ్మత్ పనులు వచ్చే నెల 10వ తేదీ వరకు పూర్తి చేయకపోతే ఆర్డీవో కార్యాలయం ముందు నిరవధిక సమ్మెకు పూనుకుంటామని వారు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లేష్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వెంకటేశ్వర్లు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు రాగిరెడ్డి మంగారెడ్డి రవి నాయక్ పరుశురాములు వినోద్ నాయక్ పట్టణ కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి టాప్రా నాయకులునూకల జగదీష్ చంద్ర గ్రామ సర్పంచ్ సాగర్ నాయక్ ఉపసర్పంచ్ శ్రీను గూడూరు గ్రామ సర్పంచ్ కృష్ణయ్య సిపిఎం నాయకులు దయానంద్ పిల్లుట్ల సైదులు బొంగరాల వెంకటయ్య మేక రాంబాబు మహిళా సంఘం నాయకురాలు మంగా కరీమున్నీసా బేగం తదితరులు పాల్గొన్నారు.

# సర్వేయర్ల మహాధర్నా విజయవంతం చేయాలి

**– యూనియన్ రాష్ట్ర ఉప అధ్యక్షుడు, మంచిరియల్ జిల్లా అధ్యక్షుడు ములుకల్ల సందీప్ రెడ్డి**



**మంచిర్యాల జిల్లా ప్రతినిధి (సాక్ష్యం) మే 23 :** తెలంగాణ లైసెన్స్ సర్వేయర్ల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న హైదరాబాద్లోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని లైసెన్స్ సర్వేయర్ల యూనియన్ మంచిరియల్ అధ్యక్షుడు ములుకల్ల సందీప్ రెడ్డి పిలుపునిచ్చారు. చెన్నూర్ మండలం కమ్మరిపల్లి చెందిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా లైసెన్స్ సర్వేయర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్లేందుకు ఈధర్నా చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని లైసెన్స్ సర్వేయర్లు అందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహించే ఈ ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. లైసెన్స్ సర్వేయర్ల హక్కులు, ఉద్యోగ భద్రత, పెండింగ్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం ఉంటుంది అని ఆయన వివరించారు.

# సీనియర్ నాయకుడి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి



**ఉప్పల్, మే 23 (సాక్ష్యం):** కొద్ది రోజుల క్రితం ఆకస్మికంగా మృతి చెందిన నాచారం డివిజన్ సీనియర్ నాయకుడు జాకీర్ హుస్సేన్ కుటుంబ సభ్యులను ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పరామర్శించారు. వారి నివాసానికి వెళ్లిన ఎమ్మెల్యే కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాకీర్ హుస్సేన్ పార్టీ అభివృద్ధికి, ప్రజా సేవకు విశేష కృషి చేశారని అన్నారు. ఆయన అందించిన సేవలను పార్టీ ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు అన్ని వేళలా అండగా ఉంటూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. జాకీర్ హుస్సేన్ ఆకస్మిక మరణం తీవ్ర విషాదకరమని పేర్కొన్న ఆయన, వారి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు ఈ బాధను తట్టుకునే ధైర్యం, మనోబలం ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో జాకీర్ హుస్సేన్ కుమారుడు సల్మాన్, కుటుంబ సభ్యులు, కాజా మొయినుద్దీన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు సాయిజెన్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ విజేతలకు డీజీపీ అభినందనలు




**సికింద్రాబాద్, మే 23 (సాక్ష్యం):** ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలో ఈ నెల 9 నుంచి 13 వరకు నిర్వహించిన రెండో అఖిల భారత పోలీస్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్ 2025--26లో తెలంగాణ పోలీస్ క్రీడాకారులు ప్రతిభ కనబరిచి రాష్ట్రానికి కీర్తిప్రతిష్టలు తీసుకొచ్చారు. జాతీయ స్థాయి పోటీల్లో తెలంగాణ పోలీస్ క్రీడాకారులు తమ నైపుణ్యం, పట్టుదల, క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ ఒక స్వర్ణ పతకం, నాలుగు రజత పతకాలు, ఏడు కాంస్య పతకాలతో మొత్తం 12 పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ నేపథ్యంలో విజేతలుగా నిలిచిన క్రీడా బృందం శుక్రవారం రాష్ట్ర డీజీపీ సి.వి. ఆనంద్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా డీజీపీ విజేతలను ప్రత్యేకంగా అభినందించి శాలువాలతో ఘనంగా సత్కరించారు. అలాగే మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో నిర్వహించిన ఇండియా ఓపెన్ షూటింగ్ పోటీల్లో మాస్టర్స్ విభాగం రైఫిల్, పిస్టల్ విభాగంలో కాంస్య పతకం సాధించిన ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ఇన్‌స్పెక్టర్ బి. జేమ్స్ బాబు కూడా ఈ సమావేశంలో డీజీపీని కలిశారు. ఈ కార్యక్రమంలో ఐజీపీ (క్రీడలు) డాక్టర్ గజరావు భూపాల్, క్లస్టర్ బృందం మేనేజర్, డీసీపీ జి. నరసింహారెడ్డి, తెలంగాణ పోలీస్ క్రీడల అధికారి, డీఎస్పీ డాక్టర్ ఆర్.వి. రామారావు, 13వ బెటాలియన్ టీజీఎస్పీ ఆర్ఎస్ఐ, టేబుల్ టెన్నిస్ శిక్షకుడు ఎ. అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# బస్సులు ఆపాలంటూ వినతి

**నారాయణఖేడ్, మే 23:( సాక్ష్యం న్యూస్ )** నారాయణఖేడ్ పట్టణ శివారులో గల వెంకటాపూర్ చౌరస్తా వద్ద ఆర్టీసీ బస్సులను ఆపాలంటూ శ్రీనివాస్,పుండరీకం, సునీల్ లు ఎస్టీఐ నందులాల్ కు శనివారం కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. మాద్వార్, లింగాపూర్, హన్మంతారావుపేట్, వెంకటాపూర్, వెంకటాపూర్ తాండా మరియు కిషన్ నాయక్ తాండాలా ప్రజలు నిజాంపేట్, హైదరాబాద్, నిజామాబాద్, బోధన్, సంగారెడ్డి లాంటి ప్రాంతాలకు వెళ్లాలంటే వెంకటాపూర్ చౌరస్తా నుండే వెళ్ళాలి. ప్రజలు తమ గ్రామాల నుండి చౌరస్తాకు వచ్చి బస్సులు ఎక్కాలి, దిగాలి అంటే రెండు కిలోమీటర్ల దూరంలో గల ఖేడ్ కు వెళ్ళాలి, చాలామంది బస్సు డ్రైవర్లు వెంకటాపూర్ చౌరస్తా వద్ద బస్సులు నిలపకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కాబట్టి వెంకటాపూర్ చౌరస్తా వద్ద బస్సులు నిలపాలంటూ వినతిపత్రం అందజేసినట్లు వారు తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఎస్టీఐ ప్రతీ డ్రైవర్ కు సమాచారం ఇచ్చి బస్సులు నిలిపేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.



# దుర్గమ్మ పండుగ ఉత్సవాలకు 10, వేల విరాళం



**రాయపర్తి మే 23(సాక్ష్యం న్యూస్ ):** రాయపర్తి మండలంలోని జెతురం తండా గ్రామంలో నిర్వహించ నున్న దుర్గమ్మ పండుగ ఉత్సవాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ నుంచి 10వేల రూపాయలు విరాళం అందచేసినట్లు ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈ సహాయంను ఆలయంలో విగ్రహం ఏర్పాటు చేయటానికి స్థానిక నాయకులు, గ్రామ పెద్దల విన్నపం మేరకు విరాళం అందజేసినట్లు వారు తెలిపారు. విరాళాన్ని ఆలయ కమిటికి అందించిన బీఆర్ఎస్ మండల పార్టీ నాయకులు ఎండీ యూసఫ్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు నేతవత్ మన్సూర్, పార్టీ ముఖ్య నాయకులు నేతవత్ శ్రీధర్, గుగులోత్ బొజ్జ, వార్డ్ నెంబర్ లు గుగులోత్ భద్రి, నేతవత్ రమేష్, పార్టీ ముఖ్య నాయకులు మోతిలాల్, శ్రీనివాస్, రాజు, యకూబ్, శ్రీను, బాలరాజు, వీరన్న, యకూబ్, గుడి పూజారి సుఖ్య, తదితరులు పాల్గొన్నారు....

# కాకినాడ నుండే బీసీ ద్రోహుల పతనం మొదలు..?

- ‘ఓట్ల కోసం బీసీ పాదపూజ..పదవుల కోసం బీసీల పై కత్తి..!
- ఎన్డీఏ కూటమి చదరంగంలో రాజు ఎవరు..? బలయ్యేది ఎవరు..?
- “ కుడా “ కుట్ర తో మొదలైన పతన గాథ..?



**మార్కాపురం జిల్లా బ్యూరో : సాక్ష్యం**

శనివారం నాడు తెలుగు జనతా పార్టీ ఆధ్వర్యంలో వ్యవస్థాపకులు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు కాకినాడలో గల పార్టీ కార్యాలయం ఆవరణలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఈరోజు నేను మీడియా ముందుకు వచ్చింది వార్త చెప్పడానికి కాదు..బీసీల గుండెకోతను చెప్పడానికి..!బీసీ ద్రోహుల ముసుగు తీయడానికి అంటూ ఆయన బాగోద్వేగానికి లోనయ్యారు.ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రతిసారి ఎన్నికల్లో ‘ బీసీలే నా బలం,బీసీలే నా బలగం ‘ అని ఊదరగొట్టిన పవన్ కళ్యాణ్ ఈరోజు అదే బీసీలను కాలితో తన్నుతున్నారు..!’కుడా’ చైర్మన్ అనే ఒక్క కుర్చీని కూడా బీసీలకు ఇవ్వడానికి ఆయనకు మనసు రాలేదు.ఇది బీసీ జాతికీ జరిగిన అవమానం కాదా..? ద్రోహం కాదా..? అంటూ ఆయన లోని బీసీ నేతలందరినీ సూటిగా ప్రశ్నించారు..? చరిత్రలో బీసీలకు జరిగిన ద్రోహాల చిట్టా చాలా పెద్దది.రాజులు మారారు,జెండాలు మారాయి,కానీ బీసీల తలరాత మాత్రం మారలేదు.” అధికారంలో వాటా “ అనే మాట ఎన్నికలప్పుడు ఊదరగొట్టే శంఖం..తీరా గెలిచాక అదే శంఖాన్ని బీసీల నెత్తిన మోదే మొట్టికాయగా మార్చడం ఎన్డీఏ కూటమి సర్కార్‌కు కొత్తేమీ కాదు.దానికి తాజా సాక్ష్యం

**కాకినాడ కుడా చైర్మన్ ఎపిసోడ్ :-**

ఇంద్రపాలెం స్టేజ్ మీద కన్నీటి డ్రామాలో ఎన్నికల ముందు ఇంద్రపాలెం సభ.మైకు పట్టుకున్న జనసేనాని.” వైసీపీ ప్రభుత్వం ఒక్క రెడ్డి సామాజిక వర్గానికే పదవులు ఇస్తోంది. బీసీ,ఎస్సీలను అణగదొక్కుతోంది.మేము వస్తే సామాజిక న్యాయం చేస్తాం “ అని గళం విప్పారు.ఆ మాటలకు బీసీ,ఎస్సీ ప్రజలు చప్పట్లు కొట్టారు,ఓట్లు గుద్దారు.పిఠాపురంలో పవన్ గెలిచారు.కూటమి అధికారంలోకి వచ్చింది.

**అధికారం చేతికొచ్చాక అసలు రంగు..!**

తీరా పదవుల పంపకం వచ్చేసరికి సీన్ రివర్స్.పిఠాపురం,కాకినాడ టౌన్,రూరల్ నియోజకవర్గాల్లో కీలకమైన చైర్మన్,డైరెక్టర్, నామినేటెడ్ పోస్టులు ఎవరికి దక్కాయి..? ఇంద్రపాలెం సభలో “ అన్యాయం “ అని ఏ సామాజిక వర్గాన్ని అన్నారో..?అదే సామాజిక వర్గం,అదే తరహా పంపకం.లిస్టులో బీసీ పేరు లేదు,ఎస్సీ పేరు లేదు..’ కుడా ‘ చైర్మన్ అనే ఒక్క జిల్లా స్థాయి పీఠాన్ని కూడా బీసీలకు ఇవ్వడానికి కూటమి పెద్దలకు మనసొప్పలేదు.

**ఇది పొరపాటు కాదు..పక్కా ప్లాన్డ్ గారడీ..!**

ఇది ఒక్క కాకినాడ సమస్య కాదు.ఇది రాష్ట్ర వ్యాప్తంగా బీసీల పై జరుగుతున్న “ రాజకీయ శస్త్ర చికిత్స “.కేంద్రంలో బీజేపీ కులగణన అంటే కుంటిసాకులు చెబుతుంది.ఎందుకు..? బీసీల లెక్క బయటకు వస్తే వాటా అడగాల్సి వస్తుందని.రాష్ట్రంలో కూటమి సర్కార్ పదవులు ఇవ్వకుండా బీసీల నోరు మూయిస్తోంది.ఎందుకు..? అధికారం మా గుప్పిట్లోనే ఉండాలని,ఢిల్లీ నుంచి గల్లీ దాకా స్క్రిప్ట్ ఒక్కటే..బీసీలను ఓటు బ్యాంకుగా వాడుకో..పదవి **మాత్రం ఇవ్వకు..!**

**బలి పశువులు ఎప్పుడూ బీసీలేనా..?**

**కొవ్వూరు వారాహి గుడి ఎపిసోడ్ :**

శెట్టిబలిజ ఆడబిడ్డ కట్టుకున్న గుడిని కూల్చేశారు.అధికార పార్టీ నేతల కళు ఎర్రబడ్డాయి.ఒక బీసీ మహిళ దేవుడికి గుడి కట్టడం కూడా వీళ్లకు నచ్చలేదు.

**కిర్లంపూడి 104 కోట్ల దోపిడీ :**

సొసైటీలో దోచుకున్నది ఎవరి సొమ్ము..? పొలం అమ్మి,పుస్తెలు అమ్మి షేర్లు కొన్న బీసీ రైతుల సొమ్ము.ఎఫ్ఐఆర్ కేసు నెంబర్ 13/2025 పెట్టారు సరే..అసలు దొంగలు దొరుకుతారా..? ఆ సొమ్ము బీసీ రైతుకు తిరిగి వస్తుందా..?

**తదుపరి ఎపిసోడ్‌లో :**

కులగణన డ్రామా వెనుక కుట్ర కోణం ఏంటి..? బీసీ రిజర్వేషన్లకు కేంద్రం పెడుతున్న అడ్డంకులు..రాష్ట్రంలో కాపు కార్పొరేషన్ నిధులు ఎటు మళ్లుతున్నాయి..? పచ్చి నిజాలతో ఎపిసోడ్ –2 త్వరలోనే..!

**తెలుగు జనతా పార్టీ వ్యవస్థాపకులు పెద్దింశెట్టి వార్నింగ్ :**

“ ఓట్లప్పుడు కాళు మొక్కుతారు.. పదవులప్పుడు గొంతు కోస్తారు.ఈ ద్రోహం ఇక చెల్లదు.మీ చదరంగంలో బీసీలు ఇక పావులు కాదు.రాజును కదిపే ఏనుగులం.మీ పతనం బీసీల చేతుల మీదుగానే మొదలవుతుంది. ఇది ఆవేశం కాదు.. హెచ్చరిక “ అంటూ ఆయన తన ఆవేదనను వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి తెలుగు జనతా పార్టీ ముఖ్య నేతలు,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**ఎపిసోడ్–2 లో ‘ కులగణన కుట్ర ‘ మీద ఇంకా ఘాటుగా వీక్షకుల ముందుకు “ సాక్ష్యం “ దినపత్రికలో త్వరలో..**

# గుంపు మేస్త్రీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలు ఆగమాగం

**– తెలంగాణ రక్షణ సేన ( టీఆర్ఎస్ ) చీఫ్ కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్, మే 23, ( సాక్ష్యం న్యూస్ ) :** గుంపు మేస్త్రీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలు ఆగమావుతున్నాయని, అందుకే గుంపు మేస్త్రీ హఠావో....తెలంగాణ బచావో అంటున్నానని తెలంగాణ రక్షణ సేన ( టీఆర్ఎస్ ) చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం కూడా ధర్నా జరిగింది. హైదరాబాద్ ఇందిరాపార్క్ ధర్నాచౌక్ వద్ద జరిగిన ఈ ధర్నాకు మద్దతు తెలిపిన కవిత కార్మికులనుద్దేశించి మాట్లాడారు. రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించకుంటే సెంట్రింగ్ కార్మికులతో పాటు నేను ధర్నాలో కూర్చుంటానని ఆమె స్పష్టం చేశారు. సెంట్రింగ్ కార్మికుల డిమాండ్లను పట్టించుకోకపోతే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో కర్రుకాల్చి వాత పెట్టటం ఖాయమని కవిత అన్నారు. హైదరాబాద్‌లో అద్దాల మేడలు కనిపిస్తున్నాయంటే దానిలో సెంట్రింగ్ కార్మికుల కృషి ఎంతో ఉందన్నారు. సెంట్రింగ్ కార్మికులు అడుగుతున్న వాటిలో గొంతెమ్మ కోరికలు ఏమీ లేవని, 12 అంశాలతో చాలా చిన్న విషయాలే అడుగుతున్నారని, వారికి ఈఎస్ఐ కార్డులు, స్క్వేర్ మీటర్‌కు 51 రూపాయలు, కార్మికులు చనిపోతే ఇచ్చే డబ్బులు పది నుంచి 20 లక్షలు అడుగుతున్నారని కవిత పేర్కొన్నారు. ఇప్పుడు మేస్త్రీలు స్క్వేర్ ఫీట్‌కు 4 వందలు అడుగుతున్నారని చెబుతున్నారని..దానిలో సెంట్రింగ్ కార్మికుల వాటా ఎంతో కూడా చెప్పాలి ? అని డిమాండ్ చేశారు. తాళు కట్టుకొని ప్రాణాలు పణంగా పెట్టి గాలిలో వేలాడుతూ మీరు పనిచేస్తున్నారని, సెంట్రింగ్ కార్మికులు లేకుంటే అద్దాల మేడాలు ఉండవు కానీ బిల్డింగ్ లు నిర్మించే అగ్రిమెంట్‌లో మాత్రం మీ పేరు పెట్టటం లేదన్నారు. 2 లక్షల రూపాయల పని కోసం మీరు వెళ్తున్నప్పటికీ మీతో పాటు 15 లక్షల రూపాయల మెటీరియల్ తీసుకెళ్తున్నారని, కానీ మీ మెటీరియల్‌కు కనీసం రక్షణ లేని పరిస్థితి ఉందన్నారు. హైడ్రా వచ్చిన తర్వాత నోటీసులు లేకుండా ఇళ్లు కూలగొడుతున్నారని, దీంతో సెంట్రింగ్ పనిచేస్తున్న మీకు ఆ ఇళ్లు కూల్చే సమయంలో మీ మెటీరియల్ నష్టపోతున్నారని కవిత తెలిపారు. దీనికి ఇంటి యాజమాని గానీ... ప్రభుత్వం గానీ మీకు పరిహారం ఇవ్వటం లేదన్నారు. 86 చోట్ల సెంట్రింగ్ కార్మికులు, కాంట్రాక్టర్లు పది రోజులుగా పని బంద్ చేశారని, కానీ మీ దగ్గర ఉన్న కూలీలను మీరు సాధుతున్నారన్నారు. మేస్త్రీల చేతిలో ఎట్టి పరిస్థితుల్లో మీ జుట్టు ఉండకూడదని, తెలంగాణ రక్షణసేన అధికారంలో వచ్చిన తర్వాత మీ అన్నిడిమాండ్లను తీరుస్తామని హామీనిచ్చారు. ప్రతి మండలంలో సెంట్రింగ్ కార్మికుల సంఘాలు ఏర్పాటు కావాల్సి ఉందని, 186 చోట్ల వెయ్యి నుంచి 2 వేల గజాల స్థలం మీకు ఇస్తామని కవిత హామీనిచ్చారు. ఎన్ని రోజులైనా సరే మీ సమస్య తీరే వరకు ప్రభుత్వం ఒత్తిడి పెంచుతానని కవిత హెచ్చరించారు. ఈ ధర్నాలో అసోసియేషన్ నాయకులు కృష్ణ, పరుశురాం, చాంద్ పాషా, విష్ణువర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన మేడ్చల్

# మల్కాజిగిరి జిల్లా రెండవ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు

**ఉప్పల్, మే 23 (సాక్ష్యం):** మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రెండవ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు నాచారంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరగనున్న ఈ క్రీడా వేడుకకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు, శిక్షకులు, తల్లిదండ్రులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం ఉపాధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతలో క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడం సమాజ అభివృద్ధికి ఎంతో అవసరమని అన్నారు. ముఖ్యంగా బ్యాడ్మింటన్ వంటి క్రీడలు విద్యార్థుల్లో క్రమశిక్షణ, శారీరక దృఢత్వం, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తూ క్రీడాకారులకు అన్ని విధాలుగా ప్రోత్సాహం అందిస్తోందన్నారు. రాష్ట్ర బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్షుడు మంత్రి శ్రీధర్ బాబు, ప్రధాన కార్యదర్శి పుల్లెల గోపీచంద్ సహకారంతో గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులను గుర్తించి రాష్ట్ర, జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో సంఘం కృషి చేస్తోందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ మంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులు ఉన్నారని, వారికి తగిన అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలకు విశేష స్పందన లభించిందని నిర్వాహకులు తెలిపారు. మొత్తం 540 దరఖాస్తులు నమోదు కాగా, 453 మంది క్రీడాకారులు 28 విభాగాల్లో పోటీపడుతున్నారు. 11 సంవత్సరాల లోపు, 13 సంవత్సరాల లోపు, 15 సంవత్సరాల లోపు, 17 సంవత్సరాల లోపు, 19 సంవత్సరాల లోపు బాలురు, బాలికల విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో వికాస్ హర్ష, నాగరాజు, ఎస్‌కే రేష్మా, సోహైల్ తదితరులు పాల్గొన్నారు.








# హెల్మెట్ లేకుంటే స్టేషన్‌లోకి పోలీసుల నో ఎంట్రీ



టూ టౌన్ పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీల్లో ఎస్పీ జానకి కఠిన ఆదేశాలు

**మహబూబ్‌నగర్, మే 23 ( సాక్ష్యం బ్యూరో )** మహబూబ్‌నగర్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో జిల్లా ఎస్పీ దరావత్ జానకి వార్షిక తనిఖీలు నిర్వహించి పోలీసు సిబ్బందికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలపై వచ్చే పోలీస్ సిబ్బందిని ఇకపై పోలీస్ స్టేషన్‌లోకి అనుమతించవద్దని స్పష్టం చేశారు. తనిఖీల సందర్భంగా స్టేషన్‌లో నిర్వహిస్తున్న ఎఫ్ఐఆర్ నమోదు విధానం, స్టేషన్ డైరీలు, పెండింగ్ కేసులు, రౌడీ షీట్స్, సస్పెక్ట్ షీట్స్, బీట్ బుక్స్, సీజ్ ప్రాపర్టీ రికార్డులు, వారెంట్ల అమలు, సీసీటీఎన్ఎస్ నమోదు విధానం తదితర అంశాలను ఎస్పీ సమగ్రంగా పరిశీలించారు. ప్రతి కేసును సమయానుకూలంగా ఆన్లైన్‌లో నమోదు చేసి ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది క్రమశిక్షణ, ప్రజలతో వ్యవహరించే తీరు వంటి అంశాలపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన సహాయం అందించాలని సిబ్బందికి సూచించారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును కూడా ఎస్పీ పరిశీలించారు. సీసీ కెమెరాలను ప్రతిరోజూ పర్యవేక్షిస్తూ అవి సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా నిరంతరం తనిఖీ చేయాలని ఆదేశించారు. నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తుల కదలికల పర్యవేక్షణ, ట్రాఫిక్ నియంత్రణ, రాత్రి భద్రతా చర్యల్లో సీసీ కెమెరాలను సమర్థవంతంగా వినియోగించాలని తెలిపారు. అలాగే పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచిస్తూ, హెల్మెట్ ధరించడం వల్ల రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాపాయం తగ్గుతుందని చెప్పారు. పోలీసులే ప్రజలకు ఆదర్శంగా ఉండాలని పేర్కొన్నారు. బక్రీద్ పండుగ నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని, ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా కొనసాగించాలని ఆదేశించారు. అదేవిధంగా సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, మహిళలు మరియు బాలికల భద్రతకు సంబంధించిన ఫిర్యాదులను అత్యంత ప్రాధాన్యతతో స్వీకరించి వెంటనే స్పందించాలని సూచించారు. అనంతరం స్టేషన్ సిబ్బందితో ప్రత్యేకంగా సమావేశమైన ఎస్పీ వారి వ్యక్తిగత సమస్యలు, విధుల్లో ఎదురయ్యే ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి శనివారం తన కార్యాలయానికి వచ్చి నేరుగా కలవవచ్చని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో టూ టౌన్ ఇన్స్పెక్టర్ యేజాజ్ ఉద్దీన్, సబ్ ఇన్స్పెక్టర్లు విజయభాస్కర్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# వడ దెబ్బ తాకి వ్యక్తి మృతి

**చౌటుప్పల్ మే 23(సాక్ష్యం న్యూస్):** చౌటుప్పల్ మండలం మందోళ్ళ గూడెం గ్రామానికి చెందిన దేవరకొండ శంకరయ్య చారి(62) అనే వ్యక్తి వడదెబ్బకు గురై శనివారం మృతి చెందిన సంఘటన గ్రామంలో చోటుచేసుకుంది. ఎండలు తీవ్రంగా ఉండడంతో వడగాలులు ఎండల తీవ్రతకు తీవ్రమైన అస్వస్థతకు శంకరయ్య చారి గురయ్యారు. గత వారం రోజులుగా ఎండలు తీవ్రంగా ఉండటం తో వడదెబ్బ తగిలి ఆయన ఒక్కసారిగా అస్వస్థతకు గురై సోమ్మసిల్లి పడిపోయారు. దీంతో అక్కడున్నవారు గమనించి ఆయనను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడు శంకరయ్య చారి కి ఒక కూతురు ఇద్దరు కుమారులు ఉన్నారు. వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు...



## రాజీవ్ స్మారక ఫౌండేషన్
# ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేత

**చౌటుప్పల్ మే 23 (సాక్ష్యం)** చౌటుప్పల్ మున్సిపాలిటీ తంగడిపల్లిలోని ఊదరి కృష్ణయ్య మరణించడంతో రాజీవ్ స్మారక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ట్రస్ట్ చైర్మన్ రావుల మాధవరెడ్డి సహకారంతో కృష్ణయ్య కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ట్రస్ట్ కోశాధికారి ఖయ్యూం, కార్యదర్శి నల్ల నరసింహ, కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల లింగస్వామి, బొజ్జ బుచ్చయ్య, ఉదరి సురేష్, వెంకటేశ్వర్లు, లింగస్వామి, ఉదరి రామచంద్రశీ, దాసరి చంద్రయ్య, సిలివేరు చంద్రకాంత్, మహమ్మద్ సోహెల్, ఉదరి నవీన్, తదితరులు పాల్గొన్నారు.



## ఉప సర్పంచుల ఫోరం జిల్లా
# గౌరవ అధ్యక్షునిగా భూక్య శ్రీనివాస్ నాయక్

**వర్ధన్నపేట , మే 23 (సాక్ష్యం):** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం ఏవి తండాకు చెందిన ఉప సర్పంచ్ భూక్య శ్రీనివాస్ నాయక్‌ను జిల్లా ఉప సర్పంచుల ఫోరం గౌరవ అధ్యక్షునిగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం ఉపాధ్యక్షులు బోట్ల కార్తీక్ తెలిపారు. రాష్ట్ర ఉప సర్పంచుల ఫోరం అధ్యక్షులు లావుడ్యా రాములు నాయక్ ఆదేశాల మేరకు ఈ నియామకాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన భూక్య శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఉప సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముందుండి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ గ్రామాల ఉప సర్పంచులు పాల్గొన్నారు.



# సాటాపూర్ పశువుల అంగడిని ఆకస్మికంగా తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్

**ఆర్మూర్ సాక్ష్యం న్యూస్ మే 23:** బక్రీద్ పండుగ నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా, శాంతి భద్రతలు పరిరక్షించేందుకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా శనివారం నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, సాతాపూర్ పశువుల సంత ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సంతను సందర్శించి పశువుల క్రయ విక్రయాలను, పరిశీలించి సాతాపూర్ గ్రామ పంచాయతీ సిబ్బంది నీ అడిగి తెలుసుకున్నారు. అదేవిదంగాబ్ నగర పరిధిలో ఏర్పాటు చేసిన వెటర్నరీ డాక్టర్ల చెకింగ్ పాయింట్‌ను కూడా ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెటర్నరీ అధికారులు ఇస్తున్న సర్టిఫికేట్ ల గురించి అడిగితెలుసుకున్నారు. పశువుల వాహనాలు తనకి చేసి వాహనాలలో తరలిస్తున్న వాటిని కూడా చెక్ చేసినారు. ఈ సందర్భంగా పోలీస్ కమీషనర్ మాట్లాడుతూ, పశువుల రవాణా, విక్రయాలు బలి కోసం తీసుకువస్తున్న జంతువులకు సంబంధించిన ఆరోగ్య ప్రమాణాలు సక్రమంగా పాటిస్తున్నారా, అనే అంశాలపై కమిషనర్ సమగ్రంగా పరిశీలించారు. వెటర్నరీ అధికారులు ప్రతి



జంతువుకు వైద్య పరీక్షలు నిర్వహించి , ఆరోగ్య ధృవపత్రాలు అందించాల లని ఆయన సూచించారు. అలాగే అక్రమ రవాణా , అనారోగ్య పశువుల విక్రయాలు , నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న కార్యకలాపాలపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చెకింగ్ పాయింట్ల వద్ద పోలీసులు, వెటర్నరీ సిబ్బంది పరస్పర సమన్వయంతో పనిచేసి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలుచోటుచేసుకోకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. పండుగ సందర్భంగా ప్రజలు శాంతియుత



వాతావరణంలో వేడుకలు జరుపుకునేలా పోలీస్ శాఖ అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని కమిషనర్ పేర్కొన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తో పాటు బోధన్ ఏసీపి శ్రీ శ్రీనివాస్ , రెంజల్ ఎస్ఐ శ్రీ చంద్ర మోహన్ , జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రోహిత్ రెడ్డి , మండల వెటర్నరీ డాక్టర్ శ్రీ విట్టల్ డా ప్రమోద్ ఏడ్పల్లి, డా నరేందర్ నవీపేట్ డా సురేష్ తదితరులు పాల్గొనడం జరిగింది.

# రైతు మృతి వార్తల్లో వాస్తవాలు వక్రీకరణ

- అవాస్తవ ప్రచారాలను నమ్మొద్దు
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ జిల్లా, కొల్చారం, మే 23 (సాక్ష్యం న్యూస్):-** మెదక్ జిల్లా కొల్చారం మండలం చిన్న గణపూర్ గ్రామానికి చెందిన రైతు వెంకటాపురం శంకరయ్య మృతి ఘటనపై కొన్ని దినపత్రికలు ప్రచురించిన వార్తల్లో నిజం లేదని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ స్పష్టం చేశారు. శనివారం విడుదల చేసిన అధికారిక ప్రకటనలో, రైతు మృతిని ధాన్యం కొనుగోలు సమస్యలకు అన్వయిస్తూ వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని తెలిపారు. కొల్చారం మండల తహసీల్దార్ (ఎంఆర్వో) సమర్పించిన నివేదిక ప్రకారం, సంబంధిత రైతు గుండెపోటుతోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సీరియల్ విధానం ప్రకారమే ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగుతోందని స్పష్టం చేశారు. అయితే కొన్ని పత్రికలు ధాన్యం కొనుగోలు ఆలస్యం, సమస్యల కారణంగానే రైతు ప్రాణాలు కోల్పోయినట్లు ప్రచారం చేయడం బాధాకరమని, ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉన్న ఇలాంటి వార్తలను ఖండిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. రైతు మృతిని ధాన్యం కొనుగోళ్లతో ముడిపెట్టడం పూర్తిగా నిరాధారమని పేర్కొన్నారు. జిల్లాలో ప్రభుత్వం నిర్ణయించిన మార్గదర్శకాల ప్రకారం ధాన్యం కొనుగోళ్లు నిరంతరాయంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఇప్పటివరకు మెదక్ జిల్లాలో సుమారు 2 లక్షల 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయగా, 30,210 మంది రైతుల ఖాతాల్లో రూ.336.65 కోట్లను నేరుగా జమ చేసినట్లు వెల్లడించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలపై అధికారులు నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రైతులు ఎటువంటి అపోహలకు గురికాకుండా అధికార యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి
# ఉల్లంఘిస్తే కఠిన చర్యలు: జిల్లా ఎస్పీ జానకి

- మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రత్యేక వాహన తనిఖీలు..
- 14 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు



**మహబూబ్‌నగర్, మే 23 ( సాక్ష్యం బ్యూరో )** ప్రజల ప్రాణ భద్రత కోసం ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ దరావత్ జానకి సూచించారు. జిల్లా వ్యాప్తంగా ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ లక్ష్యంగా శుక్రవారం రాత్రి ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని 16 పోలీస్ స్టేషన్ల పరిధిలో ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రాంతాలు, చెక్‌పోస్టుల వద్ద పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఇన్స్పెక్టర్ అప్పయ్య మరియు సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆకస్మికంగా తనిఖీ చేసి విధుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలను మరింత సమర్థవంతంగా చేపడుతూ ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్పీ పేర్కొన్నారు. ద్విచక్ర వాహనదారులు నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, కార్ డ్రైవర్లు మరియు ప్రయాణికులు సీట్ బెల్ట్ వినియోగించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్ల అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, కొన్ని నిమిషాల నిర్లక్ష్యం ప్రాణ నష్టానికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ట్రిపుల్ రైడింగ్, రాష్ డ్రైవింగ్, సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపడం వంటి ప్రమాదకర చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ముఖ్యంగా యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రత్యేక తనిఖీలలో మొత్తం 552 ద్విచక్ర వాహనాలు, 378 కార్లు మరియు ఆటోలను తనిఖీ చేసినట్లు పోలీసులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన 13 వాహనాలను సీజ్ చేయగా, 64 ఈ-చలాన్లు జారీ చేశారు. అదనంగా 12 ఈ-పెట్టి కేసులు, 14 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ ట్రాఫిక్ నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేయాలని పోలీసు అధికారులకు ఎస్పీ సూచించారు. ప్రమాద రహిత మహబూబ్‌నగర్ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు.

## యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి
# అవకాశాలు కల్పిస్తున్న ప్రభుత్వం: యెన్నం శ్రీనివాస్ రెడ్డి





“భారత్ ఫ్యూచర్ సిటీ”తో లక్షలాది ఉద్యోగాలు
- యువత భవిష్యత్తుకు ప్రభుత్వం ప్రాధాన్యం

**మహబూబ్‌నగర్, మే 23 ( సాక్ష్యం బ్యూరో )** యువత భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని వారికి నాణ్యమైన నైపుణ్య శిక్షణ అందించి, మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు వినూత్న కార్యక్రమాలను అమలు చేస్తోందని ప్రభుత్వ విప్, స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా శనివారం కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన క్రీడలు, యువత, పర్యాటక వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో స్కిల్ డెవలప్మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేయడంతో పాటు ఐటీఐలను అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్లుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కోర్సులను ప్రవేశపెట్టి యువతకు ఉపాధి అవకాశాలు పెంచే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలల్లో జాబ్ ఓరియెంటెడ్ కోర్సులను ప్రవేశపెడుతూ భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా యువతను తీర్చిదిద్దుతున్నామని చెప్పారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ద్వారా నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఇంజనీరింగ్, లా కాలేజీలు, ట్రిపుల్ ఐటీ, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్లు, అడ్వాన్స్ లెర్నింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి యువతకు మెరుగైన అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. “తెలంగాణ రైజింగ్ విజన్-2047” లక్ష్యంగా రాష్ట్రాన్ని దేశంలో అగ్రస్థానంలో నిలపడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌కు ప్రత్యామ్నాయంగా “భారత్ ఫ్యూచర్ సిటీ” ప్రాజెక్టును అభివృద్ధి చేస్తూ 40 లక్షల మందికి పైగా యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని చెప్పారు. ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్, గ్రీన్ ఫార్మా, రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ రంగాల్లో పరిశ్రమలను ప్రోత్సహిస్తూ స్థానిక యువతకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ యువత అభివృద్ధి, నైపుణ్యాల పెంపు, ఉపాధి అవకాశాల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రతి వారం వివిధ శాఖలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రభుత్వ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. మే 18 నుంచి 23 వరకు యువత, క్రీడలు, పర్యాటక రంగాలకు సంబంధించిన కార్యక్రమాలు నిర్వహించామని, జాబ్ మేళాలు, నైపుణ్య శిక్షణలు, క్రీడా పోటీలు, మాదకద్రవ్యాల నివారణ అవగాహన కార్యక్రమాలు చేపట్టినట్లు వెల్లడించారు. జాబ్ మేళాల ద్వారా ఎంపికైన యువతకు ఆఫర్ లెటర్లు, శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేశామని చెప్పారు. పర్యాటక రంగ అభివృద్ధిలో భాగంగా పిల్లలమర్రి, కోయిలసాగర్ ప్రాంతాలపై అవగాహన కల్పించేందుకు 2కే వాకథాన్‌లు, పోస్టర్ ప్రదర్శనలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మెగా జాబ్ మేళా ద్వారా ఎంపికైన ఉద్యోగార్థులకు ఆఫర్ లెటర్లు, సెట్విన్ ద్వారా శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. వివిధ క్రీడల్లో విజేతలైన క్రీడాకారులకు మెడల్స్, ప్రశంసాపత్రాలు ప్రదానం చేసి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, మూడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి, పరిశ్రమల శాఖ డీఎం యాదయ్య, జిల్లా యువజన క్రీడల అధికారి రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వావిలాల నిధుల దుర్వినియోగంపై విచారణలో వివాదం

**– వాయిదా వేసి వెనుదిరిగిన విచారణ అధికారి – అధికారపార్టీ కనుసన్నల్లో అధికార యంత్రాంగం – అవినీతి ఆరోపణలపై గ్రామ యువత ఆగ్రహం**

**పాలకుర్తి, మే 23(సాక్ష్యం) :**
పాలకుర్తి నియోజకవర్గంలోని వావిలాల గ్రామపంచాయతీలో నిధుల దుర్వినియోగం ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గ్రామ అభివృద్ధి పనుల పేరుతో గత పాలకవర్గం చేపట్టిన ఖర్చుల్లో భారీ అవకతవకలు జరిగాయని నూతన పాలకవర్గం ఆరోపిస్తోంది. ఈ వ్యవహారంపై అధికారుల విచారణ కూడా వివాదాస్పదంగా మారడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి.గ్రామపంచాయతీ నిధుల వినియోగంపై వచ్చిన ఫిర్యాదుల మేరకు సంబంధిత శాఖ విచారణ అధికారిని గ్రామానికి పంపగా, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టకుండా వాయిదా వేసి వెనుదిరిగి పోయారు. దీంతో గ్రామ యువత, ప్రజా సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. “అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు..? అధికారులకు ఎవరితో భయం..?” అంటూ గ్రామ యువకులు బహిరంగంగా ప్రశ్నిస్తున్నారు.ఇటీవల బాధ్యతలు చేపట్టిన నూతన సర్పంచ్ మాట్లాడుతూ, “మాజీ పాలకవర్గం చేపట్టిన పనులపై పూర్తి స్థాయి విచారణ



జరిపేందుకు మేము సిద్ధంగా ఉన్నాం. గ్రామ ప్రజల ముందే అన్ని రికార్డులు ఉంచేందుకు కూడా వెనుకాడం లేదు” అని తెలిపారు. అయితే విచారణకు వచ్చిన అధికారులు స్పష్టమైన సమాధానం ఇవ్వకుండా వెనుదిరగడం అనుమానాలకు తావిస్తోందని ఆరోపించారు.గ్రామంలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీలు, తాగునీట పైపులైన్ పనులు, స్ట్రీట్ లైట్లు, పల్లె ప్రకృతి వనాలు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి ఖర్చుల వివరాలు ప్రజలకు అందుబాటులో లేవని స్థానికులు చెబుతున్నారు. కొన్ని పనులు కాగితాలపైనే పూర్తయినట్లు చూపించి నిధులు మళ్లించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చే యువత ప్రశ్నలకు అధికారులు సరైన సమాధానాలు ఇవ్వకపోవడం పట్ల తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామంలో అవినీతి జరిగిందా లేదా అన్నది పక్కన పెడితే, ఆరోపణలు వచ్చిన వెంటనే పారదర్శక విచారణ చేపట్టాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉందని ప్రజలు అంటున్నారు.“ఇదేనా ప్రజాపాలన..? ఇదేనా ప్రగతి ప్రణాళిక..?” అంటూ గ్రామ యువత ప్రభుత్వాన్ని సవాల్ చేస్తోంది. అధికారపార్టీ నాయకుల కనుసన్నల్లోనే విచారణలు నిర్వీర్యం అవుతున్నాయా..? పాలకుర్తి నియోజకవర్గంలో ఇంకా ఎన్ని గ్రామాల్లో ఇలాంటి దుర్వినియోగాలు జరుగుతున్నాయో వెలికితీయాల్సిన అవసరం ఉందని డిమాండ్ చేస్తున్నారు ఈ వ్యవహారంపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక బృందంతో సమగ్ర విచారణ జరిపి, గ్రామపంచాయతీ ఖాతాలను ఆడిట్ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. అవినీతికి పాల్పడిన వారెవరైనా వారిపై కఠిన చర్యలు తీసుకుని ప్రజా ధనం రక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

# చోరీ కేసులను ఛేదించిన పోలీసులు

**పాలకుర్తి,మే23(సాక్ష్యం):**
పాలకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన పలు ఇంటి చోరీ కేసులను ఛేదించి నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి సుమారు 3 తులాల బంగారం, 70 తులాల వెండి వస్తువులు, ఒక కారు మరియు ఒక ఆటోను స్వాధీనం చేసుకోవడం జరిగింది. రికవరీ చేసిన బంగారం , వెండి వస్తువుల విలువ సుమారు






ఆరు లక్షల ఇరవై ఐదు వేల రూపాయలు వరకు ఉంటుంది.ఈ కేసులో ప్రధాన నిందితుడు దాసరి మురళీకృష్ణ అతని సహచరులు నెల్లికుదురు మండలానికి చెందిన పాత నేరస్తులు. వీరిపై గతంలో కూడా పలు దొంగతనం కేసులు నమోదై ఉండగా, పలుమార్లు జైలుకు వెళ్లివచ్చినట్లు విచారణలో తెలిసింది. నిందితులు పాలకుర్తి, కేశవపట్నం మరియు చొప్పదండి ప్రాంతాల్లో పలు చోరీలకు పాల్పడినట్లు ఒప్పుకున్నారు. ఈ కేసును సమర్థవంతంగా ఛేదించినందుకు కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, వెస్ట్ జోన్ డిసిపి రాజమహేంద్ర నాయక్ పాలకుర్తి సిఐ జానకిరామ్ రెడ్డి , ఎస్ ఐ డి. పవన్ కుమార్ , ఐడి అసిస్ట్ అనలిస్ట్ సల్మాన్‌లను హెడ్ కానిస్టేబుల్ సోమిరెడ్డి , కానిస్టేబుళ్లు రమేష్, రాజ్‌కుమార్, యాకయ్య, ప్రశాంత్ రెడ్డి లను అభినందించారు.వేసవి కాలంలో ఇంటి చోరీలు జరిగే అవకాశం ఎక్కువగా ఉండుటచేత ప్రజలు రాత్రి సమయంలో బయట నిద్రించే సందర్భాల్లో బంగారు ఆభరణాలు ధరించకుండా ఉండాలని, ఇంటికి తాళాలు వేసుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ శాఖ సూచించింది.

# జీ తెలుగు న్యూస్ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డు 2026 కు ఎంపికైన డాక్టర్ రాజేందర్ రెడ్డి

**– హనుమాండ్ల ఝాన్సీ రాజెంధర్ రెడ్డికి ఘనసన్మానం**





**పాలకుర్తి,మే23(సాక్ష్యం):**
హైదరాబాద్ నగరంలోని బంజారాహిల్స్ రోడ్ నెం.6లో ఉన్న ప్రతిష్టాత్మక రాడిసన్ బ్లూ హోటల్ వేదికగా ఘనంగా నిర్వహించిన జీ తెలుగు న్యూస్ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డ్స్-2026 కార్యక్రమం వైద్య రంగానికి సేవలందిస్తున్న ప్రముఖులను ఒకే వేదికపైకి తీసుకువచ్చింది. వైద్య సేవలను సమాజానికి అంకితం చేస్తూ విశేష కృషి చేస్తున్న వైద్య నిపుణులను సత్కరించేందుకు జీ తెలుగు న్యూస్ ఈ అవార్డులను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది.ఈ సందర్భంగా అమెరికాలో ప్రముఖ వైద్య నిపుణుడిగా సేవలందిస్తున్న డా. హనుమాండ్ల రాజేందర్ రెడ్డికి హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డు-2026 లభించడం తెలుగు ప్రజలకు గర్వకారణంగా నిలిచింది. వైద్య రంగంలో నాలుగు దశాబ్దాలకు పైగా అనుభవంతో అనేకమంది రోగులకు సేవలందిస్తూ, భారతీయ వైద్యుల ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో చాటుతున్న డా. హనుమాండ్ల రాజేందర్ రెడ్డి సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేశారు.వృత్తి రీత్యా అమెరికాలో ఉండటంతో డా. రాజేందర్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరు కాలేకపోయారు. ఆయన తరఫున వారి సతీమణి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఝాన్సీ రాజేందర్ రెడ్డి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా ఈ ప్రతిష్టాత్మక అవార్డును స్వీకరించారు. కార్యక్రమంలో అవార్డు స్వీకరిస్తున్న సమయంలో సభికులు ఘనంగా చప్పట్లతో అభినందించారు.అవార్డు అనంతరం ఝాన్సీ రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ.. భావోద్వేగానికి లోనయ్యారు. “వైద్య సేవలను కేవలం ఉద్యోగంగా కాకుండా మానవ సేవగా భావిస్తూ ప్రజల ఆరోగ్యానికి జీవితాన్ని అంకితం చేసిన డా. హనుమాండ్ల రాజేందర్ రెడ్డికి ఈ అవార్డు రావడం మా కుటుంబానికి ఎంతో ఆనందకరమైన విషయం. విదేశాల్లో ఉన్నప్పటికీ తెలుగు ప్రజల పట్ల ఆయనకున్న ప్రేమ, సేవా దృక్పథం ఎప్పటికీ తగ్గలేదు. ఈ గుర్తింపు ఆయన ఎన్నో ఏళ్ల కృషికి వచ్చిన గౌరవం” అని తెలిపారు.అలాగే సమాజానికి సేవలందిస్తున్న వైద్యులను గుర్తించి, వారి సేవలను ప్రజలకు పరిచయం చేస్తూ జీ తెలుగు న్యూస్ నిర్వహించిన ఈ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డ్స్ కార్యక్రమాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు. వైద్య రంగంలో సేవలందిస్తున్న వ్యక్తులను ప్రోత్సహించడం ద్వారా సమాజంలో మరింత సేవాభావం పెంపొందించడంలో జీ తెలుగు న్యూస్ కీలక పాత్ర పోషిస్తోందని కొనియాడారు. ప్రజలకు ఉపయోగపడే విధంగా మంచి కార్యక్రమాలను నిర్వహిస్తూ మీడియా రంగంలో జీ తెలుగు న్యూస్ తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ వైద్యులు, ఆసుపత్రుల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు, మీడియా ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# గుట్టలో ఘనంగా మంత్రి కోమటిరెడ్డి జన్మదిన వేడుకలు

**యాదగిరిగుట్ట సాక్ష్యం న్యూస్...**
యాదగిరిగుట్టలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రముఖ వ్యాపారవేత్త ఎన్నారై గౌలికర్ నర్సింగ్ రాజ్ , ఒంట్లోజు వెంకటేష్ గౌరీ కార్ అరుణ రాజేష్ తదితరులు మంత్రి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. యాదగిరిగుట్టలో వైకుంఠ ద్వారం వద్ద పెద్ద ఎత్తున బాణాసంచా కాల్చి 61 కిలోల





కేకును కట్ చేశారు. ఈ సందర్భంగా సుమారు 1000 మంది మహిళలకు ఉచితంగా చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య పాల్గొని మాట్లాడారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఉమ్మడి నల్గొండ జిల్లా అభివృద్ధికి రాష్ట్ర అభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్నారని అన్నారు. ఆయన నాయకత్వంలో ఈ ప్రాంతం పెద్ద ఎత్తున అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఆయన ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరారు. కాగా మంత్రి కోమటిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా 60 క్వింటాళ్ల సమిధులను యజ్ఞ యాగాదుల కోసం అందజేసినట్లు టిటిడి లోకల్ అడ్వైజరీ బోర్డు మాజీ సభ్యులు వడ్లోజి వెంకటేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# చెరువుకు మరమ్మత్తులు చేయాలని రైతుల నిరసన

**– పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు**

**తాడ్వాయి, మే 23, (సాక్ష్యం) :**
తాడ్వాయి మండలం నర్సింగాపూర్ లోని కంభోజ చెరువు కు మరమ్మతులు చేపట్టాలని రైతులు శనివారం నిరసన తెలియజేశారు. గత పది సంవత్సరాలుగా చెరువు మరమత్తులకు నోచుకోక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత 25 సంవత్సరాల క్రితం నిర్మించిన కంభోజ చెరువు పూర్తి స్థాయిలో మరుమత్తులు చేపట్టలేదని. రైతులు ఎన్నిసార్లు అధికారులకు ప్రజా ప్రతినిధులకు విన్నవించుకున్న పట్టించుకున్న పాపను పోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కంబోజ చెరువు కింద దాదాపుగా 400 ఎకరాల పైగా ఆయకట్టు ఉంది. రెండు తోములకు మరమ్మత్తు లు చేస్తే రెండు పంటలు పండే అవకాశం ఉందని రైతులు తెలిపారు. తూముల వద్ద లీకేజీల బుంగాలు, మత్తడి తో నీరంతా వృధా పోతుందన్నారు. వీటిని మరమ్మతులు చేపట్టితే రెండు పంటలకు సరిపోను పంటలకు నీరు అందించవచ్చని రైతులు అన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు పట్టించుకోకుంటే నిరసన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతులు పిట్టల పోశాలు, చింతల మల్లయ్య, బందారి చంద్రయ్య, పిట్టల శ్రీకాంత్, మండల రాజయ్య, మహిళా రైతులు చింతల చందన, చింతల లింగమ్మ, చింతల రమ, చింతల సుగుణ, పిట్టల సుగుణ, చింతల ఓదెమ్మ, రేగుల లక్ష్మి భర్తపురం మంగ,100 మంది రైతులు నిరసన కార్యక్రమాలలో పాల్గొన్నారు.



# ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు మంటలు

అప్రమత్తం అయినా రైతులు
మంటలను నియంత్రించిన ఫైర్ సిబ్బంది

**వర్ధన్నపేట, మే 23 (సాక్ష్యం ):**
వర్ధన్నపేట పట్టణంలోని కొనరెడ్డి ధాన్యం కొనుగోలు సెంటర్ వద్ద కు వరి కొయ్యల మంటలు వ్యాపిస్తుండడం తో రైతులు అప్రమత్తం అయి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. పట్టణ మున్సిపాలిటీ చైర్మన్ పాలకూర్తి సారంగపాణి కి కౌన్సిలర్ తిరుపెల్లి వాణి సమాచారం అందించగా వర్ధన్నపేటలో ఫైర్ సిబ్బంది అందుబాటు లేకపోవడంతో వరంగల్ నుండి ఫైర్ సిబ్బంది వచ్చి మంటలు అదుపులోకి తెచ్చారు . దీంతో భారీ నష్టం జరుగ కుండా అడ్డుకున్నట్లు అయింది. తన తల్లిని ఆసుపత్రి కి పరీక్షల నిమిత్తం చైర్మన్ తీసుకెళ్ళినా సమయంలోనే మంటల సమాచారం అందుకున్న చైర్మన్ అప్రమత్తం మై అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా సకాలంలో ఫైర్ ఇంజన్ రావడం వలన రైతులు ఊపిరి పీల్చుకున్నారు. చైర్మన్ అందుబాటులో లేకున్నా ఫోన్ ద్వారా స్పందించి నందుకు రైతులు అభినందించారు..

బీసీ నాయకత్వంపై

# అబద్ధపు ఆరోపణలు చేస్తే సహించేది లేదు

**– పోగుల సైదులు గౌడ్**


**మిర్యాలగూడ డివిజన్ మే 23 (సాక్ష్యం న్యూస్)**
తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టి పి సి సి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ పై కొన్ని మీడియా సంస్థలు, ముఖ్యంగా బిగ్ టీవీ కావాలనే కుట్రపూరితంగా చేస్తున్న ఆరోపణలు తెలంగాణ బీసీ




సంక్షేమ సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు పోగుల సైదులు గౌడ్ తీవ్రంగా ఖండించారు సాధారణ కార్యకర్త స్థాయి నుండి, ఎన్నో పోరాటాలు చేసి ఈరోజు పీ సీ సీ అధ్యక్షుడిగా ఎదిగిన ఒక బీసీ నాయకుడు ఉన్నత స్థానంలో ఉండటం ఓర్వలేకనే ఇలాంటి ఆపద్దపు ఆరోపణలతో జోలికి వస్తే తెలంగాణవ్యాప్తంగా ఉన్న బీసీ సమాజం చూస్తూ ఊరుకోదు అన్నారు అందరికీ అందుబాటులో ఉండే బీసీ నేత ప్రజా నాయకుడు మహేష్ కుమార్ గౌడ్ పదవి దక్కిన నాటి నుండి గాంధీ భవన్‌లో ప్రతి సామాన్య కార్యకర్తకు, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటు క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేస్తూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను జనంలోకి తీసుకెళ్లడంలో అహర్నిశలూ శ్రమిస్తున్న ఆయనపై విదేశీ విహారాలంటూ అబద్ధాలు ప్రచారం చేయడం సిగ్గుచేటు.పార్టీలో నామినేటెడ్ పోస్టులు, ఇతర పదవుల భర్తీ అత్యంత పారదర్శకంగా జరుగుతోంది.స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేల సిఫార్సులు, జిల్లాల ముఖ్య నాయకుల అభిప్రాయాల మేరకే కష్టపడిన కార్యకర్తలకు పదవులు దక్కుతున్నాయి. ఇందులో ఎలాంటి పక్షపాతం లేదు. అందరినీ సమన్వయం చేసుకుంటూ, హైకమాండ్ ఏ ఐ సీ సీ పూర్తి విశ్వాసంతో ఆయన ముందుకు సాగుతున్నారు. బీసీ సంక్షేమ సంఘం తరఫున బిగ్ టీవీ యాజమాన్యానికి హెచ్చరిక. మీ రేటింగుల కోసమో, ఎవరిదో పొలిటికల్ సుపారీ తీసుకుని బీసీ నాయకులపై ఇలాంటి వ్యక్తిత్వ క్యారెక్టర్ అస్సస్సినేషన్ హననానికి పాల్పడితే తీవ్ర పరిణామాలు ఉంటాయి. వెంటనే మీ అసత్య కథనాలను వెనక్కి తీసుకుని, బేషరతుగా క్షమాపణ చెప్పాలి. లేనిపక్షంలో బిగ్ టీవీ ఆఫీస్ ముట్టడితో పాటు, రాష్ట్రవ్యాప్తంగా బీసీల ఆగ్రహాన్ని మరియు చట్టపరమైన న్యాయ పోరాటాన్ని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని పోగుల సైదులు గౌడ్ హెచ్చరించారు.

# వడదెబ్బతో వృద్ధుడు మృతి

**మంగపేట, మే 23, (సాక్ష్యం) :**
మంగపేట మండలంలోని రామచంద్రునిపేట గ్రామానికి చెందిన ఊటుకూరి సోమిరెడ్డి (78) వడగాలులకు బలైన ఘటన విషాదాన్ని మిగిల్చింది. శుక్రవారం పంట పొలాలకు వెళ్లిన ఆయన తిరిగి ఇంటికి రాలేదు. శనివారం ఉదయం పూరేడుపల్లి చెరువుకు వెళ్లిన గ్రామస్తులు నీటిలో పడిఉన్న మృతదేహాన్ని గమనించి పరిశీలించగా అది సోమిరెడ్డిదిగా గుర్తించారు. తీవ్ర ఎండలు, వడగాలుల కారణంగా అస్వస్థతకు గురై చెరువులో పడిపోయి మృతి చెందినట్లు గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల మంగపేట మండలంలో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీలకు చేరుకుని ఎండల తీవ్రత పెరిగింది. ఈ నేపథ్యంలో వడదెబ్బ కారణంగానే మృతి సంభవించి ఉంటుందని



స్థానికులు భావిస్తున్నారు. మృతుడికి భార్య జయమ్మ, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు

**హనుమకొండ 23 మే (సాక్ష్యం)**
నేడు ఆదివారం 24 న నిర్వహించనున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షలను పకడ్బందీగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పరీక్షా కేంద్రాల వద్ద నిషేధాజ్ఞలు అమలు చేస్తునట్లుగా వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్షా కేంద్రాల నుండి ఐదు వందల మీటర్ల పరిధిలో రేపు ఉదయం 6 గంటల సాయంత్రం 6 గంటల వరకు సెక్షన్ 163 బి. ఎన్. ఎన్. ఎస్ చట్టాన్ని అనుసరించి గుమి కూడడం, ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని ఎవరైనా ఈ ఉత్తరం అతిక్రమిస్తే చట్టపర చర్యలు తప్పవని సిపి తెలిపారు.




# అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన దరఖాస్తుల ఆహ్వానం

**– జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**

**వరంగల్ జిల్లా 23 మే (సాక్ష్యం)**
వరంగల్ జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో ఒక పబ్లిసిటీ అసిస్టెంట్ (వీడియో కెమెరామన్), ఒక పబ్లిసిటీ అసిస్టెంట్ (ఫోటో గ్రాఫర్) ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన మే 25 వరకు అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ఒక ప్రకటనలో తెలిపారు.



**పబ్లిసిటీ అసిస్టెంట్ (వీడియో**
కెమెరా మెన్) కొరకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి ఏదైనా డిగ్రీ అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఏపీ, తెలంగాణ స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్ ద్వారా జారీ చేసిన సినీ ఫోటోగ్రఫీ అర్హత ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం ఉన్నదున్నట్లు తెలిపారు. అదేవిధంగా పబ్లిసిటీ అసిస్టెంట్స్ ( ఫోటోగ్రఫర్) కొరకు గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుండి ఏదైనా డిగ్రీ అర్హత గల అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని, కాలేజ్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ నుండి ఫోటోగ్రఫీలో డిప్లమా లేదా ఏదైనా గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుండి జర్నలిజం లో డిప్లొమా అర్హత గల వారికి మొదటి ప్రాధాన్యం ఇవ్వమన్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి అర్హత గల అభ్యర్థులు వరంగల్ జిల్లా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో మే 25 సోమవారంసాయంత్రం 5:00 గంటల లోపు విద్యార్హతల జీరాక్స్ కాపీలు జత చేసి తమ దరఖాస్తును సమర్పించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# సన్ రైజర్స్ ఐపీఎల్ టైటిల్ సాధించేనా?

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 ఆఖరి అంకానికి చేరుకుంది. ఆదివారం జరిగే డబుల్ హెడర్ పోరుతో లీగ్ దశ ముగియనుంది. ప్రస్తుతం మరో మూడు మ్యాచ్‌లు మాత్రమే మిగిలి ఉన్నాయి. శనివారం పంజాబ్ కింగ్స్, లక్నో సూపర్ జెయింట్స్ మ్యాచ్‌లు తలపడతాయి. ఇక ఆదివారం జరిగే డబుల్ హెడర్‌లో కేకేఆర్‌తో ఢిల్లీ క్యాపిటల్స్.. రాజస్తాన్ రాయల్స్‌తో ముంబై ఇండియన్స్ జట్లు తలపడతాయి. ఇప్పటికే ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్ జట్లు ప్లే ఆఫ్స్ చేరుకున్నాయి. ఆర్సీబీ, గుజరాత్ టైటాన్స్ జట్లు టాప్ 2లో నిలిచాయి. ఇక ఆర్సీబీపై తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో నెగ్గినా మెరుగైన నెట్ రన్ రేట్ లేకపోవడంతో సన్ రైజర్స్ హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. టాప్ 2లో నిలిచిన జట్లకు ఫైనల్ చేరేందుకు రెండు అవకాశాలు ఉంటాయి. ఇక 3, 4వ స్థానాల్లో నిలిచిన జట్లు ఫైనల్ చేరాలంటే వరుసగా రెండు మ్యాచ్‌ల్లో నెగ్గాల్సిందే. అయితే ఇలాంటి స్థితిలో నిలవడం సన్ రైజర్స్ హైదరాబాద్‌కు ఇదేం తొలిసారి కాదు. 2016లో కూడా ఇలాంటి పరిస్థితినే సన్ రైజర్స్ హైదరాబాద్ ఎదుర్కొంది. 2016 ఐపీఎల్‌లో గుజరాత్ లయన్స్.. ఆర్సీబీ జట్లు వరుసగా టాప్ 2లో నిలిచాయి. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ మూడు.. కేకేఆర్ 4వ స్థానంలో నిలిచాయి. క్వాలిఫయర్ 1లో గుజరాత్ లయన్స్‌పై ఆర్సీబీ నెగ్గి ఫైనల్ చేరగా.. కేకేఆర్ ను ఓడించిన సన్ రైజర్స్ హైదరాబాద్ క్వాలిఫయర్ 2కు అర్హత సాధించింది. అనంతరం క్వాలిఫయర్ 2లో గుజరాత్ లయన్స్‌పై నెగ్గింది. అనంతరం ఫైనల్లో ఆర్సీబీని ఓడించి టైటిల్ సాధించింది. ఆ సమయంలో సన్ రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్‌గా ఆస్ట్రేలియా ప్లేయర్ డేవిడ్ వార్నర్ ఉన్నాడు. ఈసారి కూడా ఆస్ట్రేలియా కెప్టెన్ ప్యాట్ కమిన్స్ ఉన్నాడు. 2016లో మాదిరే ఈసారి కూడా ఆర్సీబీ, గుజరాత్, సన్ రైజర్స్ జట్లు ప్లే ఆఫ్స్‌కు చేరాయి. కేకేఆర్ రేసులో ఉంది. కేకేఆర్ కూడా ప్లే ఆఫ్స్‌కు చేరితే అచ్చం 2016 సీజన్‌లానే ఉంటుంది. 2016 సెంటిమెంట్ వర్కౌట్ అయితే ప్యాట్ కమిన్స్ నేతృత్వంలోని సన్ రైజర్స్ హైదరాబాద్ కప్పు నెగ్గడం ఖాయం. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్ మే 27న జరిగే ఎలిమినేటర్ పోరులో తలపడనుంది. అయితే ప్రత్యర్థి ఇంకా డిసైడ్ కాలేదు. ప్రస్తుతం సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టులో బ్యాటర్లు సూపర్ ఫామ్‌లో ఉన్నారు. అభిషేక్ శర్మ, క్లాసెన్, ఇషాన్ కిషన్, నితీశ్ కుమార్ రెడ్డిలు సూపర్ టచ్‌లో ఉన్నారు. ఇక బౌలింగ్ కూడా మెరుగైంది.

ప్యాట్ కమిన్స్, సకీబ్ హుస్సేన్, ఈషాన్ మలింగలు లయలో ఉన్నారు. వీరు క్వాలిఫయర్స్‌లో కూడా రాణిస్తే సన్ రైజర్స్ హైదరాబాద్ ఫైనల్ చేరడం ఖాయం. ఆర్సీబీతో మరోసారి పోరు జరిగితే మాత్రం అభిమానులు పండగ చేసుకోవడం ఖాయం. మే 31న అహ్మదాబాద్ వేదికగా జరిగే ఫైనల్ జరగనుంది.

# గైక్వాడ్ పై భారీ జరిమానా

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ లో చెన్నై సూపర్ కింగ్స్ ప్రయాణం చేదు జ్ఞాపకంతో ముగిసింది. గురువారం గుజరాత్ టైటాన్స్‌తో జరిగిన మ్యాచ్ లో శుభ్‌మన్ గిల్ టీమ్ చేతిలో 89 పరుగుల తేడాతో ఓడిపోయిన సీఎస్‌కే, ప్లేఆఫ్స్ రేసు నుండి అధికారికంగా నిష్క్రమించింది. ఈ ఘోర పరాజయం తర్వాత చెన్నై జట్టుకు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ మరో షాక్ ఇచ్చింది. మ్యాచ్ లో నిర్ణీత సమయానికి ఓవర్ల కోటాను పూర్తి చేయనందుకు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు రూ. 24 లక్షల భారీ జరిమానా విధించింది. ఈ సీజన్ లో చెన్నై జట్టుకు ఇది రెండో తప్పు కావడంతో కెప్టెన్‌తో పాటు ప్లేయింగ్ ఎలెవన్ లోని మిగతా ఆటగాళ్లందరిపైనా పెనాల్టీ పడింది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన మ్యాచ్ 66 లో ఐపీఎల్ కోడ్ ఆఫ్ కాండక్ట్‌లోని ఆర్టికల్ 2.22 ప్రకారం కనీస ఓవర్ రేట్ నిబంధనను సీఎస్‌కే ఉల్లంఘించింది. అంతకుముందు లీగ్ లోని 18వ మ్యాచ్ లో కూడా ఈ



టీమ్ ఇదే తప్పు చేసింది. రెండోసారి నిబంధనలు అతిక్రమించినందుకు కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌కు రూ. 24 లక్షల ఫైన్ విధించగా, మ్యాచ్ ఆడిన మిగిలిన టీమ్ మెంబర్స్ అందరికీ, ఇంపాక్ట్ ప్లేయర్‌తో సహా ఒక్కొక్కరికి రూ. 6 లక్షలు లేదా వారి మ్యాచ్ ఫీజులో 25 శాతం (ఏది తక్కువైతే అది) జరిమానాగా ప్రకటించారు. ఈ మేరకు ఐపీఎల్ యాజమాన్యం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఈ మ్యాచ్ లో గుజరాత్ టైటాన్స్ నిర్దేశించిన 230 పరుగుల భారీ టార్గెట్‌ను ఛేజ్ చేసే క్రమంలో చెన్నై సూపర్ కింగ్స్ బ్యాటింగ్ లైనప్ పూర్తిగా విఫలమైంది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ పరుగులేమీ చేయకుండా గోల్డెన్ డక్‌గా అవుట్ కావడంతో జట్టు భారీ దెబ్బతింది. మిడిలార్డర్ బ్యాటర్ శివమ్ దూబే కేవలం 17 బంతుల్లో 47 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడి కాసేపు ఆశలు రేకెత్తించినా, మిగతా ప్లేయర్స్ నుండి సపోర్ట్ లభించలేదు. దీంతో చెన్నై ఘోర పరాజయాన్ని చవిచూసి టోర్నమెంట్ నుండి అవుట్ అయింది. ఈ పరాజయంతో చెన్నై సూపర్ కింగ్స్ ఈ ఏడాది లీగ్ నుండి నిష్క్రమించింది. లెజెండరీ ప్లేయర్ ఎంఎస్ ధోనీ భవిష్యత్తుపై ఇంకా స్పష్టత రాని తరుణంలో, చాలా మంది కీలక ఆటగాళ్లు తమ ఫామ్‌ను నిరూపించుకోవడంలో ఘోరంగా విఫలమయ్యారు. ఈ ఓటమి, ప్లేఆఫ్స్ రేసు నుండి తప్పుకోవడం వంటి పరిణామాల నేపథ్యంలో వచ్చే ఐపీఎల్ సీజన్ నాటికి చెన్నై టీమ్ మేనేజ్‌మెంట్ జట్టులో భారీ మార్పులు చేసే అవకాశం కనిపిస్తోంది. కొత్త బ్లూప్రింట్ తో జట్టును రీబిల్డ్ చేయడానికి సీఎస్‌కే యాజమాన్యం కసరత్తులు ప్రారంభించనుంది.



# కోహ్లీ వండర్ఫుల్ బ్యాటింగ్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఐపీఎల్ 2026 సీజన్ లో భాగంగా శుక్రవారం సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్ లో ఒక అద్భుతమైన ప్రపంచ రికార్డును బద్దలు కొట్టాడు. ఈ మ్యాచ్ లో వెంకటేష్ అయ్యర్‌తో కలిసి ఓపెనింగ్ వికెట్‌కు 60 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పిన కోహ్లీ, ఓవరాల్ గా టీ20 క్రికెట్ లో 211వ సారి యాభై లేదా అంతకంటే ఎక్కువ పరుగుల పార్ట్‌నర్‌షిప్‌లో భాగమయ్యాడు. ఈ ఘనతతో మెన్స్ టీ20 క్రికెట్ చరిత్రలోనే అత్యధిక యాభై ప్లస్ భాగస్వామ్యాల్లో నిలిచిన ప్లేయర్‌గా కోహ్లీ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఈ లిస్ట్ లో ఇంగ్లండ్ మాజీ బ్యాటర్ అలెక్స్ హేల్స్ (210) రికార్డును ఆయన అధిగమించాడు. వెస్టిండీస్ లెజెండ్ క్రిస్ గేల్ 191 భాగస్వామ్యాలతో ఈ జాబితాలో ఐదో స్థానంలో ఉన్నాడు. ఈ మ్యాచ్ లో మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ బ్యాటర్లు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు బౌలర్లపై విరుచుకుపడ్డారు. నిర్ణీత 20 ఓవర్లలో ఎస్‌ఆర్‌హెచ్ 4 వికెట్ల నష్టానికి 255 పరుగుల భారీ స్కోరును బోర్డుపై ఉంచింది. ఓపెనర్ అభిషేక్ శర్మ 56 పరుగులతో మెరుపు ఇన్నింగ్స్ ఆడగా, మిడిలార్డర్ లో ఇషాన్ కిషన్ 79 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచారు. హెన్రిచ్ క్లాసెన్ 51 పరుగులతో రాణించాడు. ఇషాన్ కిషన్, క్లాసెన్ మూడో వికెట్‌కు కేవలం కొద్ది ఓవర్లలోనే 113 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని జోడించి ఆర్సీబీ బౌలింగ్ లైన్‌అప్‌ను దెబ్బతీశారు. బెంగళూరు బౌలర్లలో రసీఖ్ సలామ్ దార్ 52 పరుగులిచ్చి 2 వికెట్లు పడగొట్టాడు. ఇన్నింగ్స్ బ్రేక్ సమయంలో సన్‌రైజర్స్ హిట్టర్ హెన్రిచ్ క్లాసెన్ మాట్లాడుతూ, మొదట్లో టైమింగ్ దొరకక కొంచెం ఇబ్బంది పడ్డానని అంగీకరించాడు. జోష్ హేజిల్‌వుడ్ వేసిన ఒకే ఓవర్ లో 27 పరుగులు రావడంతో తన ఇన్నింగ్స్ ట్రాక్‌లోకి వచ్చిందని చెప్పాడు. టీమ్ రన్ రేట్ వేగంగా ఉన్నప్పుడు క్రీజులో ఎక్కువ బంతులు వేస్ట్ చేయలేమని, అందుకే గేర్ మార్చాల్సి వచ్చిందని వివరించాడు. ఈ సీజన్ లో మిడిలార్డర్ లో ఇషాన్ కిషన్‌తో కలిసి మంచి పార్ట్‌నర్‌షిప్స్ బిల్డ్ చేయడం జట్టుకు బాగా ప్లస్ అయిందని క్లాసెన్ పేర్కొన్నాడు. పిచ్ కాస్త స్లోగా ఉన్నప్పటికీ బ్యాటింగ్ కు అనుకూలించిందని అభిప్రాయపడ్డాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు రెండు జట్లు ఇప్పటికే ప్లేఆఫ్స్ బెర్తులను కన్ఫర్మ్ చేసుకోవడంతో ప్లేయర్లు ఎలాంటి ఒత్తిడి లేకుండా ఫ్రీ మైండ్‌తో ఆడారు. మ్యాచ్ ఫలితం ఎలా ఉన్నా సరికొత్త ప్రయోగాలు చేయడానికి ఈ మ్యాచ్ పనికొచ్చిందని క్లాసెన్ చెప్పాడు. ఇంతటి భారీ స్కోరు సాధించడం వల్ల ఛేజింగ్ లో ప్రత్యర్థి జట్టు ఒత్తిడికి గురయ్యే అవకాశం ఉంటుందని విశ్లేషించాడు.



# విజయ్ శంకర్ రిటైర్మెంట్ ప్రకటన

భారత ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ దేశీయ క్రికెట్‌తో పాటు ఇండియన్ ప్రీమియర్ లీగ్ కు కూడా వీడ్కోలు పలికాడు. శుక్రవారం సోషల్ మీడియా ద్వారా తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని ప్రకటించిన ఈ తమిళనాడు క్రికెటర్, "కొత్త అవకాశాలను అందిపుచ్చుకోవడం, మరింత క్రికెట్ ఆడడం" కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించాడు. 35 ఏళ్ల విజయ్ శంకర్ ఇటీవల 2025-26 సీజన్‌కు ముందు త్రిపుర జట్టులో చేరిన సంగతి తెలిసిందే. భారత జట్టుకు 2018-2019 మధ్య ప్రాతినిధ్యం వహించిన అతను 12 వన్డేలు, 9 టీ20 మ్యాచ్‌లు ఆడాడు. మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా, పార్ట్‌టైమ్ సీమర్‌గా జట్టుకు సేవలందించాడు. క్రికెట్ నా జీవితం".. భావోద్వేగ పోస్టు రిటైర్మెంట్ ప్రకటిస్తూ చేసిన పోస్టులో విజయ్ శంకర్ భావోద్వేగానికి లోనయ్యాడు. "క్రికెట్ నా జీవితం. 10 ఏళ్ల వయసులో ఆట ప్రారంభించాను. 25 ఏళ్ల ప్రయాణంలో ప్రతి స్థాయిలో ఆడే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నాను. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించడం నా జీవితంలో అత్యంత గర్వకారణం," అని పేర్కొన్నాడు. అలాగే బీసీసీఐ, భారత జట్టు, కోచ్‌లు, సహచర ఆటగాళ్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. నాగ్‌పూర్‌లో జరిగిన భారత్ 500వ వన్డేలో చివరి ఓవర్ బౌలింగ్ చేయడం, 2019 ప్రపంచకప్‌లో తొలి బంతికే వికెట్ తీయడం వంటి క్షణాలు ఎప్పటికీ మరిచిపోలేనివని గుర్తుచేసుకున్నాడు. 2019 వన్డే ప్రపంచకప్‌లో భారత జట్టులో చోటు దక్కించుకున్న విజయ్ శంకర్, వెస్టిండీస్‌తో మాంచెస్టర్‌లో జరిగిన మ్యాచ్ తర్వాత గాయంతో టోర్నీ నుంచి తప్పుకున్నాడు. కాలి వేలి గాయం కారణంగా ప్రపంచకప్ మధ్యలోనే వైదొలగడం అతని అంతర్జాతీయ కెరీర్‌కు పెద్ద దెబ్బగా మారింది. ఆ తర్వాత భారత జట్టులో స్థానం కోల్పోయిన విజయ్ శంకర్ మళ్లీ జాతీయ జట్టులోకి రాలేకపోయాడు. అయినప్పటికీ దేశీయ క్రికెట్, ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో తన ప్రయాణాన్ని కొనసాగించాడు. కుడిచేతి వాటం బ్యాటర్, కుడిచేతి సీమర్ అయిన విజయ్ శంకర్ 2012లో ప్రొఫెషనల్ క్రికెట్‌లో అరంగేట్రం చేశాడు. తన కెరీర్‌లో మొత్తం 77 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు, 112 లిస్ట్-ఎ మ్యాచ్‌లు, 159 టీ20లు ఆడాడు. అంతర్జాతీయ స్థాయిలో ఎక్కువ కాలం కొనసాగకపోయినా, దేశీయ క్రికెట్‌లో స్థిరమైన ఆల్‌రౌండర్‌గా గుర్తింపు సంపాదించాడు.

# 2000 స్కోర్లు సాధించిన జట్టుగా సన్‌రైజర్స్ ప్రపంచ రికార్డు

ఉప్పల్ వేదికగా శుక్రవారం రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఈ మ్యాచ్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఎస్‌ఆర్‌హెచ్ 20 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 255 పరుగులు చేసింది. ఈ క్రమంలో ఓ టీ20 టోర్నమెంట్‌లో ఓ సీజన్‌లో అత్యధిక సార్లు 200 ప్లస్ పరుగులు సాధించిన జట్టుగా చరిత్ర సృష్టించింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ ఇప్పటి వరకు 9 సార్లు 200 ప్లస్ పరుగులు చేసింది. ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ బ్యాటర్లు పరుగుల వరద పారిస్తున్నారు. ఈ క్రమంలో కోల్‌కతా నైట్‌రైడర్స్, పంజాబ్ కింగ్స్, రాజస్థాన్ రాయల్స్‌పై రెండేసి సార్లు, ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై ఒక్కొసారి 200కి పైగా పరుగులు సాధించింది.



# చరిత్ర సృష్టించిన హెన్రిచ్ క్లాసెన్

సౌతాఫ్రికా మాజీ బ్యాటర్, సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఆటగాడు హెన్రిచ్ క్లాసెన్ అరుదైన ఘనత సాధించాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో 600 పరుగుల మైలురాయిని చేరుకున్నాడు. శుక్రవారం ఉప్పల్ వేదికగా ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌లో 51 పరుగులు చేయడం ద్వారా ఈ మైలురాయిని అందుకున్నాడు. ఈ నేపథ్యంలో ఓ టీ20 టోర్నమెంట్‌లో 4వ స్థానం లేదా అంతకంటే దిగువన బ్యాటింగ్ చేస్తూ 600కి పైగా పరుగులు చేసిన తొలి క్రికెటర్‌గా క్లాసెన్ చరిత్ర సృష్టించాడు. ఆర్‌సీబీ మ్యాచ్‌కు ముందు హెన్రిచ్ క్లాసెన్ 4వ స్థానం లేదా అంతకంటే తక్కువ స్థానంలో బ్యాటింగ్ చేస్తూ 13 ఇన్నింగ్స్‌లలో 555 పరుగులు సాధించాడు. ఆర్‌సీబీతో జరిగిన మ్యాచ్‌లో 4వ స్థానంలో ఆడిన క్లాసెన్ కేవలం 24 బంతుల్లోనే మెరుపు వేగంతో 51 పరుగులు చేసి ఈ టోర్నమెంట్‌లో 600 పరుగులను పూర్తి చేసుకున్నాడు. ఈ క్రమంలోనే రిషబ్ పంత్‌ను అదిగమించాడు. ఐపీఎల్ 2018లో పంత్ 11 ఇన్నింగ్స్‌లలో 579 పరుగులు చేశాడు. ఈ పరుగులు నాలుగు లేదా నాలుగు కంటే దిగువన స్థానాల్లో బ్యాటింగ్ చేస్తూ సాధించాడు.



# సచిన్‌లో చూసిందే వైభవ్ లో కనిపించింది

## భారత మాజీ క్రికెటర్ కిరణ్ మోరే


రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీపై భారత మాజీ క్రికెటర్ కిరణ్ మోరే ప్రశంసల జల్లు కురిపించాడు. క్రికెట్ గాడ్ సచిన్ టెండూల్కర్‌లో చూసిన తెగువ తనకు వైభవ్ సూర్యవంశీలో కనిపించిందని తెలిపాడు. వరల్డ్ క్లాస్ బౌలర్లను సైతం అలవోకగా ఎదుర్కొంటుండటం తనను విపరీతంగా ఆకట్టుకుందన్నాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగుతున్నాడు. 13 ఇన్నింగ్స్‌లలో 44.54 సగటు, 236.32 స్ట్రైక్‌రేట్‌తో 579 పరుగులు చేశాడు. ఆరెంజ్ క్యాప్ రేసులో కొనసాగుతున్నాడు. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ 53 సిక్సర్లు బాదాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఒక సీజన్‌లో భారత బ్యాటర్ కొట్టిన అత్యధిక సిక్స్‌లు ఇవే కావడం గమనార్హం. తాజాగా ఓ ఇంటర్వ్యూలో వైభవ్ ఆటతీరుపై స్పందించిన కిరణ్ మోరే.. సచిన్‌తో పోల్చుతూ బుడ్డోడిని ఆకాశానికెత్తాడు. 'నేను తొలిసారి సచిన్ టెండూల్కర్‌ను చూసినప్పుడు అతను వరల్డ్ క్లాస్ బౌలర్లను ఎలా ఎదుర్కొన్నాడో నాకు ఇప్పటికీ గుర్తుంది. అప్పుడే నాకు అర్థమైంది సచిన్ చాలా ప్రత్యేకమైన ఆటగాడు అని. ఇప్పుడు వైభవ్ సూర్యవంశీని చూస్తుంటే నాకు మళ్లీ అదే ఫీలింగ్ కలుగుతోంది. వైభవ్ కూడా చాలా ప్రత్యేకమైన ఆటగాడు. దేవుడే అతన్ని క్రికెట్ కోసం ప్రత్యేకంగా తయారు చేసి పంపినట్లున్నాడు. వైభవ్‌ను తన సహజ సిద్ధమైన శైలిలోనే ఆడనివ్వండి.. దేశానికి గొప్ప పేరు తెస్తాడు." అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల ముగిసిన అండర్ 19 ప్రపంచ కప్‌లో వైభవ్ సూర్యవంశీ 7 మ్యాచ్‌ల్లో 439 పరుగులు చేశాడు. ఆ టోర్నీలో 30 సిక్సర్లు బాది డెవాల్డ్ బ్రెవిస్ రికార్డును బద్దలు కొట్టాడు. టీ20 క్రికెట్‌లో ఇప్పటివరకు 31 మ్యాచ్‌ల్లో 1280 పరుగులు చేసి 4 శతకాలు నమోదు చేశాడు. ఈ అద్భుత ప్రదర్శన నేపథ్యంలోనే వైభవ్ సూర్యవంశీని టీమిండియాలోకి తీసుకోవాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే భారత సెలెక్టర్లు వైభవ్ సూర్యవంశీని శ్రీలంక పర్యటనకు వెళ్లే భారత్-ఏ జట్టుకు ఎంపిక చేశారు.





# 'స్వయంభూ' శరవేగంగా జరుగుతున్న పోస్ట్-ప్రొడక్షన్ వీఎఫ్ఎక్స్ పనులు

నిఖిల్ సిద్ధార్థ తన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ 'స్వయంభూ'తో రాబోతున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో, పిక్సెల్ స్టూడియోస్ భువన్, శ్రీకర్‌ల నిర్మాణంలో, టాగోర్ మధు సమర్పణలో భారీ పీరియడ్ యాక్షన్ చిత్రంగా రూపొందుతోంది. 'స్వయంభూ' భారతీయ సినిమా రంగంలోనే బిగ్గెస్ట్ ప్రాజెక్టులలో ఒకటిగా రూపుదిద్దుకుంటోంది. ఈ ఎపిక్ వెనుక ఉన్న వర్క్ ని చిత్ర బృందం ఇప్పుడు సినీ ప్రేమికులకు కళ్ళకు కట్టినట్లు చూపించింది. తాజాగా విడుదలైన వీడియోలో సినిమా పోస్ట్ ప్రొడక్షన్, ముఖ్యంగా వీఎఫ్ఎక్స్ పనుల విస్తృత స్థాయిని చూపించారు. ఇందులో హీరో నిఖిల్ సిద్ధార్థ, దర్శకుడు భరత్ కృష్ణమాచారి, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కేకే సెంథిల్ కుమార్ కలిసి ప్రముఖ వీఎఫ్ఎక్స్ సంస్థ ఫాంటమ్ ఎఫ్ఎక్స్‌ను సందర్శించారు. అక్కడ వందలాది మంది నిపుణులు 'స్వయంభు' ప్రపంచాన్ని ఫ్రేమ్ ఫ్రేమ్‌గా అద్భుతంగా మలుస్తున్న తీరు వీడియోలో చూపించారు. ఈ చిత్రానికి ఏకంగా 2700కి పైగా వీఎఫ్ఎక్స్ షాట్లు, 750 మందికిపైగా టెక్నీషియన్లు పనిచేస్తుండటం విశేషం. భారీ యుద్ధ సన్నివేశాలు, విశాలమైన ప్రాచీన రాజ్యాలు, అద్భుతమైన విజువల్ ప్రపంచాన్ని రూపొందిస్తున్నారు. ప్రతి సీజీ లేయర్‌ను చిత్రబృందం స్వయంగా పర్యవేక్షిస్తూ, తమ విజన్‌కు తగ్గట్టుగా తీర్చిదిద్దుతోంది. ముఖ్యంగా నిఖిల్, సెంథిల్ కుమార్ వీఎఫ్ఎక్స్ పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ ప్రతి అంశాన్ని దగ్గరుండి పరిశీలిస్తున్నారు. ఈ మాగ్నమ్ ఓపస్‌లో నిఖిల్ సరసన సంయుక్త, నభా నటేష్ కథానాయికలుగా నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించగా, నిఖిల్ పోషిస్తున్న యోధుడి పాత్రలోని వీరత్వాన్ని ఆవిష్కరించిన తొలి పాట 'రా రా ధీవరా' చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. 'స్వయంభు' గ్రాండియర్ ప్రతి ఫ్రేమ్‌లో కనిపిస్తోంది. అంతర్జాతీయ స్థాయి విజువల్స్‌ను కేకే సెంథిల్ కుమార్ (ISC) తన కెమెరాతో ఆవిష్కరిస్తుండగా, రవి బస్రూర్ సంగీతం అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైన్ ను ఎం. ప్రభాహరణ్, రవీంద్ర నిర్వహిస్తున్నారు. స్వయంభూ పాన్-ఇండియా విడుదలకు సిద్ధమవుతోంది.




# జియో హాట్ స్టార్ బిగ్గెస్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'సేవ్ ది టైగర్స్ - సీజన్ 3' .. పోస్టర్ రిలీజ్

సీజన్ 1, సీజన్ 2లతో తెలుగు ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తి భారీ విజయాలు సాధించిన అతి పెద్ద ఫ్యామిలీ ఎంటర్‌టైనింగ్ సిరీస్ 'సేవ్ ది టైగర్స్' సిరీస్ నుంచి ఇప్పుడు సీజన్ 3 రాబోతుందని జియో హాట్ స్టార్ ప్రకటించింది. మొదటి రెండు సీజన్లలో సరదా, హాస్యం, చురుకైన డైలాగులు, రిలేషన్‌షిప్ డ్రామాతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ సిరీస్ మూడో సీజన్ రానుండటంతో దీనిపై భారీ అంచనాలు నెలకొన్నాయి. 2023లో వచ్చిన 'సేవ్ ది టైగర్స్' ఫ్రాంచైజీ ఫ్యామిలీ ఆడియెన్స్‌కు బాగా కనెక్ట్ అయ్యింది. ప్రతి ఒక్కరి హృదయాల్లో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకుంది. తాజాగా రూపొందుతోన్న సేవ్ ది టైగర్స్ సీజన్ 3కి మహి వి.రాఘవ్, ప్రదీప్ అద్వైతం షో రన్నర్స్. ఈ సీజన్ మరింత ఆసక్తికరమైన ట్విస్టులు, కొత్త పాత్రలతో ప్రేక్షకులను అలరించటానికి సన్నద్ధమవుతోంది.

### ఆసక్తికరమైన కాస్మిక్ ట్విస్ట్‌తో సేవ్ ది టైగర్స్ సీజన్ 3..

తాజాగా రిలీజ్ చేసిన 'సేవ్ ది టైగర్స్ సీజన్ 3' పోస్టర్ చూస్తుంటే కథలో ఆసక్తికరమైన కాస్మిక్ ట్విస్ట్ ఉండబోతుందనే విషయం తెలుస్తోంది. రెండు వైవిధ్యమైన ప్రపంచాల మధ్య జరిగే ప్రత్యేకమైన సోషల్ ఎక్స్‌పెరిమెంట్ కథను మరింత ఆసక్తికరంగా మార్చనుంది. ఈ అంశం మొత్తం కథను సరికొత్త పంథాలో ప్రేక్షకులను అందించనుంది. మూడు జంటలు.. అందులోని భర్తలు పడే ఇబ్బందులు.. వారి చుట్టూ తిరిగే కామెడీ డ్రామాకు కాస్మిక్ ట్విస్ట్ అనేది ఎగ్జయిటింగ్ కాన్సెప్ట్‌గా మారింది. ఇది కథను సరికొత్త విధానం చూపించటంతో పాటు సమాజంపై అర్థవంతమైన వ్యాఖ్యానానికి కూడా అవకాశం దక్కనుంది. దీంతో ప్రేక్షకులు మరోసారి నవ్వులు, రిలేషన్‌షిప్ సమస్యలు, సరదా, కామెడీ డ్రామా ఇలా అన్నీ అంశాలు కలిసున్న ఆల్ ఇన్ వన్ ప్యాకేజ్‌గా సీజన్3ని ఎంజాయ్ చేయొచ్చు.

### సీజన్3లో సరికొత్త సర్‌ప్రైజ్‌గా వెన్నెల కిషోర్:

మొదటి రెండు సీజన్లలో ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న ప్రియదర్శి-జోర్దార్ సుజాత, కృష్ణ చైతన్య-దేవియాని శర్మ, అభినవ్ గోమటం-పావని గంగిరెడ్డి జంటలు సీజన్ 3లోనూ అలరించనున్నారు. ఇక ఈ సీజన్3లో అందరికీ పెద్ద సర్‌ప్రైజ్‌గా వెన్నెల కిషోర్ తనదైన కామెడీతో నవ్వించబోతున్నారు. పోస్టర్ చూస్తుంటే ఆయన పాత్ర చాలా ఆసక్తికరంగా కనిపిస్తోంది. వెన్నెల కిషోర్ పాత్ర కథలో అనూహ్యమైన మలుపులు తీసుకురావటమే కాకుండా, అద్భుతమైన కామెడీ టైమింగ్‌తో పాటు గుర్తుండిపోయేలా డ్రామటిక్ పెర్ఫామెన్స్‌తో సిరీస్‌ను మరింత ఎంటర్‌టైనింగ్‌గా మార్చబోతున్నారని అభిమానులు భావిస్తున్నారు. ఈ అతిపెద్ద ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'సేవ్ ది టైగర్స్ - సీజన్ 3' త్వరలో జియోస్టార్‌లో స్ట్రీమింగ్ కానుంది

# 'పెద్ది' నుంచి బిగ్గెస్ట్ స్పెషల్ సాంగ్ 'హల్లల్ల ల్లో' ప్రోమో రిలీజ్, రేపు పూర్తి పాట రిలీజ్

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా 'పెద్ది' దేశవ్యాప్తంగా హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. ఈ చిత్రం ఇప్పటికే అద్భుతమైన గ్లింప్స్, రెండు చార్ట్ బస్టర్ పాటలు, పవర్ ఫుల్ థియేట్రికల్ ట్రైలర్‌తో ప్రేక్షకులను మెస్మరైజ్ చేస్తోంది. బుచ్చి బాబు సానా దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి ఏఆర్ రెహమాన్ సంగీతం అందించగా, ఈరోజు చిత్ర బృందం మూడవ సింగిల్ 'హల్లల్ల ల్లో' ప్రోమోను విడుదల చేసింది. ప్రోమో చూస్తుంటే ఇటీవలి కాలంలో వచ్చిన అత్యంత ఎనర్జిటిక్, కలర్‌ఫుల్ స్పెషల్ సాంగ్స్‌లో ఒకటిగా నిలవనుందని అర్థమవుతోంది. పవర్ ఫుల్ డ్రమ్ బీట్స్, క్యాచీ రిథమ్, జాతర వాతావరణాన్ని తలపించే ట్యూన్‌తో పాట ప్రేక్షకులను వెంటనే ఆకట్టుకుంటోంది. ఈ పాటలో రామ్ చరణ్ తన రగ్గ్డ్, స్టైలిష్ లుక్‌లో అదిరిపోయే స్టెప్పులతో ఆకట్టుకుంటున్నారు. ఆయనతో పాటు శ్రుతి హాసన్, జాన్వీ కపూర్ కూడా అలరించారు. శ్రుతి హాసన్ తన బోల్డ్ అటిట్యూడ్‌తో, జాన్వీ కపూర్ తన గ్రేస్‌ఫుల్ ఎనర్జీతో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముగ్గురి స్క్రీన్ ప్రెజెన్స్ కలిసి ఈ పాటను మరింత గ్రాండ్‌గా మార్చింది. పూర్తి పాటను రేపు భోపాల్‌లో జరగనున్న భారీ మ్యూజికల్ ఈవెంట్‌లో విడుదల చేయనున్నారు. ఈ వేడుకలో ఏఆర్ రెహమాన్, ఆయన బృందం ఈ పాటను ప్రత్యక్షంగా ప్రదర్శించనుండటంతో అభిమానుల్లో మరింత ఉత్సాహం నెలకొంది. ఈ చిత్రంలో శివరాజ్‌కుమార్, జగపతిబాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ కీలక పాత్రలు పోషిస్తున్నారు. సినిమాటోగ్రఫీని ఆర్. రత్నవేలు అందిస్తుండగా, ఎడిటింగ్ ను జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి నిర్వహిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్‌గా అవినాష్ కొల్లా పనిచేస్తున్నారు. పెద్ది జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదల కానుంది. జూన్ 3న ప్రత్యేక ప్రీమియర్‌లు ప్రదర్శించనున్నారు.






# 'సందిగ్ధం' అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది..

## ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో దర్శకుడు పార్థసారథి

తీర్థ క్రియేషన్స్ బ్యానర్ పై సంధ్య తిరువీధుల నిర్మాణంలో పార్థసారధి కొమ్మోజు దర్శకత్వంలో 'సందిగ్ధం' సినిమా తెరకెక్కింది. ఈ చిత్రంలో నిహాల్, ప్రియా దేశ్ పాగ్, అర్జున్ సిహెచ్, కాజల్ తివారి మెయిన్ లీడ్స్‌లో నటించగా, విలన్ రోల్ లో తెర చేప ఫేమ్ నవీన్ సంకరపు నటించారు. ఈ మూవీని మే 29న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ క్రమంలో ఇప్పటికే వచ్చిన పోస్టర్లు, టీజర్ అందరినీ ఆకట్టుకున్నాయి. శనివారం నాడు ట్రైలర్‌ను రిలీజ్ చేశారు.అనంతరం ట్రైలర్ లాంచ్ కార్యక్రమంలో.. దర్శకుడు పార్థసారథి మాట్లాడుతూ .. ''సందిగ్ధం' ప్రయాణంలో నా భార్య సంధ్య ఎంతో సపోర్ట్ చేశారు. ప్రతీ ఒక్క ఆర్టిస్ట్ మా కోసం ఎంతో కష్టపడ్డారు. అందరూ సపోర్ట్ చేశారు. ఆర్టిస్టులు, టెక్నీషియన్లంతా కలిసి సపోర్ట్ చేయడం వల్లే సినిమాని ఇంత బాగా తీయగలిగాం. 'సందిగ్ధం' అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది. మే 29న మా సినిమాని చూసి ఆడియెన్స్ కూడా సపోర్ట్ చేస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. నిహాల్ మాట్లాడుతూ .. ''సందిగ్ధం' చిత్రీకరణలో నాకు దర్శక, నిర్మాతలు ఎంతో సపోర్ట్ చేశారు. వారిద్దరూ ఎన్నో కష్టాలను దాటుకుని మూవీని ఇక్కడి వరకు తీసుకు వచ్చారు. డిఫరెంట్ కంటెంట్‌తో ఈ మూవీ రాబోతోంది. మే 29న మా మూవీని చూసి హిట్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. కాజల్ తివారి మాట్లాడుతూ .. 'నాకు తెలుగు అంతగా రాదు. సెట్‌లో ప్రతీ ఒక్కరూ నాకు సపోర్ట్ చేశారు. 'సందిగ్ధం'లో నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థాంక్స్. మా చిత్రం మే 29న రాబోతోంది. అందరూ చూడండి' అని అన్నారు. అర్జున్ మాట్లాడుతూ .. ''సందిగ్ధం'లో సత్య అనే మంచి పాత్రను ఇచ్చిన దర్శకుడు పార్థు గారికి థాంక్స్. నిర్మాత సంధ్య గారు మాకెంతో సపోర్ట్ చేశారు. మూవీలో నటించిన ఆర్టిస్టులందరికీ థాంక్స్. మే 29న మా సినిమాని చూసి విజయం అందిస్తారని ఆశిస్తున్నాను' అని అన్నారు. సంగీత దర్శకుడు గౌతమ్ రవిరామ్ మాట్లాడుతూ .. ''సందిగ్ధం' సినిమాలో మ్యూజిక్, ఆర్ఆర్ అద్భుతంగా ఉంటుంది. పార్థసారథి మూవీని డిఫరెంట్‌గా తెరకెక్కించారు. ఈ చిత్రం అందరినీ ఆకట్టుకునేలా ఉంటుంది' అని అన్నారు. నటుడు ఆనంద్ మాట్లాడుతూ .. ''సందిగ్ధం' మూవీని అందరం కలిసి ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేశాం. సినిమా చాలా బాగుంటుంది. ఈ చిత్రం పెద్ద విజయం సాధిస్తుందని ఆశిస్తున్నాను' అని అన్నారు. నటుడు నవీన్ రాజ్ మాట్లాడుతూ .. ''సందిగ్ధం'లో నేను విలన్‌గా నటించాను. ఈ మూవీ చాలా బాగా వచ్చింది. ప్రతీ ఒక్కరూ చక్కగా నటించారు. మే 29న మా చిత్రం రాబోతోంది. అందరూ చూసి సపోర్ట్ చేయండి' అని అన్నారు. నటుడు చిట్టి బాబు మాట్లాడుతూ .. ''సందిగ్ధం' సినిమాని దర్శక, నిర్మాతలు ఎంతో కష్టపడి తీశారు. ఈ చిత్రం మే 29న రానుంది. అందరూ చూసి సక్సెస్ చేయాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. ఈ మూవీకి గౌతమ్ రవిరామ్ సంగీతాన్ని అందించారు. నందన్ కృష్ణ కెమెరామెన్‌గా, విశ్వన్ రాజ్. డిఎస్ ఎడిటర్‌గా పనిచేశారు.

# పెద్ది విజయంపైనే రామ్‌చరణ్ ఆశలు

## బుచ్చిబాబు దర్శకత్వానికి కూడా సవాలే

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్.... ఆర్ఆర్ఆర్ తర్వాత గ్లోబల్ స్టార్‌గా ఎదిగిన ఆయనకు అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించింది. అయితే ఆ తరువాత వచ్చిన సినిమాలు మాత్రం ఆశించిన స్థాయిలో విజయాలు అందుకోలేకపోయాయి. దీంతో ఇప్పుడు చరణ్ కెరీర్‌లో రాబోయే రెండు ప్రాజెక్టులు అత్యంత కీలకంగా మారాయి. ఆచార్యలో కీలక పాత్ర పోషించినప్పటికీ ఆ చిత్రం ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. అనంతరం భారీ అంచనాల మధ్య విడుదలైన గేమ్ ఛేంజర్ కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేకపోయింది.




స్టార్ దర్శకుడు, భారీ బ్జడెట్, భారీ తారాగణం ఉన్నప్పటికీ సినిమా ప్రేక్షకుల అంచనాలను పూర్తిగా అందుకోలేకపోయింది. దీంతో ఇప్పుడు అభిమానుల ఆశలన్నీ చరణ్ తదుపరి చిత్రం 'పెద్ది'పై నిలిచాయి. దర్శకుడు బుచ్చిబాబు సన తెరకెక్కిస్తున్న ఈ చిత్రం గ్రామీణ నేపథ్యంలో సాగే స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ లుక్, గ్లింప్స్, పాటలు, టీజర్‌లకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ముఖ్యంగా చరణ్ మాస్ లుక్, రగ్గడ్ బాడీ లాంగ్వేజ్ అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. చాలా కాలం తర్వాత ఆయనను పూర్తి స్థాయి మాస్ పాత్రలో చూడబోతున్నామనే అంచనాలు అభిమానుల్లో కనిపిస్తున్నాయి. బుచ్చిబాబు తన తొలి చిత్రం ఉప్పెన తోనే దర్శకుడిగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. భావోద్వేగాలను బలంగా తెరపై చూపించడంలో ఆయన ప్రత్యేక శైలి ఉందని సినీ విశ్లేషకులు చెబుతుంటారు. అదే ఎమోషనల్ టచ్ 'పెద్ది'లో కూడా కనిపించనుందనే టాక్ వినిపిస్తోంది. ఇక 'పెద్ది' తర్వాత చరణ్ చేయబోయే సినిమా మరింత ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఎందుకంటే ఆ చిత్రానికి దర్శకత్వం వహించబోయేది సుకుమార్. ఇప్పటికే వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన రంగస్థలం ఇండస్ట్రీ హిట్‌గా నిలిచింది. ముఖ్యంగా చిట్టిబాబు పాత్రలో చరణ్ నటనకు భారీ ప్రశంసలు వచ్చాయి. ఆ సినిమా ఆయన కెరీర్‌లో కీలక మలుపుగా నిలిచింది. ఇప్పుడు మరోసారి అదే కాంబినేషన్ రిపీట్ అవుతుండటంతో అభిమానుల్లో అంచనాలు మరింత పెరిగాయి. ఒకవేళ 'పెద్ది' భారీ విజయాన్ని అందుకుంటే ఆయన మాస్ ఇమేజ్ మరింత బలపడే అవకాశం ఉంది. ఆ తర్వాత సుకుమార్ సినిమా కూడా విజయవంతమైతే గ్లోబల్ స్టార్‌గా ఆయన మార్కెట్ మరింత విస్తరించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# 200 కోట్లు రాబట్టిన కరుప్పు

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, స్టార్ హీరోయిన్ త్రిష జంటగా నటించిన తాజా చిత్రం 'కరుప్పు' తెలుగులో 'వీరభద్రుడు' బాక్సాఫీస్ వద్ద విజయపరంపర కొనసాగిస్తోంది. విడుదలైన కొద్ది రోజులకే ఈ సినిమా భారీ వసూళ్లు నమోదు చేస్తూ కొత్త రికార్డులను సృష్టిస్తోంది. ప్రేక్షకుల నుంచి వస్తున్న విశేష స్పందనతో ఈ చిత్రం తమిళ చిత్ర పరిశ్రమలో హాట్ టాపిక్‌గా మారింది. విడుదలైన వారం రోజుల్లోనే 'కరుప్పు' ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్ల క్లబ్‌లో చేరి సంచలనం సృష్టించింది. ముఖ్యంగా తమిళనాడులో ఈ సినిమా సాధించిన వసూళ్లు ఇప్పుడు సినీ వర్గాల్లో ప్రత్యేక చర్చకు కారణమయ్యాయి.గత తొమ్మిది నెలలుగా తమిళనాడులో ఏ సినిమా అందుకోలేని అరుదైన ఘనతను 'కరుప్పు' సాధించింది. కేవలం తమిళనాడు రాష్ట్రంలోనే రూ.100 కోట్ల మార్క్‌ను దాటిన చిత్రంగా నిలిచింది. ఈ చిత్రాన్ని పంపిణీ చేసిన డిస్ట్రిబ్యూషన్ వర్గాలు కూడా ఈ విజయంపై ఆనందం వ్యక్తం చేస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా రూ.200 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లు నమోదు చేసినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ఈ కలెక్షన్లలో ప్రధానంగా తమిళ వెర్షన్ నుంచే అధిక ఆదాయం వచ్చినప్పటికీ, తెలుగులో 'వీరభద్రుడు' పేరుతో విడుదలైన సినిమా కూడా మంచి ఆదరణ పొందుతోంది.

Published ,printed and owend by Sudheer Kumar Katepally printed at Sree sesha Sai enterprises , plot no .98/part 1,co-operative industrial estate phase-II, Gandhi nagar Hyderabad,Medchal Malkajgiri , Telangana-500037. Published at 6-3-553,Flat no .G2, CLassic Court Ane A, opp:NKM Grand hotel, Erramanzil Colony, Somajiguda, Hyderabad, Telangana-500082.Editor : Sudheer kumar katepally ph: 9000657700 PRGI NO: TGTEL/A2380